ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
7-8-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 187 పేజీలు: 12 వెల: 6.50

పిల్లల్ని కనండి.. 44వేలు పట్టుకోండి
పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిలు
5లో

## భారత్‌పై అమెరికా సుంకం ఇక 50 శాతం




### 25% పెంచిన ట్రంప్ ప్రభుత్వం
### రష్యా చమురు కొనుగోళ్లపై ప్రతీకారం

**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుకున్నంతపనీ చేసారు. రష్యా కొనుగోళ్లు నిలిపి వేయకపోతే 25 శాతం అదనపు సుంకాలు వేస్తామని హెచ్చరించిన ట్రంప్ 24 గంటల్లోనే తన నిర్ణయాన్ని అమలుచేసారు. ఇప్పటికే భారత్‌పై 25శాతం ప్రతీకార సుంకం విధించిన అమెరికా అధ్యక్షుడు ఇకపై భారత్‌నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అమెరికాలో అదనంగా 25శాతం సుంకాలు వసూలు చేస్తారు. అంటే మొత్తం భారత్‌నుంచి వచ్చే ఉత్పత్తులపై 50శాతం సుంకం పడుతుంది. బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకంచేసారు. రష్యానుంచి ప్రత్యక్షంగా పరోక్షంగా చమురు కొనుగోళ్లు జరుపుతున్నందువల్లనే ఈసుంకాలువేసామని ట్రంప్ తనకార్యనిర్వాహక ఉత్తర్వుల్లో స్పష్టంగా వెల్లడించారు. ప్రతీకార సుంకాల్లోభాగంగా ఇప్పటికేవిధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమలులోకి వస్తుండగా కొత్తగా విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఆగస్టు 27 నుంచి వర్తింపచేస్తున్నట్లు ట్రంప్ తన ఉత్తర్వుల్లో వివరించారు. ఒకవేళ ఈసుంకాలకు ప్రతీకారంగా భారత్ ఏదేని సుంకాలు వేయాలని ప్రయత్నిస్తే ఈ ట్యారిఫ్‌లను అధ్యక్షుడు సవరించవచ్చని శ్వేతసౌధం ఒకప్రకటన విడుదలచేసింది. దీనిపై కేంద్రం స్పందనకోసం వాణిజ్యవేత్తలు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే తాజా పరిణామాలపై కాంగ్రెస్ స్పందించింది. ట్రంప్ నిరంతరం మనదేశంపైచర్యలు తీసుకుంటున్నా ప్రధానిమోడీ మాత్రం కనీసం ఆయన పేరును కూడా ప్రస్తావించడంలేదని విమర్శలు ఎక్కుపెట్టింది. ఇప్పటికైనా ప్రధానిమోడీ ధైర్యంచూపించి ట్రంప్ చర్యలక తగిన సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ తన సోషల్‌మీడియా ఖాతాలో పోస్టుచేసింది.

# 15 నుంచి మహిళలకు 'ఉచిత బస్సు'

### ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన భేటీలో కేబినెట్ గ్రీన్ సిగ్నల్
### పల్లెవెలుగు, అల్ట్రా ఎక్స్‌ప్రెస్‌లలో కూడా పథకం అమలు
### చేనేత రంగ బలోపేతానికి పలు కీలక నిర్ణయాలు
### సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్ పాలసీ: సిఎం చంద్రబాబు



బుధవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

**విజయవాడ, ఆగస్టు 6, ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్రంలో స్త్రీశక్తి పేరిట ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని సిఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మార్గదర్శకాలు ఖరారయ్యాయినట్లు వివరించారు. రాష్ట్ర పరిధిలో ఎపి మహిళలకు ఈ పథకం అమలులోకి వస్తుందని తెలిపారు. ఎపి మంత్రి మండలి సమావేశంలో బుధవారం ఎపి సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ బేటీలో దగ్గరదగ్గర 12 అజెండా అంశాలపై చర్చ జరిగింది. అంశాలన్నింటిపైన దాదాపుగా మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని వస్తున్న మహిళ ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమానికి ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికి అయినా ఆర్టీసీ బస్సుల్లో ఈ పథకం అమలుకు నిర్ణయించారు. విద్యార్థినులు ప్రత్యేకంగా పాస్ తీసుకోవాల్సిన అవసరం లేదు. అదే విధంగా ఎపి పరిధిలో ఉంటున్నట్లుగా ఏదైనా గుర్తింపు పొందిన కార్డు ద్వారా ప్రయాణం చేసే అవకాశం కల్పించారు. జీరో టికెటింగ్ విధానం ద్వారా ఈ పథకం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, అల్ట్రా ఎక్స్ ప్రెస్‌లలో కూడా ఈ పథకం అమలులో ఉండనుంది.

ఈ నెల 9న రాఖీ పూర్ణిమ నాడు పథకం అమలు పైన ప్రభుత్వం ప్రకటన చేయనుంది.. 15వ తేదీ నుంచి అమల్లోకి రానుంది ఇక పలు అంశాలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది రాష్ట్రంలో 5.25కోట్ల జనాభా ఉండగా అందులో 2.62 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఈ పథకం క్రింద రాష్ట్రానికి చెందిన మహిళలు, బాలికలు ట్రాన్స్ జెండర్లు ఎక్కడినుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ ప్రయాణించేందుకు అవకాశం కల్పించడం జరిగింది. ఈ సౌకర్యం వినియోగించకునేందుకు వీరు >>2



## రైళ్లలో భద్రతకు సిసి కెమెరాలు

### 74 వేల కోచ్‌లలో ఏర్పాటుకు చర్యలు: రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారతీయ రైల్వేలో ప్రయాణికుల భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ ప్రణాళికను అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 74,000 రైల్వే కోచ్‌లతో పాటు 15,000 లోకోమోటివ్‌లలో (ఇంజిన్లు) సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ నేడు పార్లమెంటుకు తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఇప్పటికే వివిధ రైల్వే జోన్ల పరిధిలో 11,535 కోచ్‌లలో సిసి టివి కెమెరాల ఏర్పాటు పూర్తయిందని మంత్రి వివరించారు. భవిష్య >>2

# 20 లక్షల ఉద్యోగాల కల్పన



బుధవారం విజయవాడలో జరిగిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తు మంత్రి నారా లోకేష్..

### • గ్రీన్ ఎనర్జీ ద్వారా గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు
### • సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్ ఆరంభం • గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌లో మంత్రి లోకేష్

**విజయవాడ, ఆగస్టు 6, ప్రభాతవార్త ప్రతినిధి:** మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్‌లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో 'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఎపి స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌కు మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఈ కాన్ఫరెన్స్ కేవలం దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతం చేయడం, సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్‌గా ఎపిని తీర్చిదిద్దడమే కాదు.. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతం చేసే దిశగా ఈ కాన్ఫరెన్స్‌ను నిర్వహించడం జరుగుతోంది. తద్వారా మనయువతకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దేశంలో ఏపార్టీ సాధించనివిధంగా కూటమి ప్రభుత్వం 94శాతం స్ట్రైక్ రేట్‌తో 164 సీట్లను కైవసం చేసుకోవడంజరిగింది. కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇందుకోసం అందరం కష్టపడి పనిచేస్తున్నాం.

ఒకే రాష్ట్రం ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షిస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తాం. అనంతలో ఆటోమొబైల్, కర్నూలు రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరును ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్‌హబ్‌గా, నెల్లూరులో ఎయిర్ కండిషనర్స్ వంటి స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశంజిల్లాను సిబిజిహబ్‌గా, గుంటూరు, కృష్ణాను క్యాంటమ్ వ్యాలీ హబ్‌గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్‌గా, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటా సెంటర్, ఐటీ హబ్‌గా, మెడికల్ డివైస్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తయారు చేస్తాం. ప్రతి వంద కి.మీలకు ఓ క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్ 20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. దీంతో పాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ప్రైవేటు సెక్టార్‌తో నైపుణ్యం గల యువతను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభించడం జరుగుతోంది. స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, సీడాప్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రం చొరవ తీసుకుని యువతకు అవసరమైన >>2

## 'పి-4' ద్వారా 5 లక్షల కుటుంబాలకు ఉపాధి

### - మంత్రి వాసంశెట్టి సుభాష్

**సచివాలయం, ఆగస్టు 6, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు వైసిపికి కునుకు లేకుండా చేస్తుందని కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఎద్దేవ చేశారు. బుధవారం సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లోనైనా ప్రతిపక్ష హోదాను దక్కించుకునే విషయంపై వైసిపి దృష్టిపెడితే మంచిదన్నారు. కూటమి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో కారుకూతలు కూస్తుంటే రెండు స్థానాలు దక్కవని మంత్రి సుభాష్ విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అపహాస్యం చేసిన వైసిపి నాయకులకు పథకాల అమలు తీరును చూసి దిమ్మతిరిగి పోయిందన్నారు.

ఆగస్టు 15నుంచి స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచితబస్ అందు బాటులో ఉంటుందని సుభాష్ తెలిపారు. అన్నదాత సుఖీభవకూడా అమలు అవుతోందని రైతులందరూ చాలా ఆనందంగా ఉనా న్నరన్నారు. తల్లికి వందనం పై వైసిపి అపహాస్యం చేసి నేడు ప్రజల్లో తలెత్తుకోలేక పోతుందని మంత్రి చురకలంటించారు. సుపరిపాలనలో తొలిఅడుగులో తలెత్తుకుని మా ఎమ్మెల్యేలు మంత్రులు వెళ్లినచోట ప్రజలు >>2

## సిట్ విచారణకు చంద్రశేఖర్ రెడ్డి, శివారెడ్డి

### లిక్కర్ కుంభకోణం కేసు

**విజయవాడ, ఆగస్టు 6, ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిక్కర్ స్కాం కేసులో సిట్ ఎదుట విచారణకు పిఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఎండి చెవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివారెడ్డి హాజరయ్యారు. లిక్కర్ స్కాం కేసులో మిథున్ రెడ్డి అరెస్టు తరువాత పిఎల్ఆర్ సంస్థ ప్రతినిధులను విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు వారు బుధవారం విచారణకు హాజరయ్యారు. లిక్కర్ స్కాం కేసులో పిఎల్ఆర్ సంస్థ ఖాతాల్లోకి డబ్బు బదిలి అయినట్లు వైఎస్సార్సీ ఎంపి మిథున్ రెడ్డి రిమాండ్ >>2

## రాజధాని గ్రామాల్లో రూ. 900 కోట్లతో మౌలిక వసతులు



### ఈ నెలాఖరులోగా డిపిఆర్ సిద్ధం: మంత్రి నారాయణ

**విజయవాడ, ఆగస్టు 6, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని గ్రామాల్లో రూ.900 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తామని, ఆగస్టు ఆఖరుకు డిపిఆర్ సిద్ధం అవుతుందని, పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. త్వరలో టెండర్లు పిలిచి రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, తదితర పనులు ప్రారంభిస్తామని విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో రాజధాని రైతు ఐకాస ప్రతినిధులతో మంత్రి, కమిషనర్ కన్నబాబు భేటీ అయ్యారు. ఆ క్రమంలో రైతులు పలు సమస్యలను మంత్రికి వివరించారు. అమరావతికి చట్టబద్ధత తెచ్చేలా పార్లమెంటులో చట్టం చేసేలా చొరవ చూపాలని రైతులు మంత్రిని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ, వీలైతే ఈ సమావేశాల్లో జరిగేలా చూస్తామనీ, లేదంటే తర్వాత సమావేశాల్లోనైనా అయ్యేలా బాధ్యత తీసుకుంటామన్నారు. అవినీతి అధికారులపై ఫిర్యాదు చర్యలకు మంత్రి సిఫార్సు చేసారు. రైతులు గ్రామకంఠం, పూలింగ్‌కు ఇవ్వని భూముల్లో వచ్చిన ప్లాట్ల సమస్యలు పరిష్కరించాలని కోరగా వాటిని వెంటనే చక్కదిద్దుతామని మంత్రి చెప్పారు.

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న మూడు రాజధానుల పిటిషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని రైతులు సూచించారు. ఆ విషయంలో న్యాయ సలహా మేరకు సాగుతామని మంత్రి బదులిచ్చారు. అర్హులకు ఇంకా కౌలు సరిగా జమ కావడం లేదని రైతులు తెలపగా, నెలలోగా ఆ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి వారికి చెప్పారు. ఆర్5 జోన్ సమస్యనూ త్వరగా కొలిక్కి తెస్తామన్నారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వ నిర్వాకంతో టిడ్కో ఇళ్లు పూర్తి కాకుండా ఈఎంఐలు కట్టాల్సి వస్తోందని రైతులు వాపోయారు. జరీబు, మెట్ట భూముల ప్లాట్ల కేటాయింపులో తేడాలు సవరిస్తామనీ, హెచ్‌టీ లైన్లను భూగర్భంలోకి మార్చేందుకు రూ.1,200 కోట్లతో పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు.

## నేతన్నల బతుకుల్లో కొత్త వెలుగులు

### నేడు చేనేత దినోత్సవం సందర్భంగా 3 పథకాలకు శ్రీకారం
### రూ.189.62 కోట్లతో ఉచిత విద్యుత్ పథకం అమలు
### చేనేతలకిచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చిన సిఎం చంద్రబాబు
### మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచితం



చేనేత మగ్గంపై సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, ఆగస్టు 6, ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో చేనేతల బతుకుల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఏడాది కాలం నుంచి నేతన్నలు తమ కాళ్ల మీద తామే నిలబడి, గౌరవప్రదమైన జీవనం సాగించేలా బృహత్తర కార్యక్రమాలకు నాంది పలికింది. ఒకవైపు నేతన్నలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి వారి ఆర్థిక ఉన్నతికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయం తరవాత అత్యధిక మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2.50 లక్షల మంది చేనేత వస్త్రాల తయారీనే జీవనాధారంగా చేసుకున్నారు. ఎపిలో 986 చేనేత సహకార సంఘాలు నేతన్నలకు ఉపాధి కల్పిస్తున్నాయి. రాష్ట్రంలో చేనేత రంగం రూ.1,374 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. గత ప్రభుత్వ హయాంలో చేనేతలకు ప్రోత్సాహం కరువవ్వడంతో పాటు ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కూడా లభించలేదు. దీంతో 2019-24 కాలంలో రాష్ట్ర చేనేత రంగంలో చీకటి కాలంగా మిగిలిపోయింది. సిఎం చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి నారా లోకేశ్ చేనేత కష్టాలను చూసి చలించిపోయారు. అధికారంలోకి రాగానే నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఇచ్చిన హామీలనను నిలబెట్టుకుంటూ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి చేనేతలకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంఎస్ఎంఇ పార్కుల్లో నేతన్నలకు ప్రత్యేక యూనిట్లు కేటాయిస్తున్నారు. సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి రూ.10 వేల కోట్ల పెట్టుబడితో నూతన టెక్స్ టైల్స్ పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీ ద్వారా 1.51 >>2

## లిక్కర్ స్కాం ప్రధాన నిందితుడు కసిరెడ్డి ఆస్పత్రికి తరలింపు

**విజయవాడ, ఆగస్టు 6, ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కరు స్కాం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డి (ఏ1) విజయవాడ జైల్లో ఉన్నారు. ఆయన ఈరోజు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం జైలు నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన కిడ్నీలో స్టోన్స్ సమస్యతో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. రాజ్ కసిరెడ్డికి చికిత్స అందిస్తున్నారు. ఆయనను చికిత్స అనంతరం తిరిగి కస్టడీకి పంపించే అవకాశం ఉంది. ఈ కేసులో ఆయన విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయన పలు మార్లు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసాయి. ఇటీవల హైదారాబ్‌లో సిట్ సోదాల్లో పట్టుబడిన రూ.11కోట్లు రాజ్ కసిరెడ్డికి చెందినట్లుగా కథనాలు వచ్చాయి. ఈ డబ్బుతో తనకు సంబంధం లేదని రాజ్ కసిరెడ్డి హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసారు.

# పులివెందులలో హోరాహోరీ

### పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారిన జడ్పిటిసి ఎన్నికలు
### పులివెందుల, ఒంటిమిట్ట కైవసానికి టిడిపి, వైఎస్సార్సీ తీవ్ర యత్నాలు

**కడప, ఆగస్టు 6, ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి కడప జిల్లాలో జరగనున్న జడ్పిటిసి ఎన్నికలు తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. గత శాసనసభ ఎన్నికల తరువాత మొదటిసారి జరిగే ఈ ఉప ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు సీరియస్‌గా తీసుకున్నాయి. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఒంటిమిట్ట జడ్పిటిసిగా ఉన్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తన జడ్పిటిసి స్థానానికి రాజీమానా చేయగా, పులివెందుల జడ్‌పిటిసిగా ఉన్న తుమ్మల మహేశ్వర్‌రెడ్డి ఒక ఉత్సవంలో జరిగిన ప్రమాదంలో మరనించడంతో ఈ ఉపఎన్నికలు జరుగుతున్నాయి. ఎలాగైనా ఈ రెండింటిని దక్కించుకోవాలని రెండు పార్టీలు తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నాయి. నామినేషన్ల పర్వం ముగియడంతో పార్టీలు ప్రచారంపై దృష్టి సారించాయి. పులివెందుల మాజీ ముఖ్యమంత్రి జగన్ సొంత మండలం కావడంతో ఎలాగైనా తమ అభ్యర్థిని గెలుపించుకోవాలని వైకాపా నేతలు పావులు కదుపుతున్నారు. పులివెందుల రూరల్ పరిధిలో ఆర్ తుమ్మలపల్లి, రాయలాపురం, రచ్చుమర్రి పల్లి, అచ్చవెల్లి, ఎర్రిపల్లి, కృనపల్లి, యర్రబల్లి, నల్లపురెడ్డిపల్లి, ఈ.కొత్తపల్లి తదితర 9 గ్రామపంచాయ తీలకు సంబంధించి 10601 ఓట్లు కలిగి ఉన్నాయి. గత ఎన్నికల్లో ఈ జెడ్పిటిసి స్థానం వైకాపా ఏకగ్రీవంగా తుమ్మల మహేశ్వర్ రెడ్డి నియామకం అయ్యారు. 2022 మార్చి 19వ తేదీన ఆరు తుమ్మలపల్లి గ్రామ సమీపంలోని గంగమ్మ జాతర నందు సిరిబండి నడుపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడి జడ్పిటిసి మహేశ్వర్‌రెడ్డిమృతి చెందాడు. దీనితో జడ్పిటిస్థానం ఖాళీ అయింది. ఇక ఒక ఏడాది మాత్రమే సమయం ముగుస్తుంది అనగా అనూహ్యంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ జెడ్పిటిసి స్థానానికి ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేసింది. దీనితో వైఎస్సార్సీ తరపున తుమ్మల మహేశ్వర్ రెడ్డి కుమారుడు తుమ్మల హేమంత్ రెడ్డిని బరిలో దింపింది. కూటమి తరపున నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి సతీమణి లతారెడ్డిని బరిలో >>2

## మరో 4 రోజులు వర్ష సూచన

**విజయవాడ, ఆగస్టు 6, ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతంలో ఉత్తర తమిళనాడు తీరంతో పాటుగా రాయలసీమ పరిసర ప్రాంతాల్లో వేర్వేరు ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. వీటి ప్రభావం కారణంగా రాబోయే నాలుగు రోజుల్లో ఎపిలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విజయవాడ(అమరావతి) వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. బుధవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి >>2



బుధవారం అమరావతిలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్

# సిఎంను కలిసిన థాయ్ ప్రతినిధి బృందం

## రాష్ట్రంలో పెట్టుబడులపై ఉన్న అవకాశాలపై చర్చ

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** చెన్నైలోని రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సిఎం చంద్రబాబుతో అమరావతిలో సమావేశమైంది. వీరితో పాటు సిసిఎఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధులూ ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు,పలు అంశాల్లో సహకారంపై సమావేశంలో చర్చించామని సిఎం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాష్ట్రంలో హైడ్రోజన్,గ్రీన్, డిఎపి ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన హెచ్2ఏ ప్రైవేటు లిమిటెడ్,హెల్క్ సంస్థల ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు. మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిని సచివాలయంలో కలిసి తమ ప్రతిపాదనలను వివరించారు.

# చదవలేక పోతున్నా.. అమ్మ దగ్గరికి వెళ్లిపోతున్నా

## ఉరి వేసుకుని బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య



రెడ్డి శ్రావణి (ఫైల్)

**మదనపల్లె క్రైమ్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** నాన్నా, అక్క క్షమించండి.. మీరనుకున్నంత స్థాయిలో చదవలేక పోతున్నా, అమ్మ దగ్గరికి వెళ్లిపోతున్నా అంటూ బిటెక్ విద్యార్థిని సూసైడ్ నోటు రాసి ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన సుధాకర్ రెడ్డి, లేట్ సుగుణ దంపతులకు కుమార్తెలు అశ్విని, ప్రసన్న, రెడ్డి శ్రావణిలు ఉన్నారు. తల్లి సుగుణ 5 సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకొని మృతి చెందగా, తండ్రి సుధాకర్ రెడ్డి అన్నీ తానై చేనేత మగ్గాల పని చేసుకుంటూ ముగ్గురు ఆడపిల్లల్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమార్తె అశ్వినికి వివాహం చేశాడు. రెండవ కుమార్తె ప్రసన్న డిగ్రీ వరకు చదివి ఇంటిపట్టునే ఉంటోంది. మూడో కుమార్తె రెడ్డి శ్రావణి(19) పులివెందుల జెఎన్టీయూ కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. శ్రావణిని, సుధాకర్ రెడ్డి మూడు రోజుల క్రితం కళాశాల వెళ్లి ఇంటికి తీసుకొచ్చాడు. చదువు ఒత్తిడిని భరించలేని రెడ్డి శ్రావణి తనపై నాన్న, అక్క పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టలేక పోతున్నానట్టు తనలో తానే కుంగిపోయి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. 5వ తేదీ మంగళవారం అర్ధరాత్రి నాన్న, అక్క గాఢనిద్రలో ఉన్న సమయంలో తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయాన్నే నిద్ర లేచిన తండ్రి సుధాకర్ రెడ్డి కుమార్తె ఉరికి వేలాడుతుండటాన్ని చూసి మరో కుమార్తె ప్రసన్నతో కలిసి ఆర్తనాదాలు చేశారు.సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృతురాలురాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనంచేసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీహార్‌లోని ఓటరు జాబితాల సమీక్షలో అక్రమాలకు నిరసనగా ఆందోళనలో పాల్గొన్న ప్రియాంక, ఇతర ఎంపీలు

# 20 లక్షల ఉద్యోగాల కల్పన

>> నైపుణ్య శిక్షణ అందిస్తాం. అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. నా ఛాలెంజ్‌ను స్వీకరించి సుజ్లాన్ సంస్థ ఇప్పటికే 2 నైపుణ్య శిక్షణా కేంద్రాలను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువగళం పాదయాత్ర సమయంలో అనంత జిల్లాలోని కియా యాన్సిలరీ యూనిట్స్‌లో మహిళలు పనిచేయడం చూశాను. ఓ మహిళ నావద్దకు వచ్చి నాతో పాటు నడిచారు. ఏం చేస్తున్నారని ఆ మహిళను ప్రశ్నించగా.. తాను కియా యాన్సిలరీ యూనిట్స్‌లో పనిచేస్తున్నానని, గతంలో సాధారణ గృహిణిగా ఉన్న తాను ఇప్పుడు నెలకు రూ.40వేలు సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలిచానని గర్వంగా చెప్పారు. ఇప్పుడు కుటుంబంలో తనకు ఎంతో గౌరవం దక్కుతోందని చెప్పారు. ఒక్క కియా పరిశ్రమ వల్ల అనంతపురం జిల్లాలో వచ్చిన మార్పు ఇది. గ్రీన్ ఎనర్జీ రంగంలోకూడా విస్తృత అవకాశాలు ఉన్నాయి. అందుకే విండ్, సోలార్, రెన్యువబుల్, పంప్డ్ స్టోరేజీ, సిబిజి ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై గౌరవ సిఎం చంద్రబాబు గారు చాలా పట్టుదలతో ఉన్నారు. దీనిని చాలా ప్రాముఖ్యతగా తీసుకున్నాం. ఇందుకోసం ప్రైవేటు సెక్టార్‌తో కలిసి పనిచేస్తాం. ఓంక్యాప్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

# త్వరలో పలు జిల్లాల పేర్లు మార్పు

## కొన్ని నియోజకవర్గాల విలీన ప్రక్రియ

## పాలనా సౌలభ్యం కోసం కొన్ని మండలాలు పక్క జిల్లాల్లో విలీనం

## మళ్లీ సాయం చేయనున్న సింగపూర్

## కేబినెట్ భేటీ అనంతరం సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వంపై సింగపూర్ ప్రభుత్వానికి సడలిన నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందని సిఎం చంద్రబాబు అన్నారు.విశాఖలో నిర్వహించే సమ్మిట్‌కు వారిని ఆహ్వానించి, ఒప్పిం చడానికి ఎంతో శ్రమపడ్డామన్నారు. అమరావతి లోని సచివాలయంలో మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం సిఎం చంద్రబాబు తాజా రాజకీయ అంశాలపై మంత్రులతో చర్చించారు. జగన్ ప్రభుత్వ నిర్వాకం వల్ల సింగపూర్ ప్రభుత్వం భయపడిన తీరు సిఎం వివరించారు. నవంబర్‌లో జరిగే పెట్టుబడుల సదస్సుకు వచ్చేందుకు సింగపూర్ ప్రభుత్వం అంత తేలిగ్గా ఒప్పుకోలేదని తెలిపారు. గత ప్రభుత్వంలో అక్కడకు వెళ్లి సింగపూర్ మంత్రులను సైతం వైఎస్సార్సీ బెదిరిం చిందని మండిపడ్డారు. కేసులు పెడతామని బెదిరించి వాళ్లను భయపెట్టే పరిస్థితి అప్పుడు తెచ్చారని సిఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఉచిత బస్‌ను ప్రారంభించే కార్యక్రమంలో మంత్రులు అందరు పాల్గొనాలని సిఎం స్పష్టం చేశారు. నూతన బార్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కల్లు గీత కార్మికుల కోసం కేటాయించిన షాప్‌లలో బినామీలు వస్తే సహించనని హెచ్చరించారు. మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించక ముందే ఆటో డ్రైవర్లను పిలిపించి మాట్లాడాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. మంచిసూచన అని కితా బిచ్చిన సిఎం వెంటనే ఆటో డ్రైవర్లను పిలిపించి సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలానే రాష్ట్రంలో కొన్ని జిల్లాల పేర్లు మార్పు, పలు నియోజకవర్గాలు పక్కజిల్లాల్లో విలీన ప్రక్రియ ప్రతిపాదనలు నెల రోజుల్లో పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. గత ప్రభుత్వం సృష్టించిన గందరగోళ పరిస్థితికి త్వరితగతిన తెరదించాలని స్పష్టం చేశారు. దీనిపై ఇటీవలే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైనందున పని వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నా వైఎస్సార్సీ నేతలు మన మీద పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వీటిపై మంత్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అందరు తమ సబ్జెక్ట్‌ల మీద బాగా స్టడీ చేస్తూ వెంటనే తిప్పికొట్టాలని సిఎం చంద్రబాబు మంత్రులకు స్పష్టం చేశారు. నేతన్న కుటుంబాలకు మరింత లబ్ది చేకూర్చాల్సిన అవసరంఉందని సిఎం అభిప్రాయపడ్డారు. జాతీయ చేనేత దినోత్సవమైన రేపు వారికి అద నపు లబ్ది చేకూరేలా ఓ ప్రకటన ఉంటుందని అన్నారు.

# సిసి కెమెరాలు

>> త్తులో ప్రతి కోచ్‌లోని రెండు ప్రవేశ మార్గాలవద్ద రెండేసి చొప్పున మొత్తం నాలుగు కెమెరాలను బిగించనున్నట్లు తెలిపారు. అదే విధంగా, ప్రతి రైలు ఇంజిన్‌లో ఆరు కెమెరాలను అమర్చనున్నారు. ఇంజిన్‌కు ముందు, వెనుక, ఇరువైపులా ఒక్కో కెమెరాతో పాటు రెండు క్యాబిన్‌లలో ఒక్కో కెమెరా ఉంటుందని పేర్కొన్నారు. వీటితో పాటు రెండు డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్‌లు కూడా ఉంటాయని ఆయన స్పష్టంచేశారు. ఈ కెమెరాలన్నీ ఉన్నతమైన నాణ్యతా ప్రమాణాలతో ఉంటా యని మంత్రి హామీ ఇచ్చారు. ఎస్‌టీక్యూసీ సర్టిఫికేషన్‌తో పాటు ఆర్‌డీఎస్‌ఓ నిర్దేశాలకు అనుగుణంగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న రైళ్లలో కూడా ఈ కెమెరాలు స్పష్టమైన ఫుటేజ్‌ను అందిస్తాయని ఆయన చెప్పారు. కోచ్‌లలోని డోర్ల వద్ద ఉండే ఉమ్మడి ప్రదేశాల్లో మాత్రమే కెమెరాలను అమర్చడం వల్ల ప్రయాణికుల వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి భంగం వాటిల్లదని మంత్రి భరోసా ఇచ్చారు.

# కుటుంబాలకు ఉపాధి

>> బ్రహ్మరథం పట్టారన్నారు.పి-4 పథకం కింద 5లక్షల మందికి జీవనోపాధి కలిగించబోతున్నారని మంత్రి సుభాష్ తెలియజేశారు.రెడ్ బుక్ పేరు చెప్పితే వైసీపీ నాయకులకు ఎక్కడ లేని రోగాలు వచ్చేస్తున్నాయని మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలకు చట్టరీత్యా చర్యలు ఉంటాయేగాని కక్షపూరిత చర్యలనేవి ఉండవని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

# సిట్ విచారణకు చంద్రశేఖర్ రెడ్డి, శివారెడ్డి

>> రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. ఈ విషయంపై పిఎల్ఆర్ ప్రాజెక్ట్స్ బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు సిట్ అధికారులు. లిక్కర్ స్కామ్ కేసులో మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై నిన్న వాదనలు ముగిశాయి. ఇరువైపు వాదనలు విన్న ఎసిబి కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 12వ తేదీ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. అయితే లిక్కర్ స్కామ్ కేసులో ఏ4గా మిథున్ రెడ్డి ఉన్నారు. ఇదే కేసులో అరెస్టయిన ఆయనప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# ప్రభుత్వంపై అపోహాలు వద్దు

## ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ వాసులతో కలెక్టర్ ఆనంద్

**ఉలవపాడు (నెల్లూరు), ఆగస్టు 6, ప్రభాతవార్త :** కరేడు ప్రాంతంలో నెలకొల్పనున్న ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు కావాల్సిన భూ సేకరణ విషయంలోను, రెండు మూడు గ్రామాల తరలింపు విషయంలోను ప్రభుత్వంపై ప్రజలలో నెలకొన్న అపోహాలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం వారికి అందించే నష్టపరిహారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద లభించే వెసులుబాటులు వసతులు గురించి తెలియజేయడానికి మీ గ్రామ వచ్చానని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కరేడు శివారు గ్రామం ఉప్పరపాలెం ఎస్సీలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలో తిరిగి ఇళ్ల నిర్మాణం, వాతావరణ పరిస్థితులను గమనించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ వారికున్న అనుమానాలను ఒక్కొక్కటిగా సమాధాన పరుస్తూ సుమారు గంటపైనే వారితో గడిపారు.

పరిశ్రమ ఏర్పాటులో భాగంగా ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ తరలించే పరిస్థితి ఏర్పడిందని అందుకుగాను మీరు కోరిన చోట గ్రామ నిర్మాణం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గ్రామస్తులకు తెలిపారు. ఒక కార్డులో 18 సంవత్స రాలు దాటిన వారు ఎంత మంది ఉన్నా వారిని ఒక్కొక్క కుటుంబంగా పరిగనించి ఒక్కొక్కరికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చట్టం ప్రకారం లభించాల్సిన వసతులన్నీ కల్పించబడతాయని కాలనీ వాసులకు వెల్లడించారు. ఒక కుటుంబానికి 5 సెంట్లు ఇళ్ల స్థలం, నూతన గృహ నిర్మాణం, అందులో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు పూర్తిగా కల్పించబడతాయని వాటి బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం ఉంటున్న గ్రామంలోని ఇళ్ల భవనాలు, స్థలాలకు ప్రభుత్వం నిర్దేశించిన చదరపు అడుగు లెక్క ప్రకారం నిర్ణయించిన ఖరీదుకు రెండు రెట్లు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని కలెక్టర్ తెలిపారు.

# మహిళలకు 'ఉచిత బస్సు'

>> ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐ.డి. ప్రూఫులుగా చూపించాల్సి ఉంటుంది. ఈ పథకం నాన్ స్టాప్ అంతర్ రాష్ట్రీయ బస్ సర్వీసులు లేదా ఎ ఇతర కేటగిరీలకు వర్తించదు. అలాగే కాంట్రాక్టు క్యారేజ్ సర్వీస్లు, చార్టెడ్ సర్వీస్లకు మరియు ప్యాకేజ్ టూర్లకు వర్తించదు.

ఈ పథకం అమలు ద్వారా ఇప్పటికే రవాణా సర్వీసులను వినియోగించుకుంటున్న 16.11లక్షలకు అదనంగా 10.84 లక్షల మంది వినియోగించుకునే అవకాశం ఉన్నట్టు అంచనా. తద్వారా సంవత్సరానికి 142 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోనున్నారు. కొత్త రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అమరావతి రెండో విడత భూ సమీకరణ పైన నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా సంస్థలకు భూముల కేటాయింపు నిర్ణయాలకు ఆమోద ముద్రతో పాటుగా మంత్రులతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.వీటితో పాటుగా హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్‌ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచే అంశంపై మంత్రిమండలిలో ఓ నిర్ణయం తీసుకున్నారు. ఏపీఎస్పీ డీసీఎల్, ఏపీసీపీ డీసీఎల్‌లకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వరసగా రూ.3,545 కోట్లు, రూ.1029 కోట్లు మంజూరు చేసిన రుణానికి గానూ ప్రభుత్వ గ్యారెంటీపై కేబినెట్ చర్చించింది.

పాఠశాల విద్యలో పలు జీవోలకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. కాంప్రిహెన్సివ్ ఎపి మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025కు కేబినెట్ చర్చ జరిగింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(మావోయిస్టు) దాని అనుబంధ సంస్థలు, రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్‌లపై మరో ఏడాదిపాటు నిషేధం పొడిగిస్తూ మంత్రిమండలి ఓ నిర్ణయం తీసుకుంది. 22 ఎపి టూరిజం డెవలప్‌మెంట్ హోటళ్లు, ఆరు క్లస్టర్ల పరిధిలోని రిసార్టుల ఆపరేషన్లకు సంబంధించి ఏజెన్సీల ఎంపికకు వీసీ అండ్ ఎండీకి అనుమతులు మంజూరు చేస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. తిరుపతి రూరల్ మండలం పేరూరులో 25 ఎకరాల భూమికి బదులుగా గతంలో ఓబెరాయ్ హోటళ్ల గ్రూపు నిర్మాణానికి ఇచ్చిన టిటిడి ల్యాండ్ బదిలీని రద్దు చేస్తూ కేబినెట్ చర్చించింది. ఎస్‌బిఐ, యూబీఐ బ్యాంకులకు రూ.900 కోట్లు గ్యారెంటీని పవర్ సెక్టార్‌కు ఇస్తూ తీసుకున్న నిర్ణయానికి మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులకు ప్రభుత్వం పలు రాయితీలను ప్రకటించడం జరిగింది. చేనేత మరియు జౌళి రంగాన్ని పటిష్ట పర్చి తద్వారా చేతి మగ్గాలకు నెలకు రెండు వందలు మరియు పవర్ లూంకు ఐదు వందల యూనిట్ల ఉచిత విద్యుత్తు,జీఎస్టీపై ఐదు శాతం రాయితీ మరియు చేనేత సహకార పరపతి సంఘాలకు త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకై చేనేత మరియు జౌళి శాఖ చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. తదుపరి, నేతన్నలందరిలో పొదుపు అలవాటు పెంచేందుకు "త్రిఫ్ట్ ఫండ్" పథకం ద్వారా వారి వేతనాలలో 8, మరో 8 ప్రభుత్వంకలిపి మొత్తం 16 ఫండ్ వేయబడుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా బడ్జెట్ లో వెసులుబాటు లేక తగిన నిధులు విడుదల కాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 202526 సంవత్సరం బడ్జెట్‌లో రూ.5కోట్లు కేటాయించింది. ఇంకా 2017 నుండి 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రూ.17.17కోట్ల బకాయిలను విడుదల చేస్తే, నేతన్నల ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. ఈ మొత్తం పథకాల అమలుకు ప్రభుత్వం రూ.648.59 కోట్లు కేటాయించింది. ఇందులో విద్యుత్తు మాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, త్రిఫ్ట్ ఫండ్, నేటన్న నేస్తం, వంటి పథకాలు ఉన్నాయి.

గత విధానం ప్రకారం 3 సంవత్సరాల లైసెన్స్ వ్యవధి (2022- 25) ఉన్న ప్రస్తుత బార్ విధానం వేలం పద్ధతిపై ఆధారపడి ఉంది మరియు 840 బార్‌లు వేలం వేయబడ్డాయి. ఆ పాలసీ గడువు ఈ నెలాఖరకు ముగుస్తుంది. ఈ పాలసీ ప్రకారం బార్లు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడిన పరిస్థితుల్లో నూతన బార్ పాలసీని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రక్కరాష్ట్రాల్లోని బార్ పాలసీని పరిశీలించి ఈ నూతన పాలసీని రూపొందించడం జరిగింది. లాటరీ ద్వారా బార్‌లను కేటాయించడం, కనీసం నాలుగు ధరఖాస్తులు వస్తేనే ఈ విధానాన్ని అనుసరించడం జరుగుంది. బిజినెస్ అవర్స్ ను కూడా ఉదయం 10.00 గంటల నుండి రాత్రి 11.00 గంటల వరకు అనుమతించడం జరిగింది. మొత్తం 840 బార్లలో 10 శాతం బార్ లను కల్లుగీత కార్మికుల సంక్షేమార్థం 50 శాతం ఫీజుతో రిజర్వు చేయడం జరిగింది. ఈ లైసెన్సు 1సెప్టెంబరు.2025 నుండి ఆగస్టు 2028 వరకు అమల్లో ఉంటుంది. బార్ల బిజినెస్ అవర్సు ఉదయం 10.00 నుండి రాత్రి 11.00 వరకూ అనుమతించింది.

# పులివెందులలో హోరాహోరీ

>> దించారు. కాంగ్రెస్ పార్టీ తరపున అనిల్ కుమార్ రెడ్డిని బరిలో దించగా ఇండిపెండెంట్ లో కలిసి మొత్తం 11 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఈ చిన్న ఎన్నికైన పులివెందుల జడ్పీటీసీ స్థానం వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత ఇలాఖకావడంతో మళ్లీ తిరిగి వైఎస్సార్సీ దక్కించుకోవాలని వారు ప్రయత్నిస్తుండగా ఎలాగైనా ఈ సారి టిడిపి పాగా వేసి సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది. ఇరు పార్టీలు పోటాపోటీగా ప్రచార కార్యక్రమాలను ఎత్తుకు పైఎత్తులను ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే వైఎస్సార్సీ నుంచి ప్రతి గ్రామంలో కూడా టిడిపి వైపు చేర్చుకోవడంలో తెదేపా నాయకులు ప్రయత్నిస్తుంటే పట్టు విడవకుండా తమ సత్తాను నిలుపుకోవాలని వైకాపా ప్రయత్నిస్తోంది.

ఒంటిమిట్ట మండలంలో జడ్పీటీసీ స్థానంలో గత 30 ఏళ్లుగా కాంగ్రెస్, వైఎస్సార్సీ అభ్యర్థుల గెలుపుతున్నారు. 1995లో చివరగా జెడ్పిటిసిగా నరసింహులు గెలుపొందారు. ఆ తర్వాత ఇప్పటివరకు టిడిపి అభ్యర్థులు గెలవలేదు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓట్ బ్యాంకు బలంగా ఉండడంతో పాటు ఎస్సీ సామాజిక వర్గం కూడా ఆ పార్టీకి వెన్ను దన్నుగా ఉంటూ వచ్చింది. అయితే ఓట్ బ్యాంక్ పరంగా గెలుపొందినా భారీ ఆధిక్యతలు పెద్దగా నమోదు కాలేదు. మొదటిసారిగా రెడ్డి సామాజిక వర్గ అభ్యర్థులే అటు వైసిపి టిడిపి తరఫున పోటీ చేస్తున్నడంతో రసవత్తరంగా మారింది. మరోవైపు టిడిపికి బలిజ, చేనేత కార్మికులు, బీసీలు అండగానిలుస్తున్నారు. 13 గ్రామ పంచాయతీలు,24,606 ఓట్లు ఉన్న ఈ మండలంలో ఈ దఫా వైఎస్సార్సీ అభ్యర్థిగా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఇరగం రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మంటపంపల్లె గ్రామపంచాయతీ నుండి పోటీలో నిలిచిన టిడిపి అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు కావడం ఈ దఫా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సామాజికములు చీలికను బట్టి అభ్యర్థుల విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. వైసీపీ పార్టీ అభ్యర్థి మొదట ఖరారు కావడంతో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ రెడ్డి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆయనతోపాటు రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ,మాజీ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్ కుమార్ రెడ్డిలు ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు రాష్ట్రమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం రెండు పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు.మంత్రి రాకతో పార్టీలో జోష్ పెరిగింది. ఈయనతోపాటు ఆ ప్రాంతానికి చెందిన టిటిపి నాయకులు గెలుపు కోసం శ్రమిస్తున్నారు. నేటి నుంచి రాష్ట్ర మంత్రులు జనార్దన్ రెడ్డి, సవిత కూడా ప్రచారంలోకి దిగనున్నారు. ప్రస్తుతం జగన్మోహన్ రాజు,డీసీఎంఎస్ చైర్మన్ జయ ప్రకాష్, పార్టీ పరిశీలకుడు చిట్టిబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు ప్రచారం నిర్వహిస్తున్నారు. కూటమి అభ్యర్థి తరపున బిజెపి జనసేన, టిడిపి ,నేతలకు పంచాయతీల వారీగా బాధ్యతలు అప్పగించి మండలంలో మోహరించనున్నారు. అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆ పార్టీకి ఒంటిమిట్టలో గెలుపు ప్రతిష్టగా మారింది. మరోవైపు పట్టు కోసం వైసిపి సర్వసక్తులు ఒడ్డి పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో జడ్పిటిసి ఎన్నికలు హోరాహోరీగా మారాయి.

## వారం - వర్జ్యం

07-08-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
త్రయోదశి మ.2.24
పూర్వాషాఢ మ.1.57
వర్జ్యం : రా.10.06-11.44
దు.ఉ.10.06-10.57, 2) మ.3.13-4.04
శుభసమయం:ఉ.6.30-7.15
రాహుకాలం – మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రలు చేస్తారు.

**వృషభం:** పేరు ప్రఖ్యాతులకోసం విశేషంగా శ్రమిస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా వుంటుంది.

**మిథునం:** కొత్త వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. భూవివాదాలు పరిష్కారమవుతాయి.

**కర్కాటకం :** మానసిక వత్తిడులనుండి బయటపడతారు. గృహనిర్మాణాలకు శ్రీకారంచుడతారు.

**సింహం:** నూతన పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. నూతన కార్యక్రమాలకు ప్రారంభిస్తారు.

**కన్య :** పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**తుల :** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. కష్టానికి ఫలితం దక్కుతుంది.

**ధనుస్సు:** వటుట్టలతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. అప్రయత్నంగా అవకాశాలు పొందుతారు.

**మకరం:** ఉద్యోగ, విద్యావకాశాలు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి కొద్దిపాటి ఒడిదుడుకులుగా ఉంటుంది.

**కుంభం:** కుటుంబసభ్యుల సహాయం అందుకుంటారు. నూతన పెట్టుబడులకు అనుకూల కాలం.

**మీనం :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేతన్నల బతుకుల్లో కొత్త వెలుగులు

>> లక్షల మందికి ఉపాధి కల్పించాలని ఉద్దేశంగా పెట్టుకుంది. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం, చేనేత వస్త్రాలపై అయిదు శాతం మేర జీఎస్టీ మినహాయింపు, త్రిఫ్ట్ నిధులు మంజూరు పథకాలకు సిఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలన్న లక్ష్యంలో భాగంగా నేతన్నలను వ్యాపారులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి సిఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు.

**నేతన్నకు 50 యేళ్లకే రూ.4 వేల పెన్షన్**

2024లో సిఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం కూడా చేనేతలకు మరోసారి అండగా నిలిచింది. 50 యేళ్ల నిండిన నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నారు. 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ మొత్తం పెంచారు. ఈ ఏడాది జూన్ వరకూ రూ.545.50 కోట్లు నేతన్నల పెన్షన్ల కోసం చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించింది.

**ముద్ర రుణాలు, నూలు సబ్సిడీ అందజేత**

క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాల బలోపేతానికి బ్యాంకు రుణాలు అందజేస్తోంది. గతేడాది 116 చేనేత సహకార సంఘాలకు రూ.40.87 కోట్లను జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా అందజేసింది. ఈ ఏడాది 110 సంఘాలకు రూ.37.75 కోట్లు రుణమివ్వడానికి నిర్ణయించింది. ప్రధాన మంత్రి చేనేత ముద్ర యోజన పథకం(ముద్ర) కింద నేతన్నలకు గతేడాది వర్కింగ్ కాపిటల్ నిమిత్తం రూ.33.25 కోట్లు అందించింది. 3,367 నేతన్నలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పించింది. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో జూన్ వరకు 294 మందికి రూ.2.57 కోట్లు మంజూరు చేసింది. ముడి పదార్థాల సరఫరా పథకం నూలు కొనుగోలుపై కూటమి ప్రభుత్వం 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. సహకార సంఘాలకు, వ్యక్తిగతంగా పలువురు నేతన్నలకు రూ.164.24 కోట్ల విలువైన నూలును 15 శాతం సబ్సిడీపై ఇవ్వగా, దీనివల్ల లబ్ధిదారులకు రూ.24.63 కోట్ల మేర లబ్ధి కలిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 135 మంది స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.13.50 లక్షల విలువైన నూలును ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున కూటమి ప్రభుత్వం అందజేసింది.

**నేడు 3 పథకాలకు సిఎం చంద్రబాబు శ్రీకారం..**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ, సిఎం చంద్రబాబునాయుడు చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకానికి గురువారం శ్రీకారం చుడుతున్నారు. చేనేత దుస్తులపైనా 5 శాతం జీఎస్టీ మినహాయింపు పథకాన్ని కూడా ప్రారంభిస్తున్నారు. చేనేతలకు రూ.5 మేర త్రిఫ్ట్ నిధులు మంజూరు చేస్తున్నారు. ఉచిత విద్యుత్ కోసం ఏడాదికి రూ.190 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. జీఎస్టీ మినహాయింపునకు ఏడాదికి రూ.15 కోట్లను నేతన్నలకు చెల్లించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకంతో మగ్గాలపై నేసే నేతన్నలకు నెలకు1,233ల చొప్పున్న ఏడాదికి రూ.14,956లు, మర మగ్గాలపై ఆధారపడిన వారికి నెలకు రూ. 2,717ల చొప్పున్న 32,604ల మేర లబ్ధి కలగనుంది. చేనేత కుటుంబాలకు త్వరలో ఆరోగ్య బీమా పథకం వర్తింపజేయడానికి ప్రణాళికలు రూపొందించింది. త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టింది.

# మరో 4 రోజులు వర్ష సూచన

>> భారీ వర్షాలు కురిసాయి.మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని వివరిచారు. వైఎస్సార్ కడప, చిత్తూరు, ఎన్టీఆర్, పల్నాడు, అనకాపల్లి, తిరుపతి, ప్రకాశం, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, కృష్ణా తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అందుబాటులోకి వచ్చి సమాచారాన్ని అనుసరించి నేటి ఉదయం వర్షపాతాల రికార్డును అనుసరించి గోరంట్లలో అత్యధికంగా 51.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చిలమత్తూరులో 38, అనంతపురం అర్బన్‌లో 37, బుక్కరాయ సముద్రంలో 36, పరిగిలో 35, కంబదూరులో 32, తలుపులలో 31, నంబులపూలకుంటలో 30, వజ్రకరూరులో 24, ఆత్మకూరులో 21, విడపనకల్లు 18, నల్లచెరువు 18 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తనకల్లు, విడపనకల్లులో 18 మిల్లీమీటర్ల చొప్పున, బ్రహ్మసముద్రం 16, పెనుకొండ 14, కళ్యాణదుర్గం 13, మడకశిర 12, ముదిగుబ్బ 25, అనంతపురం గ్రామీణం 13, యల్లనూరు 12, సోమందేపల్లి 10, ఉరవకొండ 9 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాఖ ప్రధాన డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఆగస్టు 11 తర్వాత నైరుతి రుతుపవనాలు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ సహా కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రపంచ వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది.ఉత్తర తమిళనాడుకు నైరుతి దిశగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావం కారణంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత రెండు రోజులుగా వానలు దంచికొడుతున్నాయి.



## దెబ్బకొట్టినోడికి నొప్పి తెలిసేలా చేసేందుకే 'యాప్' : మాజీ సిఎం వైఎస్ జగన్

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక మనిషిని జైల్లో పెట్టడమంటే ఆ వ్యక్తి పరువు,ప్రతిష్టతో ఆడుకోవడమేనని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం తీవ్ర అరాచకాలను చేస్తోందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక స్వరం వినిపించే వారిపైనా దొంగ సాక్ష్యాలు సృష్టించి కేసులు పెడుతున్నారు. జైలుకు పంపి వారి పరువు తీస్తున్నార. ఒక కేసులో బెయిలు వచ్చి బయటకొచ్చేలోపే మరో కేసు పెట్టి,వారిని జైల్లోనే ఉంచేస్తున్నారు 14 నెలల చంద్రబాబు పాలన చూస్తే కలియుగమంటే ఇదే కదా అనిపిస్తోంది. ఎక్కడా న్యాయం,ధర్మం లేదు'అని విమర్శించారు..'పార్టీ కోసం ఎవరెవరు పనిచేస్తున్నారో పక్కాగా డేటాబేస్ తయారు చేస్తున్నాం. అధికారంలోకి రాగానే దాని ఆధారంగానే వారికి గుర్తింపునిస్తాం. యూనిఫాం, అధికారం ఉందని అధికార దుర్విని యోగానికి పాల్పడుతూ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న వారి డేటాబేస్‌నూ సిద్ధం చేస్తున్నాం. ఇందు కోసం లాయర్ల పర్యవేక్షణలో సిద్ధం చేసిన 'యాప్'ను త్వరలో ఆవిష్కరించ బోతున్నాం. ఏ కార్యకర్తయినా వారిని ఇబ్బంది పెట్టిన అధికారి పేరు, హోదాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే అది మా దగ్గర డిజిటల్ లైబ్రరీకి చేరుతుంది. దెబ్బతగిలనోడి భాధ,ఆ దెబ్బ కొట్టినోడికి తెలిసేలా చేసేందుకే ఈ యాప్. అధికారంలోకొచ్చాక ఈ డిజిటల్ లైబ్రరీని తెరిచి, అందులో ఉన్న డేటా ప్రకారం కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరినీ జైలుకు పంపిస్తాం'అని అన్నారు. అమరావతి నిర్మాణం పేరుతో దోచేస్తున్నారని ఆరోపించారు.

## రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకున్న సిక్కిం సిఎం

### ఏర్పాట్లు పర్యవేక్షించిన ఇఒ

**శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్ కుటుంబ సభ్యులతో జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఇఒ టి.బాపిరెడ్డి స్వాగతం చెప్పారు. ఏర్పాట్లను ఎఇఒ మోహన్,టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామిలు పర్యవేక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలకు దేశ,విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు. ఈ సేవద్యంలో బుధవారం సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్ కుటుంబసభ్యులతో రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఇఒ టి.బాపిరెడ్డి వేదపండితుల వేదమంత్రాలతో మేళ తాళాలతో స్వాగతం పలికారు. సిఎం ఆలయానికి రాగా ఇక్కడ నిర్వహించే రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. ఇఒ బాపిరెడ్డి వెంటనే ఆలయంలోని సహస్రలింగేశ్వ రాలయం వద్ద ప్రత్యేక పూజా టిక్కెట్లు కొనుగోలు చేసి ఏర్పాటు చేసారు. వేద పండితులు వేద మంత్రాలతో పూజలు జరిపించారు. తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి గురుదక్షిణా మూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.



సిక్కిం ముఖ్యమంత్రికి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందిస్తున్న ఇఒ బాపిరెడ్డి

# తిరుమల సమాచారం

## నారాయణగిరి శ్రీవారి పాదాలకు ఛత్రస్థాపనం

**తిరుమల,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠం నుండి కలియుగవైకుంఠం శేషాచలంలోని నారాయణగిరిశిఖరంపై తొలిసారి పాదం మోపిన శ్రీవేంకటేశ్వర స్వామి పాదాలకు బుధవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంనుండి మంగల వాయిద్యాల నడుమ పూజాసామాగ్రి, పుష్పాలు, నైవేద్యం, గొడుగుతో ఆలయ మాఢవీధుల మీదుగా అర్చకులు మేదరమిట్టకు చేరుకున్నారు. అక్కడ నుండి నారాయణగిరికి విచ్చేశారు. ముందుగా శ్రీవారి పాదాలకు శాస్త్రోక్తంగా పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరిజలంతో అభిషేకం చేశారు. అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. వేదపారాయణదారులు ప్రబందశాత్తుమొర వినిపించారు. భక్తులకు ప్రసాద వితరణ చేయడంతో పాదాలకు ఛత్రస్థాపనోత్సవం ముగిసింది. ఈ కాలంలో గాలులు ఎక్కువగా వీస్తాయి కావున పాదాలకు రక్షణ కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్టిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి,ఆలయ అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.



## సిపిఐ, అనుబంధ విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలపై నిషేధం మరో ఏడాది పొడిగింపు : మంత్రి కొలుసు పార్థసారథి

### - జర్నలిస్టుల అక్రెడిటేషన్ మంజూరుకు కొత్త నిబంధనలు

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:**కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) ఫ్రంట్ సంస్థలు, రాడికల్ యూత్ లీగ్ .రైతు కూలీ సంఘం గ్రామీణ పేదల సంఘం రాడికల్ స్టూడెంట్స్ యూనియన్. సింగరేణి కార్మిక సమాఖ్య.విప్లవ కార్మిక సమాఖ్య ,ఆల్ ఇండియా రివల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్, రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ నిషేదాన్ని పొడిగించినట్లు ఏపీ సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. సచివాలయంలోని సమాచార కేంద్రంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్, 1992, (చట్టం నం. 21 ఆఫ్ 1992) సెక్షన్ 3 మరియు దాని ఉపక్లాజుల ప్రకారం చట్టవిరుద్ధ సంఘాలుగా ప్రకటించడంపై నిషేధాన్ని మరో సంవత్సరం పాటు పొడిగించేందుకు సాధారణ పరిపాలన శాఖ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిషేధం అమలులో ఉన్నప్పటికీ, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) ఆంధ్రప్రదేశ్‌లో తమకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) పోలీస్ ఇన్ఫార్మర్లు అని పేరుతో పౌరులను లక్ష్యంగా చేసుకోవడం, ముఖ్యంగా అల్లూరి సీతారా మరాజు జిల్లా లలో ప్రభుత్వ ఆస్తు లను దెబ్బతీయ డంతో పాటు తెలంగాణ, ఒడిశా మరియు ఛత్తీస్‌గఢ్ పొరుగు రాష్ట్రాల నుండి వచ్చిన వారి కేడర్‌లతో కలిసి వినాశకార కార్యకలాపాలను కొనసాగి స్తోంది. 2024 ఆగస్టు నుండి ఇప్పటి వరకు నిషేధ కాలంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) 9 నేరాలు చేసిందని తెలిపారు. పుట్టపర్తి, మొవ్వ, గన్నవరం, గాజువాక మరియు తిరుపతి తదితర ఐదు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన మంజూరు చేయడానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు.ప్రస్తుత ఏపీ మీడియా అక్రిడిటేషన్ నిబంధనలు, 2023లో జారీ చేసిన జీవోను రద్దు పరిచి రద్దుపరచి, దాని స్థానంలో కొత్తగా రూపొందించిన "కాంప్రహెన్సివ్ ఏపీ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025" ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కొత్త సమగ్ర,సమీకృత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025కు కేబినెట్ ఆమోదం కోరుతూ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. తద్వారా, రాష్ట్ర హెడ్ క్వార్టర్స్, పబ్లిషింగ్ సెంటర్లు, ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ మంజూరు చేయడం కోసం ఉన్న ఆంధ్రప్రదేశ్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2023, జీవో 38ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల స్థానంలో క్రొత్తగా రూపొందించిన ఆంధ్రప్రదేశ్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025 అమలులోకి రానుంది.



## శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు పవిత్రమాలలు

**తిరుమల,ఆగస్ట్ 6ప్రభాత వార్తప్రతినిధి:** అఖిలాం డకోటి బ్రహ్మాండ నాయకుడు ఏడు కొండల శ్రీవేంకటేశ్వర స్వామి మూలవిరాట్టుకు పవిత్రోత్సవాల్లో రెండోరోజు బుధవారం ఉదయం పవిత్ర మాలలు సమర్పిం చారు. ఆలయంలోపల ఆనంద నిలయం విమాన వేంకటేశ్వ రునికి. ధ్వజస్తంభానికి, ఉపఆలయాల్లో స్వామివార్లకు, ఉత్సవమూర్తులకు, బేడి ఆంజనేయస్వామికి పవిత్రమాలలు సమర్పించారు. ప్రతి ఏడాది



మూడురోజులుపాటు జరిగే పవిత్రోత్సవాల్లో రెండవరోజు బుధవారం ఉదయం ఆలయంలోపల సంపంగిప్రాకారంలోని కల్యాణోత్సవమండపం యాగశాలలో వేడుకగా శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు హోమాలు వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## ప్రతి ఎకరాకు సాగు నీరందేలా రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలి :మంత్రి నిమ్మల

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా ఈస్టర్న్ డెల్టా చివరన ఉన్న ప్రతి ఏకరాకు సాగు నీరందేలా రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ను జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు ప్రకాశం బ్యారేజ్ నుండి 10,400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా దిగువన ఉన్న రైతులకు సాగు నీరు అందడం లేదని, దీనిపై గత 20 రోజులుగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కృష్ణాజిల్లాలోని పెడన, గుడివాడ నియోజక వర్గాల్లో పర్యటించిన మంత్రి వడ్లమన్నాడు డ్రైన్, గుడ్లవల్లేరు లాకులను స్వయంగా పరిశీలించి రైతుల సాగునీటి కష్టాలు అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ శాఖలోని సిఈ స్థాయి నుండి కింది స్థాయి ఉద్యోగులు అందరరూ కెనాల్స్ పై తిరుగుతూ రైతులకు సాగు నీరు అందేలా పర్యవేక్షించాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఒక ఏడాది వరదలు వస్తే, రెండు మూడు సంవత్సరాలకు సరిపడేలా వాటర్ మేనేజ్ మెంట్ ద్వారా నీటి నిల్వలు చేయాలని చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. నాడు రూ.1350 కోట్లతో చంద్రబాబు పట్టిసీమ నిర్మిస్తే, పట్టిసీమ కాదు అది ఒట్టిసీమ అని జగన్ అసెంబ్లీలో ఎద్దేవా చేశాడని, అదే పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు గోదావరి జలాలు తీసుకొచ్చి 50వేల కోట్ల ఆదాయం సృష్టించామని స్పష్టం చేశారు. గత 5ఏళ్ళ వైసిపి పాలనలో నిర్వీర్యమైన సాగు నీటి సంఘాలకు చంద్రబాబు పునరుజ్జీవం పోయడంతో ఇరిగేషన్ వ్యవస్థ బాగుపడింది అని తెలిపారు. వైసిపి పాలనలో కాలువల్లో పూడిక తీత, డీసిల్టింగ్ పనులు చేయలేదని, ఈపనులకు 5ఏళ్ళలో 100 కోట్లు కూడా కేటాయించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అత్యవసర పనుల కింద రూ.700 కోట్లు కేటాయించి కాలువల్లో పూడిక తీత వంటి పనులను సాగు నీటి సంఘాల సహకారంతో పూర్తి చేయగలిగామని అన్నారు.గత ప్రభుత్వం శ్రీశైలం ప్లంజ్ పూల్ ప్రమాదం లో ఉంటే గత 5ఏళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, శ్రీశైలం ప్లంజ్ పూల్, ధవళేశ్వరం గేట్ల మారమ్మతులకు రూ.350 కోట్లు కేటాయించామని తెలిపారు మంత్రి నిమ్మల.జగన్ వ్యవహార శైలి చూస్తుంటే రానున్న రోజుల్లో ఇప్పుడొచ్చిన సీట్లు కూడా రావని, అందుకే విద్రోహ చర్యలకు పాల్పడుతూ తన కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడని పేర్కొన్నారు.

## కేంద్రం నుంచి వచ్చిన ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదల చేయండి

### డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు సిపిఐ(ఎం) కార్యదర్శి శ్రీనివాసరావు బహిరంగ లేఖ



**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:**కేంద్రం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లు వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచుల వేతనాలు పెంచాలని, గ్రామ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి బుధవారం ఏపీ సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు లేఖ రాశారు. రాజ్యాంగం ప్రసాదించిన మూడు దొంతరల అధికార వ్యవస్థలో దిగువనున్న స్థానిక సంస్థలకు నిధులు, విధులు బదలాయించడంలో ఇప్పటికీ లోపాలు కొనసాగుతున్నాయి. రోజురోజుకి కేంద్రీకరణ బలపడుతోంది. అభివృద్ధిలో స్థానిక సంస్థలైన పంచాయితీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. కాని కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వ కేంద్రీకృత విధానాల వలన పంచాయతీల్లో అభివృద్ధి పడకేసింది. రాష్ట్రంలో సర్పంచులు పార్టీయేతర ప్రాతిపదికపై ఎన్నికై 4సంవత్సరాలు దాటుతోంది. ఎన్నో ఆశలతో గ్రామాల్లో అభివృద్ధి చేద్దామనే ఉత్సాహంతో ఎన్నికైన సర్పంచులు నిధుల్లేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక అభివృద్ధి కార్యక్రమాలు నత్తనడకన నడుస్తున్నాయి. రాష్ట్రంలో ఎస్.సి, ఎస్టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన సర్పంచులు 50 శాతం పైగా ఉన్నారు. వారందరూ అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తే, వాటికి చెందిన బిల్లులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదు. పంచాయితీలకు ఇవ్వవలసిన ఆర్థిక సంఘం నిధులు ఇవ్వలేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బకాయిల పేరుతో దారిమళ్ళించారు అని వి.శ్రీనివాసరావు లేఖలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదట విడత నిధులు విడుదల చేసినా, గత 6 నెలలుగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15 ఆర్థిక సంఘం రెండవ విడత నిధులు రూ.1121 కోట్లు విడుదల చేయకపోవడంతో వారు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాటి కోసం చాలా కాలంగా ఆందోళన చేస్తున్నారు. అయినా ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఈ సమస్యల పరిష్కారానికి పంచాయతీ శాఖ బాధ్యతలు చూస్తున్న పవన్ కళ్యాణ్ శ్రద్ధ చూపాలని వి. శ్రీనివాసరావు లేఖలో కోరారు. ఈ క్రింది చర్యలు తీసుకొని స్థానిక సంస్థలను, గ్రామ స్వపరిపాలనను ప్రోత్సాహించాలని వి. శ్రీనివాసరావు పవన్ కళ్యాణ్ ని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుండి 6 నెలల క్రితం విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయితీల ఖాతాలకు వెంటనే విడుదల చేయాలన్నారు.

## ఎస్వీ అన్న ప్రసాదంకు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా నిరంత రాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్న అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఓ దాత విరాళాలందించారు. ఈ ట్రస్ట్‌కు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి భక్తులకు ఇతోధికంగా సేవలందించేందుకు సహకరిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ వాసి లీలాకుమార్ వెంకటనారాయణ కాజా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు 10క్షలు రూపాయలు చెక్కు ను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

**తిరుమల,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవవ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోవడంతో ఆనందంగా ఉందని, స్వామిఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్, కర్నాటక హోంమంత్రి పరమేశ్వర కుటుంబసభ్యులతో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయడమైనది.

టు,
ఋణగ్రహీత'ల చిరునామా: మెస్సర్స్ కార్తికేయ బిల్డింగ్ మెటీరియల్స్, ప్రొప్రయిటర్ : శ్రీ మద్దిపట్ల శ్రీనివాస్, తండ్రి : శ్రీ ఆదినారాయణ మద్దిపట్ల, డి.నెం.6-2-12, దుద్దుపూడి వారి వీధి, కొవ్వూరు, కొవ్వూరు మండలం, తూర్పు గోదావరి జిల్లా-534350. శ్రీ మద్దిపట్ల శ్రీనివాస్, తండ్రి : శ్రీ ఆదినారాయణ మద్దిపట్ల, డి.నెం.6-2-12, దుద్దుపూడి వారి వీధి, కొవ్వూరు, కొవ్వూరు మండలం, తూర్పు గోదావరి జిల్లా-534350.

సర్ / మేడమ్
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి తేది.10-06-2022న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా తేది.10-06-2022 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.76,57,342/- (అక్షరాల డెబ్బై ఆరు లక్షల యాభై ఏడు వేల మూడు వందల నలభై రెండు రూపాయలు మాత్రమే) + తేది.11.06.2022 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.
మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని తేది.16.08.2022న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును తేది.22-08-2022న (ఈనాడు : కొవ్వూరు క్లస్టర్ ఎడిషన్ (తెలుగు) మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ : తాడేపల్లిగూడెం ఎడిషన్ (ఇంగ్లీష్)) దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.
తేది.10-06-2022 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేదీ నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల బ్యాంక్‌నకు తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుటకు ఇ-వేలం/బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**
ఐటమ్ నెం.1: తూర్పు గోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, కొవ్వూరు మున్సిపల్ ఏరియా, డి.నెం.6-2-9 లోని 6వ వార్డు వద్ద 300 చ॥గ॥ల విస్తీర్ణం గల నివాస ఖాళీ స్థలం మరియు అందు నిర్మించిన టైల్ రూఫ్డ్ భవనం యావత్తు ఆస్తి శ్రీ మద్దిపట్ల శ్రీనివాస్ గారి పేరున కలదు. (రిజిష్టర్డు గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నెం.4040/2005, తేది.19-12-2005, కొవ్వూరు ఎస్ఆర్ఓ ప్రకారం) : హద్దులు: తూర్పు: శ్రీ డి. రామారావు గారికి చెందిన ఆస్తి, పడమర : వీధి, దక్షిణం : కామన్ ఏరియా, ఉత్తరం: డి. శ్రీరాములు మరియు ముll వారికి చెందిన ఇల్లు.
ఐటమ్ నెం.2: తూర్పు గోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, కొవ్వూరు మున్సిపల్ ఏరియా, డి.నెం.6-2-12 లోని 6వ వార్డు వద్ద 300 చ॥గ॥లు విస్తీర్ణం గల నివాస ఖాళీ స్థలం మరియు అందు నిర్మించిన ఆర్‌సిసి రూఫ్డ్ నివాస ఇల్లు యావత్తు ఆస్తి శ్రీ మద్దిపట్ల శ్రీనివాస్ గారి పేరున కలదు. (రిజిష్టర్డు గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నెం.4040/2005, తేది.19-12-2005, కొవ్వూరు ఎస్ఆర్ఓ ప్రకారం) : హద్దులు: తూర్పు: కంఠమణి భాస్కరరావు గారికి చెందిన ఇంటి ఆస్తి, పడమర: డి.రాజారామన్న గారికి చెందిన ఖాళీ స్థలం, దక్షిణం: శ్రీ డి.రామారావు గారి గారికి చెందిన ఆస్తి, ఉత్తరం: పాతాళ దిబ్బ కొంతమేర మరియు రోడ్డు కొంతమేర.

తేది: 30-07-2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

## ట్రాలీ ఆటో బోల్తా - 22 మందికి గాయాలు

### మాజీ మంత్రి బుగ్గన కుమారుని పెళ్లి వేడుకలకు వెళ్లి వస్తుండగా దుర్ఘటన

### వెల్దుర్తి వద్ద ఆటో టైరు పేలడంతో ప్రమాదం



క్షతగాత్రుల్ని వైద్యశాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి

**వెల్దుర్తి,ఆగస్టు6,ప్రభాతవార్త :** రాష్ట్ర మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుని వివాహ వేడుకలకై నంద్యాల జిల్లా బెతేంచర్ల మండలం యంబాయి రుద్రవరం గ్రామానికి చెందిన ప్రజలు డోన్ పట్టణ శివారులో జాతీయరహదారి ప్రక్కన దత్తాత్రేయ ఆలయ సమీపంలో బుధవారం జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు.వివాహ వేడుకల అనంతరం వారు ట్రాలీ ఆటోలో వెల్దుర్తి, రామళ్లకోట మీదుగా వారి స్వగ్రామమైన రుద్రవరానికి వెళ్లేందుకు బయలుదేరారు.అయితే వారు ప్రయాణిస్తున్న ఆటో కర్నూలు జిల్లా వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెల్దుర్తి పట్టణ సమీపంలోని రైల్వే గేట్ వద్దకు రాగానే జాతీయరహదారిపై ఆ ఆటో టైరు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆ ఆటోలో ప్రయాణిస్తున్న వారు ఒకరిపై ఒకరు ఆటో కింద కొందరు రోడ్డుపై కొందరు కిందపడ్డారు.దాదాపు 26 మందికి గాయాలు అయినట్లు తెలిసింది.ఇదే దారిలో వెళ్తున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తమ వాహనాన్ని ఆపి క్షతగాత్రుల వద్దకు చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నారు.ఆమె 108 అంబు లెన్స్‌కు ఫోన్ ద్వార రోడ్డు ప్రమాద సమాచారం ఇచ్చి తీవ్రగాయాలపాలైన వారిని వెల్దుర్తి వైద్యశాలకు తరలించేలా చర్యలు తీసుకున్నారు.మిగతా వారందరు వెల్దుర్తి సిహెచ్‌సి వైద్యశాలకు చేరుకున్నారు.వీరికి వైద్యుల పర్యవేక్షణలో వైద్యసిబ్బంది చికిత్స చేశారు.అనంతరం వీరిలో తీవ్రగాయాపాలైన బాలరాజు (నడుమునొప్పి),చంద్రశేఖర్(తలకు) గాయం కాగా వీరితో పాటు మరో నలుగురు నాగేశ్వరరావు,గోవిందు,పుల్లయ్య,దిలీప్‌లను చికిత్సకై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## జిఎస్టీ వసూళ్లపై టిడిపి తప్పుడు ప్రచారాలు

### - మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



**విజయవాద.,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** వైయస్సార్ సీపీ పాలనలో జీఎస్టీ ఆదాయం పై టీడీపీ కుట్రపూరితంగా లేనిపోని అనుమానాలు, అపోహాలు సృష్టిస్తోందని వైయస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆరోపించారు.2025 జూలై జీఎస్టీ ఆదాయం వృద్ధిపై టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.వైయస్సార్ సీపీ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసారు.తమ ప్రభుత్వ పాలనలో ఆర్థిక రంగంలో అద్భుత విజయాలు సాధించాం. కూటమి ప్రభుత్వం నాటి గణాంకాలను తప్పుగా అన్వయిస్తూ..విధ్వంసం జరిగిందంటూ దుష్ప్రచారాలు చేస్తోంది. కూటమి సర్కారు అసమర్థత, లోపభూయిష్ట విధానాల వల్లే 2024 జూలైలోను, ఆ తర్వాత మాసాల్లో సైతం జీఎస్టీ ఆదాయం వృద్ధి పడిపోతూ వచ్చింది. 2025 జూలైలో జీఎస్టీ ఆదాయంలో 14 శాతం వృద్ధి అన్నది కూటమి సర్కారు పాలనలో ఆర్థిక ప్రగతి మెరుగుపడటం వల్లనో.. వారు ఉత్తమ, మెరుగైన విధానాలు అమలు చేయడం వల్లనో వచ్చింది కాదు.జూలై 2024లో జీఎస్టీ వసూళ్ల దారుణంగా పడిపోయాయి..ఆ నెలతో పోల్చడం వల్ల 2025 జీఎస్టీ ఆదాయం వృద్ధి చెందినట్లు కనిపిస్తోంది. కూటమి సర్కారు సరైన దిశ లేకుండా..లోపభూయిష్టమైన ఆర్థిక విధానాలు అవలంభించడం వల్ల గత ఏడాది జీఎస్టీ వసూళ్ల దారుణంగా పడిపోయాయి. 2023 జూలై నికర జీఎస్టీ ఆదాయంతో జూలై 2025 జీఎస్టీ ఆదాయాన్ని పోల్చి చూస్తే.. (రెండేళ్ల కాలంలో) కేవలం 6.3 శాతమే వృద్ధి మాత్రమే న మో దైంది. 2023 జూలై నికర జీఎస్టీ వసూళ్ల రూ. 2,755 కోట్లు కాగా, జూలై 2025 జీఎస్టీ వసూళ్ల రూ.2,930 కోట్లు. అంటే ఏడాదికి సగటున 3.13 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. అదేవిధంగా, స్థూల జీఎస్టీ ఆదాయం వృద్ధి కేవలం 2.88 శాతం మాత్రమే. చాలా తక్కువ వృద్ధి నమోదైంది.

**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయడమైనది.

టు, ఋణగ్రహీత'ల చిరునామా: శ్రీమతి కదలి సరోజిని, భర్త : లేటు శ్రీ కదలి వెంకటేశ్వరరావు (కదలి వెంకటేశ్వరరావు గారి చట్టరీత్యా వారసురాలు), డి.నెం.1-243, ఎన్‌టిఆర్ వాటర్ ప్లాంట్ దగ్గర, వెదురుపాక సావరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346. కుమారి కదలి ఇంధు, తండ్రి : కదలి వెంకటేశ్వరరావు (లేటు), డి.నెం.1-243, ఎన్‌టిఆర్ వాటర్ ప్లాంట్ దగ్గర, వెదురుపాక సావరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346. కుమారి కదలి సాయి లక్ష్మి, తండ్రి : కదలి వెంకటేశ్వరరావు (లేటు), డి.నెం.1-243, ఎన్‌టిఆర్ వాటర్ ప్లాంట్ దగ్గర, వెదురుపాక సావరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346.

సర్ / మేడమ్
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి తేది.15-09-2021న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా తేది.15-09-2021 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.49,32,666/- (అక్షరాల నలభై తొమ్మిది లక్షల ముప్పై రెండు వేల ఆరు వందల అరవై ఆరు రూపాయలు మాత్రమే) + తేది.16.09.2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.
మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని తేది.07.12.2021న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును తేది. 11-12-2021న (ఈనాడు : మండపేట క్లస్టర్ ఎడిషన్ (తెలుగు) మరియు ఇండియన్ ఎక్స్‌ప్రెస్: తాడేపల్లిగూడెం ఎడిషన్ (ఇంగ్లీష్)) దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.
తేది.15-09-2021 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేదీ నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల బ్యాంక్‌నకు తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుటకు ఇ-వేలం/బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**
రిజిష్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1383/2013, తేది.16.05.2013 ప్రకారం శ్రీ కదలి వెంకటేశ్వరరావు (లేటు), తండ్రి : రామకృష్ణ, రామచంద్రాపురం ఎస్ఆర్ఓ ప్రకారం గల ఆస్తి : తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, రామచంద్రాపురం సబ్ రిజిస్ట్రీ, వెదురుపాక సావరం గ్రామ పంచాయితీ ఏరియా హామ్లెట్‌లో, వెదురుపాక సావరం గ్రామ సర్వే నెం.135/1, 1వ బ్లాక్ లోని 205.1/9 చ॥గ॥లు లేదా 172.25 చ॥మీ॥ల ఖాళీ స్థలం, అందు కొత్తగా నిర్మించిన కొత్త డి.నెం.1-240తో గల ఆర్‌సిసి నివాస ఇల్లు (పాత డి.నెం.1-105తో గల పాత పెంకుటిల్లు స్థానంలో). సేల్ డీడ్ ప్రకారం హద్దులు : తూర్పు : 52.0 అ॥లు లేదా 15.849 మీ॥లు - వాసంశెట్టి చిన్నబాబు గారి ఇల్లు, దక్షిణం : 35.06 అ॥లు లేదా 10.821 మీ॥లు - రోడ్డు, పడమర : 52.0 అ॥లు లేదా 15.849 మీ॥లు - వి. సూర్యయ్య గారి ఇల్లు, ఉత్తరం : 35.06 అ॥లు లేదా 10.821 మీ॥లు - జి. చంద్రయ్య గారి స్థలం.

తేది: 30-05-2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

## రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీలు, నియామకాలు

**విజయవాడ,ఆగస్టు 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీలు, నియామకాలు చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ గా ఎస్.రవీంద్ర బాబును నియమించింది.వెయిటింగ్‌లో ఉన్న పలువురు అధికారులను కమిషనర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్ ఎన్. వాసు బాబును నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ టీపీఆర్వోగా నియమించింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్ గా జి. రవి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ గా పి. భవానీ ప్రసాద్, శ్రీకాకుళం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ సెక్రటరీ గా ఎల్ . సురేష్ లను నియమించింది.

### ఎంబీబీఎస్ మొదటి విడత కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** ఎంబీబీఎస్ ఆల్‌ఇండియా కోటా మొదటి విడత కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువును మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎంసీసీ) పొడిగించింది. మొదటి రౌండ్‌కు సంబంధించి ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు రిజిష్టరు చేసుకోవచ్చు. రుసుం లేకుండా 6 గంటల్లోగా చెల్లించాలి. ఐచ్ఛికాలు 7వ తేదీ ఉదయం 8 గంటల్లోగా పెట్టుకోవాలి. సీట్ల కేటాయింపు వివరాలు 9న విడుదల చేస్తారు. సీట్లు వచ్చిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో 9 నుంచి 18వ తేదీ లోగా చేరవచ్చు.విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఎంబీబీఎస్/బీడీఎస్ కన్వీనర్ కోటా ప్రవేశాలకు వచ్చిన దరఖాస్తులను మొదటి విడత పరిశీలన పూర్తయ్యింది.

వార్త

కొట్టినప్పుడు వినిపించే ధ్వనిని బట్టి ఆ పాత్ర గట్టిదా, ఒట్టిదా అనే సంగతి తెలిసిపోయినట్లే మనుషులు బుద్ధిమంతులా, మూర్ఖులా అనే విషయం వారి ఉపన్యాసం ద్వారా తెలిసిపోతుంది.

-డెమోస్త నీస్

# ప్రకృతితో చెలగాటమా?

భరత భూమికైనా, విశ్వక్షేత్రానికైనా ప్రకృతి బీభత్సాలు ఉత్పాతాలు కొత్తేమీకాదు. కానీ శరపరంపరగా ఒకదాని వెంట ఒకటి తరుము కొస్తున్నట్లు ఉరుములు మెరుపులతో ఉత్పాతాలు మీదకొచ్చి పడ్తుంటే బాధపడని వారుండరు. యేటా ప్రకృతి బీభత్సాలు జన సందోహాన్ని అతలాకుతలం చేయడం, ప్రభుత్వాలు ఆదుకోవడం సర్వసాధారణంగా జరిగేదే. చడీ చప్పుడు లేకుండా, ఎలాంటి సంకేతాలు అందకుండా అమాంతం ముందుకొచ్చే ఆకస్మిక వరదలు మరీ ప్రమాదం. కార్చిచ్చులూ అంతే ప్రమాదం. ఉత్తరాఖండ్‌పై మంగళవారం విరుచుకుపడిన భారీ వరదలతో ఉత్తరకాశీ అల్లకల్లోలమైంది. గంగోత్రికి వెళ్లే మార్గంలో ఉన్న 'ధరాలీ' గ్రామం తుడిచిపెట్టుకుపోయింది. కుంభ వృష్టికి తోడు మంచు పర్వతాల గ్రేషియర్లు వేడెక్కి కరిగిపోగా పెద్దఎత్తున బయటపడే నీటి ప్రతాపంతో దాదాపు పరిసర ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి. అక్కడి నైసర్గిక స్వరూపం, వాతావరణ పరిస్థితులు ఇందుకు కారణం. మృతుల సంఖ్య ఐదుగురే అయినా వందలాది మంది వరదల్లో చిక్కుకున్నారు. ఉత్తరాఖండ్ అనగానే వరదలకు ప్రసిద్ధి. వర్షాకాలం, గ్రేషియర్‌ల కరుగుదల, పర్వత ప్రాంతాల్లో అనియంత్రిత అభివృద్ధే భారీ వరదలకు కారణం. ప్రస్తుతం ఎదుర్కొంటున్న భారీ వరదల విషయంలో ముందస్తు హెచ్చరికలు లేవు. పర్యావరణ పరిరక్షణకు తీసుకునే చర్యలేమీ కనపడవు. ఎగువ ప్రాంతాల నుంచి ఒక్కసారిగా ముంచెత్తిన కారణంగా అధికార్లు చేతులెత్తేసారు. ఉత్తరాఖండ్ యేటా ఇలాంటి ప్రకృతి విలయాలను ఎన్నో చూసినా ఈసారి అతిపెద్ద ఉత్పాతాన్నే ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా ఇటీవల వచ్చిన సునామీ సంకేతాలు భూకంపాలు, తాజాగా భారీ వర్షాలు, వరదలతో ఆయా ప్రాంతాలు ఇప్పట్లో తేరుకునే పరిస్థితి లేదు. ఉత్తరాఖండ్ విలయంతో 'ధరాలీ' నగరం దాదాపు కనుమరుగైనట్లుగానే ఉంది. శిథిలాల కింద మరికొన్ని ప్రాణాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఖీర్ గంగానది పరివాహక ప్రాంతంలో మంగళవారం ఉదయం మేఘ విస్ఫోటంతో అమాంతం వరదొచ్చి పడింది. బోలెడంత బురదనూ మోసుకొచ్చింది. వరద ఉధృతికి 3,4 అంతస్థుల భవనాలు కుప్పకూలాయి. దాదాపు పాతిక హోటళ్లు కుప్పకూలి, వాటి సామాగ్రి వరదల్లో కొట్టుకుపోయింది. వరదల్లో గల్లంతైన వారి సమాచారం తెలియడం లేదు. వారి ఆవేదన తెలుసుకుని సహకరించే పరిస్థితులు కరువయ్యాయి. హెలికాప్టర్‌ల మీద వెళ్లి ఆహార పదార్థాలు, ప్యాకెట్లు అందించే ఏర్పాటు చేసేందుకు వాతావరణం సహకరించలేనందున సహాయ కార్యక్రమాలు ముందుకు సాగలేదు. కుండపోత వర్షాలతో కొండచరియలు విరిగి పడడంతో 163 రోడ్లు దారులు మూసుకుపోయాయి. దాంతో ఇరుగుపొరుగు రాష్ట్రాలకు వెళ్లే వాహనాలు ఇబ్బందికి గురయ్యాయి. విపత్తులు సంభవించినప్పుడు ఆందోళన పడేవారిని రక్షించడానికి విపత్తుల సంస్థలున్నా, నష్టపరిహారమో, ఆర్థిక సహాయమో అందించగానే ప్రభుత్వ బాధ్యత తీరిపోదు. ప్రకృతి బీభత్సాలను తట్టుకునే స్థాయిలో ఆలోచించాలి. అలాంటి నిర్మాణాలను చేపట్టాలి. అంత తప్ప ఉపద్రవాల నేపథ్యంలో ఊరించే మాటలు చెప్పి ఆనక ఆర్థికభారం సాకుతో మడమ తిప్పటం ఏ మాత్రం మంచిది కాదు. గత యేడాది జూలై 2024లో కేరళ రాష్ట్రం వయనాడ్‌లోనూ ఇలాంటి విలయమే సంభవించింది. కొండచరియలు విరిగిపడ్డాయి. ఎన్నో ప్రాణాలను కబళించింది. 600మందికిపైగా ప్రాణాలు హరించుకుపోయాయి. 2013లో ఉత్తరాఖండ్ వరదలకు భయంకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. కేదారనాథ్‌ఆలయ సమీపంలోని గ్లేషియర్ సరస్సు ఒక్కసారిగా కూలిపోవడం వల్ల పెద్ద ఎత్తున వరద తాకిడి ఆ ప్రాంతాన్ని ముంచేసింది. 5,700 మందిని పొట్టన పెట్టుకుంది. ఇంకా ఎంతో మంది ఆచూకీ తెలియలేదు. ప్రకృతి బీభత్సాలను ఆపలేం. ప్రాంతమేదైనా భూమ్యాకాశాల మధ్య ఏర్పడే వాతావరణ అలజడులను పరిగణనలోకి తీసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోగలిగితేనే అధిక ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. సరిగ్గా 20రోజుల నాడు రష్యా కకమ్ చాట్కాలో పెద్దఎత్తున రెక్టర్ స్కేలుపై 8.8 శక్తివంతమైన భూకంపం జరిగింది. జపాన్, హవాయి, రష్యా దేశాలకు సునామీ హెచ్చరికలు వచ్చాయి. వీటి అలలకు ఆయా ప్రాంతాల ఇల్లు నేలమట్టమయ్యాయి. వీటి పునర్నిర్మాణం విషయంలో ప్రభుత్వాలు వంతులుపోతున్నాయని ఆ ప్రాంత సామాజిక వాతావరణ పర్యావరణ విశ్లేషకులు చెప్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కొన్ని విషయాల్లో జాగ్రత్తలు పడితేనే రాబోయే రోజుల్లో ధన, ప్రాణ నష్టం జరుగకుండా కాపాడుకోవచ్చును. వయానాడ్ ప్రళయం నేర్పిన అనుభవాలు కానీ ఉత్తరాఖండ్ విలయాల నుండి విపత్తు దళాలు, అధికార్లు నేర్చుకున్న అనుభవాలు కానీ మున్ముందు ప్రమాదాలు తప్పించుకోవడానికి ఉపకరిస్తా యి. వాటిని ఆసరాగా ఆధునిక రక్షణ వ్యవస్థను ఏర్పా టు చేసుకోవాలి. వచ్చినప్పుడు చూద్దాంలే అన్న ధోరణి ఎవరికీ మంచిది కాదు. కాలయాపన జరిగిన ప్రతిచోట మానవ తప్పిదాన్నే తప్పుపట్టాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందుగానే ఆధునిక భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముంది. అంతే కాదు 2075నాటికి దక్షిణాది రాష్ట్రాలు, మరికొన్ని ఉత్పా తాలను విలయాలను చూస్తాయని వాటిని తట్టుకోలేకపో వచ్చునని కొందరు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఏమైనా కానీ ప్రత్యేక విపత్తు దళాలను ఏర్పాటు చేసుకోవడం మంచిది. ఆధునిక విధానాల్లో 'రిస్క్యూ' ఆపరేషన్లు నిర్వహించి ప్రజల్ని కాపాడే బాధ్యత తీసుకోవాలి.

ఒక పని అంటే గానీ, లేదా దాని వల్ల కలిగే ఫలితాలంటే గానీ భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.



మహాత్మా గాంధీ

భగవద్భక్తి పుస్తకాలు చదవడం వల్ల రాదు. అందులో చెప్పబడినట్టి ధర్మాలు ఆచరిస్తేనే సార్థకత.



రామకృష్ణ పరమహంస

# 'చితి'కిపోతున్న చేనేతలకు దిక్కెవరు?

*తెలంగాణలో చేనేత ఉత్పత్తి వెయ్యి కోట్లు ఉంటుంది. ఐదు శాతం జీఎస్టీ భరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కేవలం 50కోట్ల వరకు భారం పడుతుంది. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం నిలబెట్టుకోదా? చేనేత పద్మశాలి వివిధ కార్పోరేషన్లు ఏర్పాటు చేస్తామన్న ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఎందుకు చేయడంలేదు. రాష్ట్ర శాసనసభలో 2024-25లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో 187కోట్లు మాత్రమే ఇందులో ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయాల ఖర్చులు పోను మిగిలేది అంతంత మాత్రమే! ఇలా అయితే చేనేతరంగం ఎలా అభివృద్ధి చెందుతుంది? లిక్కర్ పాలసీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం చేనేత రంగానికి ప్రత్యేకపాలసీ, చేనేత సంక్షేమ నిధి, చేనేతకు సం॥36 వేల పెట్టుబడి సహాయం అందించాలి.*



డా॥ చిక్కా దేవదాసు

పడుగు, పేకల బతుకులు విచ్ఛిన్నమై విలవిల్లాడుతున్నాయి. పట్టించుకునేవారి కోసం ఎదురుచూస్తున్నాయి. విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ వస్త్రధారణను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ప్రభుత్వాలు జాతీయచేనేత దినోత్సవాలను జరుపుతున్న వేళ చేనేతల ఆక్రందనలను గుర్తించి చేనేతల బతుకులను బాగు చేయాల్సిన అవశ్యకత ఉంది. వ్యవసాయ రంగం తర్వాత లక్షలాది ప్రజలకు ప్రత్యక్షంగా పరోక్షంగా చేనేత రంగం దేశంలో 30 లక్షల చేనేత మగ్గాలపై దాదాపు కోటిమంది చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఉంది. ఎలాంటి విద్యుత్ వినియోగం లేకుండా మానవ శ్రమ సృజనాత్మక ఆలోచనతో మనిషి తన చేతుల ద్వారానే పనిచేస్తూ వస్త్రాని తయారు చేస్తారు. పత్తి ద్వారా నూలు వడికి సహజ రంగుల అద్దకంతో పూర్తిస్థాయి ప్రకృతి సహజ సిద్ధమైన సృజనాత్మకత పెట్టుబడిగా చేనేత కార్మికులు తమ సున్నితమైన చేతులతో వేలాది దారాలను క్రమపద్ధతిలో పేర్చి వస్త్రాన్ని తయారు చేస్తారు. చేనేతరంగం కేవలం వస్త్రాల తయారీకి కాకుండా పర్యావరణాన్ని రక్షించ డానికి చేనేత కార్మికుడు ఎంతగానో దోహదపడతాడు. చేనేత కార్మికులను పర్యావరణవేత్తలుగా గౌరవించాల్సిన సమయం ఆసన్నమైంది. చేనేత వస్త్రాల తయారీలో సహజ నూలు ఉపయోగించటం వలన సింథటిక్ బట్టల తయారీలో ఉపయోగించే హానికరమైన రసాయనాలు చేనేత వస్త్రాలకు అవసరం ఉండదు. తద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. చేనేత వస్త్రాలు నేలలో సులభంగా కలిసిపోతాయి. దేశ వస్త్ర ఉత్పత్తులలో తెలంగాణ చేనేత వస్త్రోత్పత్తులకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. రంగుల అద్దకం, ప్రింటింగ్, డిజైన్లు మొదలైన నైపుణ్యతతో ఆధునిక మార్కెట్లో సైతం పోటీ పడుతున్నా రు. తెలంగాణ చేనేత కార్మికులు తరతరాల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ప్రజల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా వస్త్రోత్పత్తులు చేస్తూ తమ నైపుణ్యాన్ని ద్విగుణీకృతం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాకతీయుల పరిపాలనతోపాటు అనేక సంస్థానాల మూలంగా చేనేత వస్త్రోత్పత్తులకు చేనేత కళకు మంచి ప్రోత్సాహం లభించింది. ఆ తరువాత నిజాం పరిపాలన చేనేత వస్త్రాల ఉత్పత్తులలో అనేక మార్పులు తెచ్చి అరబ్ దేశాలకు ఎగుమతి చేయడానికి తేలియా రుమాళ్లను ప్రోత్సహించింది. నూలు సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయబడ్డాయి. అగ్గిపెట్టెలో ఇమిడే ఆరు గజాల చీర అతి సున్నితంగా వస్త్రం తయారు చేయగల నైపుణ్యం, ఎటువంటి చిత్రాన్నైనా చూసి దానిని వస్త్రంపై నేయటం తెలంగాణ చేనేత నేతగాళ్ల సొం తం. తెలంగాణ రాష్ట్రంలో చేనేతన్నల జీవితాలు అత్యంత దుర్భరంగా, దయనీయంగా మారిపోయాయి. నేడు చేనేత రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. చేనేత మగ్గాన్ని నమ్ముకొని బతుకు లీడుస్తున్న నేతన్నలు పని లేక పస్తులుంటూ, ఆకలిచావులు ఆత్మహ త్యలకు గురిఅవుతూ తరతరాల నుంచినమ్ముకున్న చేనేతమగ్గం నేతన్నల పాలిట ఉరిగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక చేనేత రంగం చేనేతన్నల కుటుంబాల జీవితాలలో వెలుగులు నిండుతాయని, ప్రభుత్వం ద్వారా అభివృద్ధి చెందుతామని కోటి ఆశలతో చేనేత కార్మికులు ఎదురుచూశారు. కానీ ఆ విధంగా జరగకపోగా వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పాలకుల అలసత్వం, అవినీతి, వివక్షతో పూర్తిగా చేనేత రంగాన్ని సమస్యల సుడిగుండంలో నెట్టివేయబడినది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తమ ఇమేజ్ గొప్పతనం పెంచుకోవడానికే ఉపయోగించుకున్నది తప్పితే చేనేతరంగా నికి చేసింది ఏమీలేదు. తెలంగాణ రాష్ట్రంలో చేనేతరంగం ప్రస్తుతం కొనఊపిరిలో ఉంది.



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే చేనేత రంగం చేనేత కార్మికుల బతుకులలో వెలుగులు నిండుతాయి అనుకుంటే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేనేత కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే చేనేతను జౌళిశాఖ నుండి విడదీసి చేనేతకువెంటనే ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి రెండువేల కోట్లు బడ్జెట్లో ప్రవేశపెట్టి విడుదలచేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు గడుస్తున్నా నేతన్నల ఉపాధి కల్పన కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలోనే ఆర్థిక ఇబ్బందులతో పాటు ఉపాధి లేకపోవడం వలన దాదాపు 36 మంది చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇప్పటివరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందజేయలేదు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు తక్షణమే పది లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలి. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో 36 నెలలు ఉన్న 'చేనేతకు చేయూత పొదుపు' పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెల లుగా నిలిపివేసి నేడు 24 నెలలకు కుదించి కొత్తగా 'థ్రిఫ్ట్ పథకం' ప్రవేశపెట్టినట్లు ప్రకటించడం, గత ప్రభుత్వహయాంలో ఉన్న 'నేతన్న బీమా' పథకాన్ని 'నేతన్న భద్రత' పథకంలో వయో పరిమితి పొడిగించిందే తప్ప చేసింది ఏమీలేదు. పథకం పేరు మారిందంతే. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం యారన్ (నూలు) సబ్సిడీ పథకంలో ఉన్నలోపాల కారణంగా నగదు బదిలీ ద్వారా నేతకార్మికులకు 2000 రూపాయలు, అనుబంధ కార్మికుడికి 500రూపాయల చొప్పున గత ప్రభుత్వం 2024 అక్టోబర్, నవంబర్ నెలలు ఇచ్చింది. కానిఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2024 డిసెంబర్ నుండి 2025 డిసెంబర్ వరకు సంవత్సర కాలం నుండి నూలు నగదు పథకాన్ని నిలిపివేసింది. ఇప్పుడు కొత్తగా చేనేత కార్మికుడికి 18 వేల రూపాయలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. గతంలో సంవత్సరా నికి రూ.24 వేలు వచ్చే పథకాన్ని రూ.18 వేలకు తగ్గించి కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులను మరోమారు మోసం చేసింది. అయినా ఈపథకం ఇప్పటివరకు అమలు కాలేదు. ప్రభుత్వం ప్రకటించిన 'చేనేత అభయ హస్తం' పథకాలు కొత్తవి కావు. గతంలో ఉన్న పథకాల పేరు మార్చి కోతలు విధించి పాత సీసాలో కొత్త సారా అన్న చందాన గొప్పలు చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను, అధికారంలోనికి వచ్చిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న నేతన్నలకు ఉపాధి కల్పన కోసం మహిళా స్వయంసహాయక గ్రూపులో ఉన్న మహిళలకు సంవత్సరానికి రెండు చీరలు చొప్పున ఇస్తామని వాటిని తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్పత్తి చేయించి కార్మికులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇంతకాలం గడిచినా ఎందుకు ఆ పథకాన్ని అమలుచేయలేదు. చేనేత కార్మికులపై ఉన్న రూ.33 కోట్లు రుణాలను మాఫీచేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి సంవత్సర కాలం గడిచినా రుణాలు మాఫీ చేయలేదు? చేనేత కార్మికులకు లక్షరూపాయల రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలి. 12సంవత్సరాలు గడిచిపోతున్నా ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు టెస్కోకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు ఎన్నికలు నిర్వ హించి పాలకమండళ్లను ఏర్పాటు చేయడం లేదు? భారత్ జోడోయాత్రలో భాగంగా రాహుల్ గాంధీ జడ్చర్ల బహిరంగ సభలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రాగానే చేనేత కార్మికులపై, ఉత్పత్తులపై పడే జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందనిచెప్పిన ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి ఎందుకు విస్మరించారో. తెలంగాణలో చేనేతఉత్పత్తి వెయ్యి కోట్లు ఉంటుంది. ఐదుశాతం జీఎస్టీ భరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కేవలం 50కోట్ల వరకు భారం పడుతుంది. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం నిలబెట్టుకోదా? చేనేత పద్మశాలి వివిధ కార్పోరేషన్లు ఏర్పాటు చేస్తామన్న ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఎందుకు చేయడంలేదు. రాష్ట్ర శాసనసభలో 2024-25లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో 187 కోట్లు మాత్రమే ఇందులో ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయాల ఖర్చులు పోను మిగిలేది అంతంత మాత్రమే! ఇలా అయితే చేనేతరంగం ఎలా అభివృద్ధి చెందుతుంది? లిక్కర్కు పాలసీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం చేనేత రంగానికి ప్రత్యేకపాలసీ ఏర్పాటుచేయాలి. ప్రభుత్వం మనదేశంలో మాత్రం చేనేతను ప్రోత్సహించడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. దేశవిదేశాల్లో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే అవకాశాన్ని చ్చేందుకు ప్రభుత్వామే ముందుకు రావాలి. చేనేతల అభివృద్ధికి నడుం కట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. •

# మానసిక వికలాంగులకు రాయితీలు కల్పించాలి


ఆళవందార్ వేణు మాధవ్

భారత పార్లమెంట్ ద్వారా ప్రజల హక్కులను కాపాడటానికి చట్టాలు రూపొందించబడినవి. వీటిలో కార్మికులు స్త్రీలు, బాలలు, వృద్ధులకు ప్రత్యేక హక్కులు కల్పించబడినవి. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం సమాన హక్కులు, సమాన అవకాశాలు, గౌరవం, వివక్షత నిరోధించడానికి "వికలాంగుల హక్కుల చట్టం2016ను పార్లమెంట్ ఆమోదించింది. ఈచట్టం ప్రకారం అంధత్వం, దృష్టి లోపం, కుష్టు, వినికిడి లోపం, చలనం లేని వైకల్యం, మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యం లాంటి లోపాలు గుర్తించబడినవి. ఈ లాంటి లోపాలున్న వ్యక్తులకు ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు కల్పించే బాధ్యత కలదు. 2014 సంవత్సర ఒక నివేదిక ప్రకారం తెలంగాణ మొత్తం రాష్ట్ర జనాభాలో 12.2శాతం వికలాంగుల సంఖ్య ఉందని ఒక అంచనా. వికలాంగులు మానసికంగా కృంగి పోకుండా వారి మనో వికాసం కొరకు, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పునరావాసం కొరకు పింఛన్, ఇతరులపై ఆధారపడకుండా ఉన్నత విద్యలో రిజర్వేషన్లు, రైలు, బస్సులలో ప్రత్యేక రాయితీలు, బ్యాంక్, పోస్ట్ ఆఫీసులలో ప్రత్యేక క్యూలైన్ వసతి కల్పించింది. వికలాంగులు అనగానే ప్రజల మనస్సులో తళుక్కున మెరిసేవారు అంధులు, బధిరులు మాత్రమే. పుట్టుకతో కొంతమంది మానసికంగా శారీరక ఎదుగుదల లేని చాలామంది సమాజం, కుటుంబంలో ఆదరణ లేక ఇతరులకు చెప్పుకోలేని స్థితిలో జీవిస్తున్నారు. ఇలాంటివారిని ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు గుర్తించి వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. మానసిక వికలాంగులలో మానసిక వైఫల్యం, మానసిక అనారోగ్యం అనే రెండు రకాలు. వీటిలో మానసిక వైఫల్యం పుట్టుకతోవచ్చేది. రెండవది వారు జీవించే స్థితిలో ఉంది. నేడు ఎక్కువగా మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్నారు. చదువుల కొరకు తల్లితండ్రులు, విద్యాసంస్థల ఒత్తిడి, ప్రేమ వైఫల్యం, నిరుద్యోగం, పేదరికం, ఐ.టి రంగాల్లో పనిభారం, మాదక ద్రవ్యాల సేవనం, రోడ్డు, రైలు ప్రమాదాల వలన కూడా మానసిక అనారోగ్యం పాలై ఎటువంటి గుర్తింపు, ఆదరణ లేక జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎటువంటి సౌకర్యాలు లభించుట లేదు. రైల్వేలలో అన్ని రకాల వికలాంగులతో పాటు వారి అనుచరులకు కూడా రాయితీలు కల్పిస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, విద్యార్థులకు వికలాంగులకు, విలేఖరులకు, బస్‌పాసులు ఇస్తూ రాయితీలు ఇస్తుంది. నగరాల్లో ఉన్న నిపుణుల వద్దకు మానసిక రోగులు చికిత్సకొరకు రావడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పార్లమెంట్ ఆమోదించిన వికలాంగుల చట్టం2016 ప్రకారం మానసిక అనారోగ్యంతో బాధ పడే వారికి రాయితీలు ఇవ్వాలి. దేశంలో అత్యున్నత పార్లమెంట్‌లో ఆమోదించిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖచ్చితంగా అమలు పరచాలి. కావున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపే బస్సులలో మానసిక వైకల్యం గల వారితో పాటు మానసిక అనారోగ్యంతో బాధ పడే వారికి కూడా ప్రత్యేక పాసులు, రాయుతీల్చి ఆదుకోవాలి. •

# అట్టడుగు వర్గాలకూ రిజర్వేషన్ ఫలాలు

యం.అర్జున్

చారిత్రకంగా భారతీయ సమాజం కుల వ్యవస్థ ఆధారంగా శతాబ్దాలుగా నిర్మితమై ఉంది. ఇది సామాజిక, ఆర్థిక, రాజకీయ గతిశీలతలను ప్రభావితం చేస్తున్నది. ఈ వ్యవస్థను ప్రస్తుతం ఓపెన్ కేటగిరీ (ఒసి), వెనుకబడిన కులాలు (బిసి లేదా ఒబిసి), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) అనే వర్గాలుగా విభజించారు. బ్రిటిష్ పాలనా కాలంలో 1881 నుండి 1931 వరకు నిర్వహించిన జనగణనలు కుల ఆధారిత జనాభా వివరాల్ని సేకరించాయి. కానీ స్వాతంత్రం వచ్చిన నాటి నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కల్లో కులాల వివరాల్ని నమోదుచేయలేదు. కాబట్టి ఆయా సామాజిక వర్గాల వారీగా ఖచ్చితమైన జనాభా శాతాలపై స్పష్టత లేదు. స్వాతంత్ర్య అనంతరం భారత ప్రభుత్వం కుల గణనను నిలిపివేసి, పదేళ్ళకోసారి చేసే జనగణనలో ఎస్సీ, ఎస్టీ గణనపై దృష్టి సారించింది. దీని వల్ల ఒసి, ఒబిసి జనాభా డేటా లభ్యత పరిమితమైందని చెప్పవచ్చు. ఒసి, బిసిల గుర్తింపు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఆధారపడి ఉంటుంది. ఒసి కేటగిరి సాధారణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో పాటు రిజర్వేషన్ ప్రయోజనాలు పొందని ఇతర కులాల్ని కూడా సూచిస్తుంది. బిసి లేదా ఒబిసిలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా రాజ్యాంగం ఆర్టికల్ 15(4) కింద నిర్వచించబడ్డాయి. కానీ, కుల వర్గీకరణలో కొంత సంక్లిష్టత నెలకొని ఉంది. కేంద్ర జాబితాలో ఒబిసిలుగా గుర్తించబడిన కొన్ని కులాలు వివిధ రాష్ట్రాలలో ఒసి, ఎస్సీ, లేదా ఎస్టీలుగా వర్గీకరించబడ్డాయి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1970వ దశకంవరకు బిసి జాబితాలో లంబాడా సామాజిక వర్గాన్ని ఎస్టీజాబితాలో చేర్చడం జరిగింది. ఒబిసిలను ఏ, బీ, సీ, డీ, ఈ గ్రూపులుగా విభజించారు. తెలంగాణలో మున్నూరు కాపులు బిసి జాబితాలోఉంటే ఆంధ్రప్రదేశ్‌లో కాపులు ఒసి జాబితాలో ఉన్నారు. కర్ణాటకలో రెడ్లు బిసి జాబితాలో ఉంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒసిలుగా ఉన్నారు. ఇలా వివిధ కులాలు కేంద్ర, రాష్ట్రాల జాబితాలు వేర్వేరుగా ఉండటం వల్ల ఒక రాష్ట్రంలో ఒసిలుగా ఉన్నవారు, మరొక రాష్ట్రంలో బిసిలు జాబితాలో ఉన్నారు. ఇక్కడే అసలు దేశంలో ఒసిలెవరు? బిసిలెవరు అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. జన్మ ద్వారా వచ్చిన కులాన్ని మార్చడం సాధ్యం కాదు కానీ, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనకబాటు ఆధారంగా వారికి రిజర్వేషన్ కల్పించి వారి పురోభివృద్ధికి చర్యలు తీసుకోవడం అనివార్యం. అందుకే ప్రభుత్వం కుల, మత, వర్గాలకు అతీతంగా బిసి, ఎస్సీ ఎస్టీ వర్గాలతో పాటు వారి రిజర్వేషన్ ప్రయోజనాలకి భంగం కలగకుండా ఒసిల్లో ఉన్న పేదలకు కూడా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించింది. రిజర్వేషన్ మినహాయించిన తర్వాత మిగిలిన ఓపెన్ కేటగిరీలో అన్ని సామాజిక వర్గాల వారు సమానంగా పోటీ పడే అవకాశం ఉంటుంది. ఈ అంశంపై సుప్రీం కోర్టులో వాదనలు జరిగినప్పుడు ఈ చట్టానికి అనుకూలంగా తీర్పు రావడం గమనార్హం. 1953



లో ఏర్పాటైన కాకా కలేల్కర్ కమిషన్‌దాదాపు రెండు వేలకు పైగా వెనుకబడిన కులాలను గుర్తించింది. కానీ దాని సిఫార్సులు అమలు కాలేదు. 1979లో ఏర్పాటైన మండల్ కమిషన్ దాదాపు మూడు వేల కులాలను ఒబిసిలుగా వర్గీకరించి, 27శాతం రిజర్వేషన్‌ను కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో సిఫారసు చేసింది. 1990లో వి.పి.సింగ్ ప్రభుత్వం ఈ సిఫారసును అమలు చేసింది. ఇది దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా మారింది. 1992లో ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు 27శాతం రిజర్వేషన్‌ను సమర్థించి, క్రీమీ లేయర్‌ను మినహాయించాలని ఆదేశించింది. తదనంతరం, ఈ రిజర్వేషన్ ప్రభుత్వ విద్య, ఉద్యోగ అవకాశాలకు విస్తరించబడింది. రిజర్వేషన్ విధానం ఒబిసిలకు విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, రాజకీయ రిజర్వేషన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు ఉన్నట్లు ఒబిసిలకు చట్ట సభల్లో ప్రత్యేక కోటా లేదు. భారతీయ సమాజంలో ఎస్సీ, ఎస్టీలతో పోల్చితే కొంతవరకు సామాజికంగా, ఆర్థికంగా బిసిలు పురోభివృద్ధి సాధించినందున ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దాదాపు జనాభా శాతానికి సమానంగా రిజర్వేషన్ కల్పించినప్పటికి, బిసి జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్ కల్పించి ఉండక పోవచ్చు. సమకాలీన సందర్భంలో, కుల గణన అనేది ఒక కీలక అంశంగా మారింది. ఈ సారి జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈగణన ఆయా సామాజిక వర్గాల జనాభా, ఆర్థిక స్థితిగతులపై స్పష్టతనిచ్చే అవకాశం ఉంటుంది. ఆయా సామాజిక వర్గాలకి పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందాలంటే క్రీమీ లేయర్ని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంటుంది. ఆర్థికంగా స్థిరపడిన సామాజిక వర్గాలు తరతరాలుగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం వల్ల, నిజంగా వెనుకబడిన సమూహాలకు అవకాశాలు తగ్గుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని సమీక్షించడంద్వారా రిజర్వేషన్ ఫలాల్ని అట్టడుగు వర్గాలకు అందించే ప్రయత్నం చేయవచ్చు. రాష్ట్రాలకు ఒబిసి జాబితాలను నిర్వహించే అధికారం 2021లో 105వ రాజ్యాంగ సవరణ ద్వారా పునరుద్ధరించబడింది, కానీ రాజ్యాంగం ప్రకారం జనగణన చేసే అధికారం కేంద్ర ప్రభుత్వం వద్దనే ఉంది. ఒసి, బిసిల గుర్తింపు భారతీయ సమాజంలో సామాజిక న్యాయం, అవకాశాల కల్పనలో కీలకమైన అంశం. వివిధ రాష్ట్రాలలో కుల వర్గీకరణల సంక్లిష్టత, ఓటు బ్యాంకు రాజకీయాలు, క్రీమీ లేయర్ వంటి సవాళ్లు సామాజిక న్యాయ సాధనలో అడ్డంకులుగా ఉన్నాయి. వచ్చే జనగణన ఫలితాలు ఈ సవాళ్లను అధిగమించి, సమానత్వం, సామాజిక న్యాయ సాధనకు దోహదపడాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయి. ఈ రోజుల్లో కూడా దేశవ్యాప్తంగా ఒసి వర్గంలో కొన్ని కులాలు, బిసిహోదాను, బిసి వర్గంలో ఉన్నకులాలు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గంలో చేర్చమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీద ఒత్తిడి చేస్తున్న సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 ఏండ్లు అయినా అట్టడుగు ప్రజలకు ఇంకా పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందట్లేదు అంటే చట్టాలను పున సమీక్షించుకోవడం కన్నా ముందు క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరుపైన ప్రభుత్వాలు, పౌర సమాజం దృష్టి సారించాలి. •

# ప్రజావాక్కు



## కార్టూన్‌లతోనే సినిమాలు బావున్నాయి

ఆస్తులు అమ్మి, వస్తువులు తాకట్టు పెట్టి ఒక భక్తికి సంకేతంగా నిష్ఠతో, మన ధర్మం గొప్పతనాన్ని అద్భుతంగా మలచిన ఇతివృత్త సంచలనమే ఈ మహావతార్ నరసింహ చిత్రం. ఆమధ్య ఇలాంటి చిత్రమే హనుమాన్. నిజంగా పెద్ద పెద్ద డైరెక్టర్లు తియ్యలేని విధంగా ఈ యువ డైరెక్టర్ అశ్విని కుమార్ అద్వితీయంగా మలిచాడు. కొన్ని కొన్ని చిత్రీకరణలు చాలా బావున్నాయి. భూదేవి ఆవిర్భావం, నృసింహ స్వామి యుద్ధం, ముద్దులోలుకు ప్రహ్లాదుని భక్తి, పాటలు, ఒక విభాగం ఏమిటి అన్ని విభాగాలలో ఫస్టు ప్రైజ్ కొట్టేసింది. ఇది సకుటుంబంగా మన వళ్లతో కూడా చూసే చిత్రం అనడంలో సందేహం లేదు. హీరోలతో కాకుండా ఈలా కార్టూన్‌లతోనే బావున్నాయి అనిపించిందనుటలో సందేహము లేదు.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## దొంగకంపెనీల పేరుతో మోసం

దొంగ కంపెనీ పేర్లతో హెచ్‌వన్‌బి వీసాలు, అనేక లక్షలు తీసుకుని అక్కడ ఎమ్ఎస్‌లు చేయించి చివరికి జాబ్ దగ్గర వచ్చేసరికి చేతులుఎత్తి జారిపోయే జనాలు. మొన్న టార్గెట్ అనే అమెరికన్ మాల్‌లో పద్నానాలుగు వందల సరుకు దొంగిలించి పట్టుబడి బేడీలు రుచి చూసిన మహాతల్లులూ, డాక్టర్ అయినా డ్రగ్ మాదిరి మందులిస్తూ దొరికి కటకటాలు లెక్కపెట్ట పోయే మహానుభావుల్లు అమెరికాలో తయారౌతుంటే "మీరు మాకొద్దు.. మీ దేశానికి పోండి" అని పంపించారు. ఇవే ఇలాగే కొనసాగితే అందర్నీ షిప్పుల్లో పంపడం తథ్యం.

- ఎం.రంగరాజు, నల్గొండ

## ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 2021లో అప్పటి ప్రభుత్వం సుమారు మూడు కోట్ల రూపాయల నిధులతో మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గతంలో శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమైనప్పటికీ, మధ్యలోనే ఆగిపోవడంతో మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయినిరుపయోగంగా మారింది. ఈప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, జమ్మికుంట

## పిఎం కిసాన్ కార్యక్రమాలను పటిష్టం చేయాలి

పీఎం కిసాన్ లాంటి కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేయడం అవసరం. మరింత సహాయత రైతన్నలకు అవసరం. ఇంకా చెప్పాలి అంటే పీఎం కిసాన్ లాంటి కార్యక్రమంను మరింత విస్తృతం చేయాలి. అందులోని సాంకేతిక సమస్యలను తొలగించి మరింత మందికి సహాయం చేయాలి. ఇక దానితో పాటు పీఎం గోకుల్‌మిషన్‌ను మరింత ప్రోత్సాహకాలు అందించి మరింత పాడిని పెంచాలి. ఇవి చేయడంతో ప్రాథమిక రంగం అందులో వ్యవసాయ రంగం ఎక్కువ వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ప్రాథమిక రంగ అభివృద్ధే దేశ ప్రగతికి సోపానంగా నిలువనుంది.

-భారత అవినాష్, జనగామ

## చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టాలి

సమాజంలో చిన్నారులు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు, నేటి బాధ్యతగా కూడా భావించాలి. కానీ ఇటీవల చిన్నారులపై లైంగిక దాడుల సంఖ్య ప్రమాదకరంగా పెరుగుతోంది. యునిసెఫ్ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 53శాతం బాలికలు లైంగిక వేధింపులకు గురవుతుండగా, వాటిలో 90శాతం దాడులు కుటుంబసభ్యులు లేదా పరిచయస్తులచే జరుగుతుండటం మన మానవత్వాన్ని కలవరపెడుతోంది. ఇలాంటి దాడులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. బాధితులు భయంతో మౌనంగాఉంటూ జీవితాంతం ఆ గాయాలతోనే బతకాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అంతేకాదు, మత్తు పదార్థాలు, అసభ్య వీడియోలు, సోషల్ మీడియా వల్లనూ బాల బాలికలు ప్రమాదంలో పడుతున్నారు. పోక్సో చట్టం వంటి చట్టాలున్నా, అమలు లోపం వల్ల నేరగాళ్లకు శిక్షలు పడటం అరుదుగా మారింది. న్యాయ వ్యవస్థ వేగంగా స్పందించాలి. సమస్య పరిష్కారానికి కొన్ని కీలక చర్యలు అవసరం.

-సి. హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## తెలంగాణకు నీళ్ల శాతం పెంచాలి

గోదావరి బనకచర్ల వివాదం ముదిరి పాకాన పడుతోంది. ఈ బేసిన్‌ల గురించి రైతులు కూడా తెలుసుకుంటున్నారు. చైతన్య వంతులు అవుతున్నారు. అది తెలంగాణ ఉద్యమం ద్వారా వారికి వచ్చిన చైతన్యం ఎందుకంటే ఉద్యమ నినాదమే నీళ్ళ, నిధులు, నియామకాలు కావున ఈ నీళ్ల తెలంగాణకే ప్రాణావసరం. తెలంగాణలో గోదావరి 79 శాతం కృష్ణ 68 శాతం పారుతుంది. పారకం ఆధారంగా నీళ్ల ఇచ్చిన తెలంగాణలో గోదావరిలో నీటి వాటా ఎక్కువగా దక్కాలి.

-కె.రామకృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పిల్లల్ని కనండి..రూ.44వేలు పట్టుకోండి!



## చైనాలో యువ దంపతులకు జిన్‌పింగ్ సర్కార్ ఆఫర్

**బీజింగ్, ఆగస్టు 6:** ఒకప్పుడు ఒక బిడ్డకంటే ఎక్కువ ఉంటే 12 లక్షల రూపాయలు జరిమానాలు చెల్లించే చైనా పౌరులు ఇపుడు పిల్లల్ని కనాలని సంతానం పెంచుకోవాలంటూ ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. గతంలో చైనా ప్రభుత్వం ఇంటికి ఒకే బిడ్డ ఉండాలంటూ హుకం జారీచేయడంతో ఎవ్వరూ ముందుకు రాలేదు. దీనివల్ల చైనాలో వృద్ధ జనాభా పెరుగుతోంది. వారి సంక్షేమభారం కూడా ప్రభుత్వం పైనే ఉంది. ఇందుకోసం శ్రామికశక్తిని అనివార్యంగా పెంచేందుకు చైనా ఇపుడు యువ జనాభాను ఎక్కువ కోరుతోంది. ఇప్పుడు చైనా ప్రభుత్వం యువకులు ఎక్కువ మంది పిల్లలను కనాలని కోరుకుంటోంది. దీనిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం మూడు సంవత్సరాల లోపు వయసున్న ప్రతి బిడ్డకు 3,600యువాన్లు (రూ. 44,000) ఇవ్వనుంది. ఈ పథకం జనవరి 1 నుంచే వర్తిస్తుంది. ఈ ఏడాది 20 మిలియన్ల కుటుంబాలకు సహాయం చేయడానికి బీజింగ్ 90 బిలియన్ యువాన్లు (లక్ష కోట్ల కంటే ఎక్కువ) ఖర్చు చేయాలని యోచిస్తోంది. గతంలో ఇలాంటి సహాయాన్ని కేవలం స్థానిక ప్రభుత్వాలు మాత్రమే అందించేవి. అయితే, దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సబ్సిడీ ఇవ్వడం ఇదే మొదటిసారి. ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ ఇవి జనన రేటును పెద్దగా పెంచకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. జపాన్, దక్షిణ కొరియాలో ఇలాంటి పథకాలు విఫలమయ్యాయి. చైనాలో చాలామంది యువత ఎక్కువ పనిగంటలు, ఖరీదైన ఇల్లు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యల కారణంగా ఒత్తిడికి గురవుతున్నారు. ఈ చిన్న ఆర్థిక సహాయం వారి పెద్ద సమస్యలను పరిష్కరించదు. కొంతమంది తల్లిదండ్రులు ఈ డబ్బును స్వాగతించినా, మరి కొందరు పిల్లలను కనడం గురించి ఇంకా సందేహంలోనే ఉన్నారు. ఒక బిడ్డను పెంచే ఖర్చు చాలాఎక్కువ, సంవత్సరానికి3,600 యువాన్లు కేవలం ఒక చిన్న సహాయం మాత్రమేనని జేన్ లీ చెప్పారు. జేన్‌కు 9 సంవత్సరాలు ఉన్నప్పుడు, అతడి తల్లిదండ్రులు రెండోబిడ్డను కన్నందుకు భారీ జరిమానా చెల్లించారు. ఇప్పుడు 25 సంవత్సరాల వయసున్న జేన్ పిల్లలను కనాలని ఆలోచించడం లేదని చెప్పారు. పిల్లలను కనడం నాకు మరిన్ని కష్టాలను తెస్తుంది. నేను ఒక పెట్టుబడిదారుడిని కాదు, నా బిడ్డకు మంచి జీవితం ఉండకపోవచ్చుఅని జేన్ అన్నారు. చైనా సోషల్ మీడియాలో యువకులు ఒక బిడ్డ పాలసీ సమయంలో వారి తల్లిదండ్రులు కట్టిన జరిమానాల పాత రసీదులను షేర్ చేస్తున్నారు. కష్టపడి చదువుకుంటే జీవితం మెరుగుపడుతుందని చాలా మంది అనుకున్నారు. కానీ ఇప్పుడు వారిలో ఆశలు సన్నగిల్లుతున్నాయని సీఎన్ఎన్ తెలిపింది. ఆస్తుల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. మంచి ఉద్యోగాలు బలమైన కుటుంబ పరిచయాలు ఉన్నవారికి మాత్రమే లభిస్తున్నాయి. చైనా ఒక బిడ్డ పాలసీని రద్దు చేసి ఇప్పుడు ముగ్గురు పిల్లల వరకు కనడానికి అనుమతించినప్పటికీ, జనన రేటు పడిపోతూనే ఉంది. గత మూడు సంవత్సరాలుగా చైనా జనాభా తగ్గుతూ వస్తోంది. పీటర్సన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్ ప్రకారం 2023లో చైనాలో 9 మిలియన్ల జననాలు, 11.1 మిలియన్ల మరణాలు నమోదయ్యాయి.


జనాభా తగ్గుదల తిరిగి మార్చలేని స్థాయికి చేరుకుంటోందని ఇనిస్టిట్యూట్ పేర్కొంది. చైనాలో ఒక బిడ్డను పెంచడానికి సగటున 5,38,000 యువాన్లు (రూ. 65 లక్షలు) ఖర్చవుతుంది. ఇది దేశ సగటు ఆదాయానికి ఆరు రెట్లు ఎక్కువ. షాంఘై, బీజింగ్ వంటి నగరాల్లో ఈ ఖర్చు కోటిని దాటిపోతుంది. ఇలాంటి అధిక ఖర్చుల కారణంగా చాలా మంది జంటలు పిల్లలను కనడానికి ఆసక్తి చూపడం లేదు.



## తొలగించిన 65 లక్షల ఓట్ల వివరాలు వెల్లడించాలి

### ఎన్నికల సంఘానికి సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ తర్వాత సుమారు 65 లక్షల మంది ఓటర్లను లిస్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే తొలగించిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను వెల్లడించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఇవాళ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆగస్టు 12 లేదా 13వ తేదీల్లో బీహార్ 'సర్' ప్రక్రియపై సుప్రీంకోర్టులో మళ్లీ విచారణ జరగనున్నది. ఈ నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్వల్ భూయాన్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన ఓటర్ల వివరాలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు సమర్పించారని, అయితే ఆ వివరాలను బహిరంగంగా వెల్లడించాలని, ఈ కేసులో పిటీషన్ వేసిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్‌కు కూడా ఓకాపీని ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. శనివారంలోగా రిప్లై నమోదు చేయాలని, ఎడిఆర్‌కు చెందిన ప్రశాంత్ భూషణ్ దాన్ని పరిశీలిస్తారని, అప్పుడు ఏవిషయాన్ని వెల్లడించాలి, వెల్లడించకూడదో తెలుస్తుందని బెంచ్ తెలిపింది. తొలగించిన 65 లక్షల ఓటర్లు మరణించారా లేక శాశ్వతంగా ఇళ్లు మారారాఅన్న కారణాలు వెల్లడిస్తూ జాబితాను రిలీజ్ చేయాలని ఎడిఆర్ తన అప్లికేషన్‌లో కోరింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా ఆదేశాలుఇచ్చింది. డిలీట్‌చేసిన లిస్టులో ఉన్న కనీసం 15 మంది బ్రతికి ఉన్నట్లు నిరూపిస్తే, ఈకేసును తీవ్రంగా పరిగణిస్తామని కోర్టు చెప్పింది.



### రష్యా అధినేత పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక రాయబారి

## స్టీవ్ విట్కాఫ్ సమావేశం

### వెల్లడించిన క్రెమ్లిన్

**మాస్కో, ఆగస్టు 6:** ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై ఓ ఒప్పందానికి రావాలంటూ రష్యాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనిపై నిర్ణయం తీసుకోకపోతే పెద్ద ఎత్తున సుంకాలతో శిక్షిస్తానని హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నేడు మాస్కో వేదికగా రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ వెల్లడించింది. ఒప్పందం విషయంలో పుతిన్‌కు ట్రంప్ విధించిన గడువు ముగియనున్న నేపథ్యంలో ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్ సైతం ఎదురు దాడులు కొనసాగిస్తుండటంతో ఇటీవల కాలంలో యుద్ధం తీవ్రత మరింత ముదిరింది. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు విఫలమయ్యాయి. తాను అధికారంలోకివస్తే యుద్ధానికి తెరదించుతానని పేర్కొన్న డొనాల్డ్ ట్రంప్ ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. యుద్ధంముగింపుపై తొలుత 50 రోజుల్లోపు ఓ ఒప్పందానికి రావాలని రష్యాను హెచ్చరించిన ఆయన ఇటీవల ఆ గడువును మరింత తగ్గించారు. మరోవైపు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4:30 గంటలకు ట్రంప్ ఓవల్ ఆఫీసులో కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. ఒకవేళ రష్యా కాల్పుల విరమణకు అంగీకరించకపోతే ఆ దేశంపై ఆంక్షలువిధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్‌పైనా సుంకాలు పెంచుతానంటూ ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే.



## పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్!


**రాంచి,ఆగస్టు 6:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో దాఖలైన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి బుధవారం ఝార్ఖండ్‌లోని చాయ్‌బాసా ఎంపీఎమ్మెల్యే కోర్టుకు ఆయన హాజరయ్యారు. రాహుల్ గాంధీ హాజరు అనంతరం న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2018లో చాయ్‌బాసాలో జరిగిన ఓ బహిరంగ సభలో అప్పటి బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రతిష్ఠకు భంగం కలిగించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి ఈ కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రత్యేక న్యాయస్థానం, రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా హాజరు కావాలని గతంలో ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి జూన్ 26న హాజరు కావాల్సి ఉండగా, ఇతర కార్యక్రమాల కారణంగా తేదీని మార్చాలని రాహుల్ తరఫు న్యాయవాది ఝార్ఖండ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దాంతో ఆగస్టు 6న హాజరుకావాలని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ ఈరోజు విచారణకు హాజరయ్యారు.

## తండ్రీకొడుకుల ఘర్షణ ఆపేందుకువెళ్లిన ఎస్ఐ దారుణ హత్య

**తిరుప్పూరు, ఆగస్టు 6:** తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో దారుణం జరిగింది. తండ్రీ కుమారుల మధ్య గొడవను ఆపేందుకు వెళ్లిన సబ్ ఇన్‌స్పెక్టర్‌ను దారుణంగా నరికి చంపారు. ఉడుమల్‌పేట సమీపంలోని కుడిమంగళం గ్రామంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రి గస్తీలోఉన్న ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టర్ షణ్ముగవేల్‌కు అత్యవసర కాల్ ఒకటి వచ్చింది. దీంతో వెంటనే ఆయన ఘటనా స్థలానికి వెళ్లారు. స్థానిక అన్నాడిఎంకే ఎమ్మెల్యేకు చెందిన ఒక ప్రైవేట్ ఎస్టేట్‌లో పనిచేసే మూర్తి, ఆయన ఇద్దరు కుమారులు తంగపాండియన్, మణికందన్ మధ్య తీవ్ర వాగ్వివాదం జరుగుతోంది. కొడుకులిద్దరూ కలిసి తండ్రిపై దాడి చేయడంతో షణ్ముగవేల్ జోక్యం చేసుకుని, గాయపడిన మూర్తిని ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్‌ను పిలిపించారు. ఈ క్రమంలో పెద్ద కొడుకు తంగపాండియన్‌తో షణ్ముగవేల్ మాట్లాడుతుండగా, చిన్న కొడుకు మణికందన్ కొడవలితో ఆయనపై దాడి చేశాడు. ఆ తర్వాత తండ్రి, పెద్ద కొడుకు కూడా ఆ దాడిలో పాల్గొన్నారు. పోలీస్ అధికారిని వెంబడించి నరికి చంపారు. షణ్ముగవేల్ డ్రైవర్ తప్పించుకుని అధికారులకు సమాచారం అందించాడు. ఈ ఘటనలో నిందితులైన ముగ్గురూ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారికోసం ఐదు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు.

## భారత్‌లాంటి బలమైన మిత్రుడి బంధం తెంచుకోవద్దు

### ట్రంప్‌కు రిపబ్లికన్‌నేత నిక్కీ హేలీ హితవు



**వాషింగ్టన్, ఆగస్టు 6:** భారత్ లాంటి బలమైన మిత్రుడితో బంధాన్ని తెంచుకోవద్దంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిక్కీ హేలీ హితవు పలికారు. భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ సౌత్ కరోలినారాష్ట్రానికి గవర్నర్‌గా సేవలందించారు. రిపబ్లికన్ నేత అయిన హేలీ గతేడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీ కోసం ప్రయత్నించారు. అయితే, చివరకు బరిలో నుంచి తప్పుకొని ట్రంప్‌కు మద్దతిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ యుద్ధానికి పరోక్షంగా సాయపడుతోందంటూ భారత్‌పై ట్రంప్ అక్కసు వెళ్లగక్కుతున్నారు. చమురు కొనుగోళ్లు ఆపకుంటే భారీ మొత్తంలో టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో నిక్కి హేలీ స్పందిస్తూ.. భారత్ లాంటి బలమైన మిత్రుడితో విభేదాలు వద్దని ట్రంప్‌కు హితవు పలికారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలలో భారత్‌కంటే చైనానే ముందు ఉంటుందని గుర్తుచేశారు. అలాంటి చైనాపై విధించిన టారిఫ్‌లకు 90 రోజుల విరామం ప్రకటించిన ట్రంప్ భారత్‌పై మాత్రం టారిఫ్‌ల మీద టారిఫ్‌లు విధిస్తాననడం సరికాదని హేలీ అభిప్రాయపడ్డారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయకూడదు కానీ, చైనా చేయొచ్చా అంటూ హేలీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## కర్తవ్యభవన్ ప్రారంభించిన ప్రధానిమోడీ




**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** సెంట్రల్ విస్టాలో భాగంగా కొత్తపార్లమెంటు భవనంలోని కేంద్ర ఉమ్మడి సచివాలయ ప్రాజెక్టులోని భాగం అయిన కర్తవ్యభవన్‌ను ప్రధానిమోడీ బుధవారం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకింద మొత్తం 10 కార్యాలయ భవనాలు నిర్మించనున్నట్లు కేంద్ర గృహనిర్మాణ పట్టణ ప్రజాపనులశాఖ తెలిపింది. సిసిఎస్-3గా పరిగణిస్తున్న కర్తవ్యభవన్‌లోకి కేంద్ర హోంశాఖ, విదేశీ వ్యవహారాలు,పెట్రోలియంశాఖ, ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వయిజర్ కార్యాలయాలు తరలించనున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సిసిఎస్-2, సిసిఎస్-3 భవనాలు వచ్చేనెలకి పూర్తికానున్నాయి. సిసిఎస్-10వ భవనం వచ్చే ఏడాది ఏప్రిల్ చివరినాటికి, ఆరు, ఏడుభవనాలు వచ్చే ఏడాది అక్టోబరునాటికి పూర్తవుతాయని సంబంధిత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 2019లో ప్రారంభించిన సెంట్రల్ విస్టాప్రాజెక్టులో సిద్ధమైన మొట్టమొదటిభవనం కర్తవ్యభవన్. 1950-1970మధ్య నిర్మించిన శాస్త్రిభవన్; కృషిభవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్‌భవన్‌లలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నీ సిసిఎస్ ప్రాజెక్టుకింద నిర్మిస్తున్న కొత్తభవనాల్లోకి వచ్చేస్తాయి. నిర్మాణం పూర్తయ్యేవరకూ నాలుగుభవనాలనుంచి పనిచేస్తున్న కార్యాలయాలు రెండేళ్లపాటు కస్తూర్బాగాంధీ మార్గ్, మింట్‌రోడ్, నేతాజీ ప్యాలెస్‌లోని నాలుగు కొత్తభవనాల్లోకి వెళతాయని మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ తెలిపారు. కొత్తభవనాల్లో నేషనల్ మ్యూజియం, నేషనల్ ఆర్కైవ్స్, జవహర్ నెహ్రూభవన్, డాక్టర్ అంబేద్కర్ ఆడిటోరియంలున్నాయి. సెంట్రల్ విస్టా పునర్నిర్మాణప్రణాళిక కింద కేంద్రం ఇప్పటికే కొత్తపార్లమెంటుభవనం, ఉపరాష్ట్రపతి ఎన్‌క్లేవ్‌నునిర్మించింది. విజయ్‌చౌక్‌నుంచి ఇండియా గేట్‌వరకూ విస్తరించి ఉన్న కర్తవ్య మార్గాన్ని తిరిగి అభివృద్ధిచేసింది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌తోపాటు ప్రభుత్వం ఒక ఎగ్జిక్యూటివ్ ఎంక్లేవ్‌ను కూడా నిర్మిస్తోంది. దీనితో ప్రధానమంత్రి కొత్తకార్యాలయం, కేబినెట్ సెక్రటేరియట్, ఇండియా హౌస్, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్‌లున్నాయి. ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్ రెండోదశలో ప్రధాన మంత్రి కొత్తనివాసాన్ని సైతం నిర్మించనున్నారు.

## ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకోసం పాక్, చైనా కిరాయి సైనికులు: జెలెన్‌స్కీ

**క్యీవ్, ఆగస్టు 6:** ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున చైనా, పాకిస్థాన్‌తో పాటు మరికొన్ని దేశాలకు చెందిన కిరాయి సైనికులు పోరాడుతున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు చేశారు. రష్యా పక్షాన పోరాడుతున్న ఈ విదేశీ కిరాయి మూకలకు తగిన విధంగా బదులిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

జెలెన్‌స్కీ కీలకమైన వోవ్‌చాన్స్క్ యుద్ధ క్షేత్రంలో పర్యటించి, అక్కడి సైనికులతో సమావేశమయ్యారు. ఈ పర్యటన అనంతరం జెలెన్‌స్కీ సోషల్ మీడియా వేదికగా ఈ వివరాలు వెల్లడించారు. వోవ్‌చాన్స్క్ ప్రాంతంలో దేశాన్ని రక్షిస్తున్న మన సైనికులను కలిశాను. యుద్ధ క్షేత్రంలోని పరిస్థితులు, రక్షణ వ్యూహాలపై కమాండర్లతో చర్చించాను. ఈ సందర్భంగా, రష్యా పక్షాన చైనా, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తో పాటు కొన్ని ఆఫ్రికా దేశాలకు చెందిన కిరాయి సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నట్లు మా సైనికులు నివేదించారు. దీనిపై మేము తప్పకుండా స్పందిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపి, వారికి ప్రభుత్వ అవార్డులను ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా, ఉక్రెయిన్ యుద్ధ భూమిలో పోరు తీవ్రంగా కొనసాగుతోంది. ఆగస్టు 5న ఒక్కరోజే రష్యా, ఉక్రెయిన్ దళాల మధ్య 143 సార్లు భీకర ఘర్షణలు జరిగినట్లు ఉక్రెయిన్ సాయుధదళాల జనరల్ తెలిపారు. ముఖ్యంగా పోక్రోవ్స్క్ సెక్టార్‌లో అత్యంత తీవ్రమైన దాడులు జరిగినట్లు ఆగస్టు 6న ఉదయం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గత 24 గంటల్లో రష్యాదళాలు రెండు క్షిపణిదాడులు,107 వైమానిక దాడులు చేశాయని, ఉక్రెయిన్ సైనిక స్థావరాలు, జనావాసాలపై 147 గైడెడ్ బాంబులను ప్రయోగించాయని ఆ నివేదిక వివరించింది. రష్యా దాడులకు ప్రతిగా, తమ వైమానిక, క్షిపణి దళాలు రష్యాకు చెందిన 14 లక్ష్యాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ సైన్యం తెలిపింది. వీటిలో శత్రువుల కమాండ్ పోస్టులు, సైనిక స్థావరాలు, ఆయుధాగారాలు ఉన్నట్లు స్పష్టం చేసింది.



## మొహాలి ఆక్సిజన్ సిలిండర్ ప్లాంట్‌లో భారీ పేలుడు

### ఇద్దరు కార్మికులు మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు

**మొహాలి, ఆగస్టు 6:** మొహాలి పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం ఉదయం ఆక్సిజన్ సిలిండర్ ఫిల్లింగ్‌కేంద్రాలో భారీ పేలుడు సంభవించింది ఇద్దరు కార్మికులు చనిపోగా మరో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. ఉద్యోగులు సిలిండర్ ఫిల్లింగ్, లోడింగ్‌లో మునిగి ఉండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సిలిండర్లు వైద్య రంగంలో ఆక్సిజన్ సిలిండర్లుగా వినియోగిస్తారు. ఒక సిలిండర్ హఠాత్తుగా పేలిపోవడంతోనే ఈదుర్ఘటన జరిగింది. దీనితో భారీ ఎత్తున మంటలు చెలరేగి ఇతర సిలిండర్లను తాకడంతో ఫ్యాక్టరీలో భారీపేలుడు సంభవించింది. సమీపంలోని కట్టడాలకు కూడా భారీ నష్టం వాటిల్లింది. అత్యవసర స్పందన దళాలు అగ్నిమాపక యూనిట్లు పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది హుటాహుటిన స్పాట్‌కువెళ్లారు. గాయాలపాలయిన వారిని వెంటనే ఫేజ్6లోని సిలివిల్ ఆసుపత్రికి తరలించారు. సిటీఎస్పీ సిరివెన్నెల మాట్లాడుతూ ప్రాథమిక దర్యాప్తులో పేలుడుకు గల కారణాలు నిర్ధారిస్తామన్నారు. బహుశా గ్యాస్ లీకేజి కారణంగా ఈప్రమాదం జరిగిఉంటుందని చెప్పారు. ఆప్రాంతంలోని కంబాలి గ్రామ సరిహద్దులవరకూ కూడా సిలిండర్ శకలాలు గాలిలోకి ఎగిరి పడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బాధితుల శరీరాలుకూడా ముక్కలుగా తెగిపడ్డాయి.

మృతదేహం విడి భాగాలు పేలుడుస్థలంలో చెల్లాచెదురుగా పడిఉన్నాయి. సమీపం లోని పారిశ్రామిక యూనిట్లలోకూడా ఈ పేలుడుధాటికి స్వల్ప నష్టం జరిగిందని చెపుతున్నారు. ప్రమాదంతో ఈప్రాంతం మొత్తం ఎలాంటి కార్యకలాపాలు లేకుండా నిలిపివేసారు. ఫోరెన్సిక్ బృందాలు, ఫైర్‌సేఫ్టీ అధికారులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిపుణులు సంఘటన ప్రాంతంలో క్లూలకోసం కృషిచేస్తున్నారు. ఈప్రాంతంలో పేలుడు సంభవించే ప్రమాదకర సామగ్రి ఏదీ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీచేసారు.


## డోజ్ మాజీ ఉద్యోగిపై ఇద్దరు యువకుల దాడి!

**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలో జరిగిన ఒక ఘటన ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపుతోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) మాజీ ఉద్యోగి ఎడ్వర్డ్ కోరిస్టిన్‌పై జరిగిన దాడి కలకల రేపింది. ఈ ఘటనకు సంబంధించి 15 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలురను పోలీసులు అరెస్ట్ చేశారు. కోరిస్టిన్ అలియాస్ బిగ్ బాల్స్ డోజ్‌లో గుర్తింపు పొందారు. నగరంలోని లోగాన్ సర్కిల్ పరిసరాల్లో కొరిస్టిన్, ఆయన సహచరిపై దాడిజరిగింది. కొందరు టీనేజర్లు వారి కారును దొంగిలించడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో కోరిస్టిన్ తన సహచరిని కారులోకి నెట్టి వారిని ఎదుర్కొన్నారు. దీంతో వారు ఆయనపై దాడికి పాల్పడ్డారు. సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు జోక్యం చేసుకోవడంతో దుండగులు పారిపోయారు. మెట్రోపాలిటన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ మేరీల్యాండ్‌కు చెందిన ఇద్దరు 15 యేళ్ల టీనేజర్లను కార్‌జాకింగ్ ఆరోపణలపై అరెస్టు చేసింది. దీనిపై ట్రంప్ మాట్లాడుతూ డిసి దీనిని త్వరగా సరిదిద్దుకోకపోతే నగరాలను ఫెడరల్ నియంత్రణలోకి తీసుకోవాల్సి వస్తుందని పోస్ట్ చేశారు.

వాషింగ్టన్‌లో నేరాలు నియంత్రణలో లేవని ట్రంప్ ఆవేదన వ్యక్తంచేశారు. వాషింగ్టన్ డిసికి రాష్ట్ర హోదా లేకపోవడంతో ఫెడరల్ పర్యవేక్షణ కొరవడుతోంది. ఫలితంగా నేరాలు పెచ్చుమీరుతున్నాయని చెబుతున్నారు. గతేడాది కూడా 14 ఏళ్ల కుర్రాడు కార్‌జాకింగ్‌లో ఒక లిఫ్ట్ డ్రైవర్‌ను చంపినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఈ దాడిపై దర్యాప్తు కొనసాగుతోందని, మరికొంతమంది నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## సంక్షిప్తంగా..

### కాలిఫోర్నియాలో వేగంగా వ్యాపిస్తున్న భారీ కార్చిచ్చు!



**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికాలోని సెంట్రల్ కాలిఫోర్నియాలో ఈ నెల 1న అంటుకున్న భారీ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. 'గిఫోర్డ్'గా పేర్కొన్న ఈ కార్చిచ్చు ప్రస్తుతం 65 వేల ఎకరాలకు పైగా విస్తరించింది. భారీగా మంటలు ఎగసిపడుతుండటంతో చుట్టుపక్కల దట్టమైన పొగ వ్యాపించింది. లాస్‌ఏంజెలెస్, వెంచురా, కార్న్ వంటి దక్షిణ కాలిఫోర్నియా కౌంటీల్లోని నివాసితులతో పాటు పొరుగున ఉన్న లాస్‌వేగాస్‌లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో పలు సూచనలు చేశారు. ప్రభావం ఎక్కువగా ఉండే శాంటామారియా వంటి ప్రాంతాల్లోని వారిని తరలిస్తున్నారు. మరోవైపు మంటలను అదుపు చేసేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం నాటికి 3 శాతం మాత్రమే అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### తమిళనాడు మత్స్యకారులను విడిపించండి: స్టాలిన్



**చెన్నై, ఆగస్టు 6:** శ్రీలంక నౌకాదళం అరెస్టుచేసిన తమిళనాడు మత్స్యకారులను విడిపించేందుకు దౌత్యపరంగా కృషిచేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కేంద్ర విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్‌కు లేఖరాసారు. శ్రీలంక నావికాదళం 13 మంది తమిళనాడు మత్స్యకారులను తమ జలాల్లోకి ప్రవేశించారని అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం శ్రీలంక అధికారులు మొత్తం 173 ఫిషింగ్ పడవలతోపాటు 80 మంది మత్స్యకారులను అరెస్టుచేసారు. ఈ అరెస్టులవల్ల వారి కుటుంబాల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిన్నదని చెపుతున్నారు. అంతేకాకుండా కుటుంబాల్లో ఆందోళన కూడాపెరిగిందని తక్షణమే దౌత్యపరమైన చర్చలు, సంప్రదింపులతో వారి పడవలు, మత్స్యకారులందరినీ విడుదలచేయించాలని కోరారు. అంతకుముందు గతనెలలో కూడా స్టాలిన్ జైశంకర్‌కు ఇదే సమస్యపై మూడు లేఖలు రాసారు.

### సింహంతో చెలగాటమాడితే అంతే!

**భావ్‌నగర్, ఆగస్టు 6:** ఆహారం తింటున్న సింహానికి అత్యంత సమీపంగా వెళ్లి వీడియో తీసుకునేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకున్న యువకుడి సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వివరాల్లోకి వెళితే గుజరాత్‌లోని భావనగర్ జిల్లాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అడవిలో ఒక సింహం తాను వేటాడిన జంతువును తింటోంది. ఆ సమయంలో ఓ యువకుడు తన ఫోన్ చేతిలో పట్టుకుని నెమ్మదిగా దాని దగ్గరికి వెళ్లాడు. ఆ మృగరాజుతో ఓ క్లోజప్ వీడియో తీయాలన్నది అతని ఉద్దేశం. మొదట తన ఆహారంలో నిమగ్నమైన సింహం, కాసేపటికి తన దగ్గరికి వస్తున్న వ్యక్తిని గమనించింది. వెంటనే తీవ్ర ఆగ్రహానికిలోనైన సింహం, పెద్దగా గర్జిస్తూ ఆ యువకుడి వైపు దూసుకొచ్చింది. దీంతో భయపడిపోయిన ఆ యువకుడు, నెమ్మదిగా వెనక్కి అడుగులు వేస్తూ అక్కడి నుంచి తప్పుకున్నాడు. అదృష్టవశాత్తూ సింహం తన ఆహారం వద్దకు తిరిగి వెళ్లిపోవడంతో అతను సురక్షితంగా బయటపడ్డాడు. ఆ సమయంలో చుట్టుపక్కల ఉన్నవారు భయంతో కేకలు వేయడం వీడియోలో వినిపించింది.

### పక్షి ఢీకొట్టడంతో విమానం క్యాబిన్ మొత్తం పొగలు

**ప్యారిస్, ఆగస్టు 6:** పారిస్ వెళ్తున్న ఒక విమానం ముక్కు భాగాన్ని పక్షిఢీకొనడంతో క్యాబిన్ మొత్తం పొగతో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అనంతరం విమానం బయలుదేరిన 20 నిమిషాలకే వెనక్కి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆర్‌టిడాట్‌కామ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. అందులో ఒక ప్రయాణికుడు ఆక్సిజన్ మాస్క్ పట్టుకుని భయపడుతుండటం కనిపిస్తుంది. ఐబేరియా విమానం ఐబి579 మాడ్రిడ్‌లోని అడోల్ఫో సువారెజ్ మాడ్రిడ్‌బారాజాస్ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. గాల్లోకి ఎగిరిన 20 నిమిషాలకే ఒక పెద్ద పక్షి విమానం ముక్కు భాగాన్ని బలంగా ఢీకొంది. దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించి అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. విమానంలో ఉన్న ప్రయాణికుడు జియాన్‌కార్లో సాండోవల్ ఈ భయానక దృశ్యాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మొదట అది సాధారణ గాలి దుమారం అనుకున్నాం, కానీ తర్వాత భయానక శబ్దాలు వినిపించడం మొదలైంది. ఏదో జరిగిందని మాకు అర్థమైందని ఆయన పేర్కొన్నారు.

# ఎంపి లాడ్స్ నిధులను ఏడాదికి 5 నుంచి 10 కోట్లకు పెంచండి

- ఎంపి లాడ్స్ పనులకు పూర్తిగా జిఎస్‌టి మినహాయింపు ఇవ్వండి

- లోక్ సభలో అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త బ్యూరో** ఎంపి లాడ్స్ నిధులను ప్రతి ఏటా ఒక్కొక్క ఎంపికి కేటాయించే రూ.5 కోట్లను కేంద్ర ప్రభుత్వం 10 కోట్లకు పెంచాలని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ బుధవారం లోక్ సభలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంపి లాడ్స్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై జిఎస్‌టి మినహాయింపును కూడా ఇవ్వాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో నిబంధన 377 కింద ఎంపి లాడ్స్ పథకంలో తక్షణ మార్పులు చేపట్టాలని బుధవారం పార్లమెంట్ సమావేశాల్లో విజ్ఞప్తి చేశారు. 2011 నుంచి ప్రతి ఎంపికి ఎంపి లాడ్స్ కింద ఏడాదికి 5 కోట్లు నిధులను కేటాయిస్తున్నారన్నారు. పెరిగిన ద్రవ్యోల్బనం, నిర్మాణ వ్యయాల పెరుగుదల, ప్రజా అవసరాలు పెరుగుదలతో నిధులు తక్కువ వస్తున్నాయని అనంతపురం లోక్ సభ వంటి గ్రామీణ నియోజకవర్గాల్లో తాగునీటి కొరత, రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి



పథకాలు చేపట్టేందుకు ప్రస్తుతం ప్రాథమిక అవసరాలకే ఎంపి లాడ్స్ నిధులు సరిపోవడం లేదని, అందులో భాగంగా రూ.5 కోట్ల నుంచి 10 కోట్లకు పెంచాల్సిన అవసరం ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఎంపి లాడ్స్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై జిఎస్‌టి మినహాయింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాల మాదిరే ఎంపి లాడ్స్ పనులకు జిఎస్‌టి మినహాయింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఇలాంటి చర్యల ద్వారా వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాల్లో గ్రామీణ అభివృద్ధి చర్యలకు గ్రామీణాభివృద్ధి చర్యలను విస్తృతంగా చేపట్టేందుకు కేంద్రం ఆదుకున్నట్లు అవుతుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ఇతర మంత్రిత్వ శాఖలను ఎంపి అంబికా లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

ఈ విషయం లోక్ సభలో చర్చనీయాంశంగా మారింది.





కోనసీమ యూత్ సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేష్

# యూత్ సమ్మిట్‌ల ద్వారా యువత నైపుణ్యాలను మరింత మెరుగు పరుచుకోవాలి : మంత్రి లోకేష్

**విజయవాడ,ఆగస్టు 6, ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆగస్టు 12న రాష్ట్ర కార్మిక శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో రామచంద్రాపురంలో జరుగనున్న ..కోనసీమ యూత్ సమ్మిట్.. పోస్టర్ ను బుధవారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో రాష్ట్ర ఐటీ మరియు విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ., యువత లో దాగి ఉన్న టాలెంట్ ను, స్కిల్స్ ను రాష్ట్ర భవిష్యత్ అవసరాల కోసం వినియోగించుకునేందుకు కోన సీమ యూత్ సమ్మిట్ వంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. యువత తమ ఆలోచనలు వ్యక్తపరచడానికి యూత్ సమ్మిట్ సరి అయిన వేదికగా ఉపయోగపడుతుందని మంత్రి లోకేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అభివృద్ధి అజండాగా భవిష్యత్ ప్రణాళికలు చర్చించడంతో పాటు, యువత లోని నాయకత్వ లక్షణాలు, పరిస్థితులకు తగినట్లు వేగంగా నిర్ణయాలు తీసుకునే ఆలోచన విధానాలను యూత్ సమ్మిట్ వంటి కార్యక్రమాల ద్వారా యువత అలవర్చు కోవాలని ఆయన సూచించారు. యువతకు ఎంతో ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమ నిర్వహణ కు నడుబిగించిన మంత్రి సుభాష్ ను ఈ సందర్భంగా ఐటీ, విద్యా శాఖ మంత్రి లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు. కేబినెట్ సమావేశానికి ముందు జరిగిన ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులైన నిమ్మల రామానాయుడు, ఆనం రాం నారాయణ రెడ్డి, కొలుసు పార్థసారథి, సవిత, గుమ్మడి సంధ్యారాణి, అనగాని సత్య ప్రసాద్, రాం ప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# బాలాజీనగర్‌వాసులకు చిరుతల భయం !



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అనాదికాలం నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పలు రకాలుగా సేవలందించిన కుటుంబాలు, ఉద్యోగులు ,వ్యాపారులు, స్థానికులు ఇలా సుమారు ఐదువేల వరకు కుటుంబాలు నివాసముంటున్న తిరుమల బాలాజీనగర్ వాసులకు చిరుతల భయం వెంటాడుతోంది. ఇంకా ఏనుగులు, విషసర్పాలు, ఎలుగుబంట్లు,జింకలు కూడా ఈ పరిసరాల్లో ఆహారం కోసం వస్తుంటాయి. ఇలా వచ్చినపుడు ఇతర జంతువులు దాడిచేయడం అరుదుగా జరుగుతుంది. శేషాచలం అటవీప్రాంతం మధ్యలో ఏర్పాటైన బాలాజీనగర్‌లో గత దశాబ్దకాలంగా చిరుతలు, జింకలతో సావాసం చేయాల్సిన దుస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. పైగా చీకటిపడితే ఎటువైపు నుండి చిరుతలు, పాములు ,ఎలుగుబంట్లు వస్తాయని భయాందోళన చెందుతున్నారు. రెండురోజుల క్రిందట ఏకంగా బాలాజీనగర్ సమీపంలోని గంగమ్మ ఆలయంవద్దకు చిరుతపులి రావడం, ఆ పరిసరాల్లో సంచరించడం సిసికెమెరాల్లో రికార్డయ్యింది. అంతేగాక పిల్లిని వేటాడేందుకు ప్రయత్నించి చివరకు అడవిబాట పట్టింది. బాలాజీనగర్ వాసుల భద్రతకు అటవీసరిహద్దుచుట్టూ కంచే వేస్తామని టిటిడి అధికారులు, తిరుపతి ఎమ్మెల్యే హామీ కూడా కలగానే మిగిలిపోయింది. బాలాజీనగర్‌లో అధికులు పలు రకాల వ్యాపారాలు చేసుకుని, టిటిడిలో విధులు ముగించుకుని అర్ధరాత్రి వేళ కూడా ఇళ్ళకు చేరుకుంటారు. ఈ సమయంలో చిరుతపులులు దాడిచేస్తే పరిస్థితి ఏంటనే భయం ఉంది. కొన్ని వీధుల్లో వీధిదీపాలు కూడా సరిగా వెలగడంలేదని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఈ ప్రాంతవాసులు కోళ్ళు,కుక్కలను పెంచుకోవడం నిషేధించారు. అయినా ఇళ్ళల్లో వదలిపెట్టిన చెత్తాచెదారం, ఆహారపదార్థాలు కూడా చిరుతలు రావడానికి కారణమని అటవీఅధికారుల వాదన. అటవీప్రాంతానికి సమీపంలోనే ఉన్న బాలాజీనగర్‌వాసులకు రక్షణగా కంచే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# కృష్ణమ్మ హారతుల్లో పాల్గొన్న ఇఒ దంపతులు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 6, ప్రభాతవార్త** పవిత్ర కృష్ణవేణి నదీమతల్లికి సమర్పించే హారతుల కార్యక్రమంలో ఇఒ వికె శీనా నాయక్ దంపతులు బుధవారం పాల్గొన్నారు. అనంతరం ఆయన దుర్గమ్మవారి ఆలయ బస్సులో ప్రయాణించి భక్తులతో సౌకర్యాలపై ముచ్చటించారు.

-శాశ్వత అన్నదాన పథకానికి విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1,01,116ల విరాళాన్ని మరియు బంగారు తాపడం పనులకు రు.1,01,116ల విరాళాన్ని బీమవరంకు చెందిన ఎం రాఘవమ్మ, కుటుంబీకులు బుధవారం అందించారు. అలాగే విజయవాడకు చెందిన మానేపల్లి వేంకట పద్మావతి, వేంకటలక్ష్మి రాజా పేరిట ప్రతిరోజు ఇద్దరికి అన్నదానం జరపడానికి రు.1లక్ష విరాళాన్ని బుధవారం ఆలయాధికారులకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# స్వయం సహాయక సంఘాలకు లోకోస్ యాప్

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** స్వయం సహాయక సంఘాలకు చెందిన పూర్తి లావాదేవీలు, సమావేశాలు తదితర వివరాలు అన్నీ ఒకేచోట ఉంచేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్ త్వరలో అందుబాటులోకి రానుంది. అవకతవకలను అరికట్టేందుకు, మహిళలకు పూర్తిస్థాయిలో సమాచారం అందించేందుకు 2023లో దీనిని పోర్టల్ రూపంలో తీసుకొచ్చింది. అయితే రాష్ట్రంలో ఇది పూర్తి స్థాయిలో అమలులోకి రాలేదు.. కూటమి అధికారంలోకి రావడంతో దీంతో క్షేత్రస్థాయి నుంచి దీని నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా, క్లస్టర్, మండల, గ్రామస్థాయిలో శిక్షణ మొదలు పెట్టారు. వీవోల నుంచి అధికారుల వరకు అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. పొదుపు సంఘాలకు మంజూరవుతున్న రుణాల్లో కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం(జాతీయ గ్రామీణ లైవ్లీహుడ్ మిషన్) పథకం కింద నిధులు ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో దీనికి అనుబంధంగా ఎస్ ఎన్‌ఆర్‌ఎల్‌ఎం అమలవుతోంది. దీనిని సెర్ప్ శాఖ పర్యవేక్షిస్తోంది. ఇతర రాష్ట్రాల్లోనూ వివిధ విభాగాలు చూస్తున్నాయి. ఈ సందర్భంగా దేశం మొత్తం వివరాలు ఒకేచోట ఉండేలా ప్రణాళికలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.సిబ్బందికి శిక్షణ పూర్తయ్యాక అన్ని వివరాలు ఈ యాప్‌లో కనిపించనున్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్ లలో ప్లేస్టోర్ ద్వారా దీనిని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ప్రత్యేక లాగిన్ ఐడీల ద్వారా ఎక్కడినుంచైనా వివరాలు చూడొచ్చు. సంఘాలతో పాటు జీవనోపాధుల ఫొటోలు, ఇతర వివరాలన్నీ ఇందులో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, దీంతో ఆర్థికస్థితిగతులు తెలుస్తాయని డీఆర్డీఏ అధికారులు తెలిపారు,

# చట్టసభల్లో ఒబిసి రిజర్వేషన్లిచ్చే వరకు పోరాడతాం

## ఎంపిలు ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్

**అమరావతి, ఆగస్టు 6, ప్రభాతవార్త :** చట్టసభల్లో స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం ఓబిసి రిజర్వేషన్లు సాధించడమే తమ అంతిమ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంపై అన్ని వైపుల నుండి ఒత్తిడి తెచ్చి సాధిస్తామని రాజ్యసభ సభ్యులు , బిసి జాతీయ నేతలు ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్‌రావులు అన్నారు.





విజయవాడలోని ఏపి కాన్ఫరెన్స్ భవన్లో బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఓబిసి జాతీయ సెమినార్‌లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఓబిసి హక్కుల సాధనకు దేశవ్యాప్తంగా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు మహోన్నత కార్యక్రమం ముందుకు తెచ్చారన్నారు. ఓబిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖకోసం కేంద్రంలో కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజాన్ సింగ్, రాష్ట్ర నేతలు ఉన్నవ సుబ్బారావు, చాటపర్తి పోసి బా గిడ్డ నాయుడు పరుశురాం, సుధాకర్ సింగ్ ఉన్నారు.

# యుద్ధప్రాతిపదికన పద్మావతి కళాశాల విద్యార్థినుల సమస్యలు పరిష్కారం

## - టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుపతి,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న తిరుమల తిరుపతిదేవస్థానం పరిధిలోని పద్మావతి మహిళ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. విద్యార్థినులకు హాస్టల్స్‌లో, గదుల్లో



ప్రాథమిక అవసరాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అక్కడికక్కడే జెఇఒ వీరబ్రహ్మంను ఆదేశించారు. విద్యార్థినులకు సౌకర్యంగా హాస్టల్స్ సామర్థ్యాన్ని పెంపొందించాలని, వసతి సౌకర్యం పెంచాలని, వైద్యసౌకర్యాలు కల్పించాలని ఆదేశాలిచ్చారు. వేడినీటికోసం సోలార్ వాటర్ హీటర్స్,ఇ-లెర్నింగ్ సెమినార్ హాల్ ఏర్పాటుచేయాలని సూచించారు. పద్మావతి మహిళ జూనియర్ కళాశాల విద్యార్థినులు పలు సమస్యలను తనవరకు తీసుకువచ్చారని, ఆ సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి బుధవారం ఉదయం టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు పద్మావతి మహిళ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ విద్యార్థినులతో పలకరించి వారినుండి సౌకర్యాలు కల్పనపై ఆరాతీశారు. టిటిడి విద్యాసంస్థల్లో విద్యార్థినులు చక్కగా చదువుకునే అవకాశం ఉందని, నాణ్యమైన విద్యాబోధన, హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. హాస్టల్స్‌లో మరమ్మతులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ సౌకర్యం తదితర అంశాలపై ఆయన టిటిడి డిఇఒ వెంకటసునీల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి,ఎస్ఇ మనోహరంతో చర్చించారు. అధికారులు అభివృద్ధికి సంబంధించి నివేదిక తయారుచేసి కార్యాచరణ సిద్ధంచేయాలని ఛైర్మన్ నాయుడు సూచించారు. విద్యార్థినులు చదువుకునేందుకు చక్కటి వాతావరణం, సౌకర్యాలు ఉండటం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా కళాశాలలో ఉత్తీర్ణతశాతం బావుందన్నారు.

# సీమ మీదుగా సికింద్రాబాద్-మైసూర్ మధ్య బై వీక్లీ రైళ్లు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 6,ప్రభాతవార్త** రాయలసీమ మీదుగా సికింద్రాబాద్-మైసూర్-సికింద్రాబాద్‌ల మధ్య బై వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులు నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. సికింద్రాబాద్ నుంచి మైసూర్ వెళ్లేనెంబర్ 07033ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 8నుంచి 29వరకు ప్రతి సోమ,శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి రాత్రి 10.10గంటలకు బయలుదేరి మంగళ,శనివారాల్లో సాయంత్రం 4గంటలకు మైసూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మైసూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే నెంబర్ 07034ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 5.20గంటలకు మైసూరులో బయలుదేరి బుధ,ఆదివారాల్లో ఉదయం 11గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సర్వీసులు మార్గమధ్యలో బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్,తాండూరు ,సేడం,యాద్గీర్,క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం, ఆదోని,గుంతకల్లు, అనంతపురం,ధర్మవరం, హిందూపురం, యలహంక,బెంగళూరు కంటోన్మెంట్, బెంగళూరు సిటీ,కెన్‌గేరి,మాండ్య స్టేషన్లలో నిలుస్తాయి.

# విశాఖ రైల్వే జోన్ పిసిఇఇగా ఎపి శర్మ

## - ఆదేశాలు జారీ చేసిన రైల్వే బోర్డు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 6,ప్రభాతవార్త** భారతీయ రైల్వేలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ విద్యుత్ విభాగం ప్రిన్సిపల్ సిఇఇగా ఏపి శర్మను నియమిస్తూ రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే బుధవారం ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం నైరుతి రైల్వేజోన్‌లో పిసిఇఇగా(ప్లానింగ్)గా పనిచేస్తున్న శర్మ 1987వ బ్యాచ్‌కు చెందిన భారతీయ రైల్వే డైరెక్ట్ ఐఆర్ఎస్ అధికారి, రైల్వేలోని వివిధ డివిజన్‌లు, జోన్‌లలో ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు.

# బెల్టు షాపు కోసం టిడిపి నేతల మధ్య ఘర్షణ

## - మారణాయుధాలతో పరస్పరం దాడికి యత్నం

**కళ్యాణదుర్గం, ఆగస్టు 6 ప్రభాతవార్త :** కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కుందుర్పి మండలం ఎర్లచింత గ్రామంలో బుధవారం బెల్ట్ షాప్ నిర్వహణపై తెలుగుదేశం నేతల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామస్తుల కథనం మేరకు తెలుగుదేశం పార్టీకి చెందిన వడ్డే తిమ్మప్ప గత సంవత్సర కాలంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన మరో టిడిపి నేత వీరారెడ్డి మరో బెల్ట్ షాపుని తెరవడంతో ఘర్షణకు కారణమైంది. ఈ నేపథ్యంలో ఇద్దరు టిడిపి నేతల మధ్య బెల్ట్ షాపు నిర్వహణపై మారణాయుధాలు కొడవళ్ళు,ఇనుప రాడ్లు తీసుకొని ఘర్షణకు దిగారు. బెల్ట్ షాపు కోసం గ్రామంలో టిడిపిలో రెండు వర్గాలు ఏర్పడినట్లు అయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# కనిమొళిని కలిసిన మంత్రి సీతక్క, మేయర్ సుధారాణి

## ఇరు రాష్ట్రాల్లో అమలవుతున్న పథకాల అమలు పురోగతిపై చర్చ



**వరంగల్ బ్యూరో, ప్రభాతవార్త :** డి ఎం కే కు చెందిన లోక్ సభ సభ్యురాలు కనిమొళిని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, గ్రేటర్ వరం గల్ మేయర్ గుండు సుధారాణి ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో అమలవు తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను ఇరు వురు నేతలు పంచుకున్నారు. అనం తరం కనిమొళి సీతక్కను తమిళ నాడు రావాలని ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపట్ల సీతక్క ఏంపికి కృతజ్ఞ తలు తెలియజేశారు.

# కాళేశ్వరంపై అసెంబ్లీలో చర్చ జరగాలి

## కెసిఆర్ ప్రజలకు వాస్తవాలను తెలియజెప్పాలి

## నత్తనడకన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు

## సిపిఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి





**మహబూబ్‌నగర్ బ్యూరో/జడ్చర్ల,ఆగస్టు 6 ప్రభాత వార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జస్టిస్ పిసి గోష్ కమిషన్ రిపోర్ట్‌పై బయట చర్చలు చేయడం కాదు అసెంబ్లీలో చర్చలు జరగాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సిపిఐ జిల్లా మహాసభల్లో చాడ వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో మాట్లాడుతూ. కాళేశ్వరంపై గోష్ కమిషన్ రిపోర్ట్ పై మంత్రి వర్గం సమావేశమై చర్చించి ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. అసెంబ్లీలో కాళేశ్వరంపై తీర్మానం చర్చల్లో అప్పటి ముఖ్యమంత్రి ప్రస్తుత ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ తప్పనిసరిగా పాల్గొని వాస్తవాలను ప్రజలకు తెలపాలని అన్న మంత్రివర్గం ఆమోదం లేకుండా కాళేశ్వరం నిర్మాణం జరిగిందని కాళేశ్వరం కాదు కూలేశ్వరం అయిందా అని, కాళేశ్వరం కమిషన్ కాదు కాంగ్రెస్ కమిషన్ అని బయట రకరకాల చర్చలు జరుగుతున్నాయని బయట చర్చలు కాదు, అసెంబ్లీలో చర్చలు చేస్తే ప్రజలు ఎవరు ఏంటి అనేది గుర్తిస్తారని అన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్ పై కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో చేస్తుంది ధర్నాకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని కేంద్ర ప్రభుత్వంకూడా ఈ అంశంపై నాన్చకుండా త్వరగా ఆమోదం తెలపాలన్నారు. సినీ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ఖండిస్తు న్నామని మొండిగా వ్యవహరిస్తున్న నిర్మాతల మండలిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలని ఆయన డిమాండ్‌చేశారు. సినీ కార్మికుల సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

# నటుడు విజయ్ దేవరకొండను నాలుగు గంటలు ప్రశ్నించిన ఇడి

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌కు సంబంధించి దక్షిణాది సినీతారలను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారించడం కొనసాగుతూనే వుంది. గత నెల 30వ తేదీన ప్రకాష్ రాజ్‌ను ఐదు గంటల పాటు విచారించిన హైదరాబాద్ ఈడీ విభాగం అధికారులు బుధవారం విజయ్ దేవరకొండను నాలుగున్నర గంట లపాటు విచారించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ తన బ్యాంకుల లావాదేవీలను, తాను ఏ యాప్‌తో ఒప్పందం కుదుర్చు కున్నానో? దాని వివరాలు, ఆ సంస్థ నుంచి తీసుకున్న నగదు వివరాలను ఈడీ అధికారులకు అందజేశారు. కాగా విచారణ అనంతరం విజయ్ దేవరకొండ మీడియాతో మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లో తన పేరు రావడంతో విచారణకు హాజరైనట్లు తెలిపారు. అయితే భారత్‌లో బెట్టింగ్ యాప్ ఒక్కటే లేదని గేమింగ్ యాప్ కూడా వుందని ఆయన తెలిపారు. తాను బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేయ లేదని, ఎ23అనే గేమింగ్ యాప్ కోసం పనిచేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ రెండుయాప్‌లకు ఒకదానితో మరొకదానికి సంబంధంలేదని ఆయన తెలిపారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో గేమింగ్ యాప్స్‌కు చట్టబద్ధత వుందని, ఈ యాప్స్ నుంచి జీఎస్‌టితో పాటు ఆయా రాష్ట్రాలు స్థానిక పన్నులను కూడా వసూలు చేస్తున్నారని, వీటికి ఆయా రాష్ట్రాలు రిజిస్ట్రేషన్ లైసెన్స్ ఇస్తున్నా యని విజయ్ దేవరకొండ తెలిపారు. కాగా ఇదే కేసులో రానాతో పాటు మంచు లక్ష్మీలను కూడా ఈడీ అధికారులు విచారించనున్నారు.

# నేడు గోవాలో జాతీయ ఓబిసి మహాసభ

## హాజరుకానున్న గోవా,మహారాష్ట్ర సిఎంలు: జాజుల వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 6,ప్రభాతవార్త:** గోవా రాష్ట్రంలోని డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో గురువారం పదవ జాతీయ ఓబీసీ మహాసభను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథులుగా గోవా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవిస్, మహారాష్ట్ర పిసిసి అధ్యక్షులు నాన్న పటేలే,మాజీమంత్రి,ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తోపాటు దేశంలోని అఖిల పక్ష పార్టీల నాయకులు, దేశవ్యాప్తంగా ఉన్న సామాజిక ఉద్యమకారులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ నుండి వెయ్యి మంది ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

# రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ జాగృతా దివస్

## సైబర్ నేరాల కట్టడికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ వెల్లడి





బంజారాహిల్స్‌లోని టిజిసిఎస్‌బి కార్యాలయంలో సైబర్ జాగృతా దివస్ కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులతో కలిసి పాల్గొన్న పోలీసు అధికారులు.

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సైబర్ నేరాలను నివారించేందుకు, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ జాగృతా దివస్ పేరిట ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పోలీసు విభాగాల్లో గల పాఠశాలలు, కాలేజిలలో 577 సైబర్ అవగాహన కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాలలో వేలాది మంది విద్యార్థులతో పాటు విద్యావేత్తలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగిన నిపుణులు పాల్గొన్ని సైబర్ నేరాలను ఎలా నివారించాలనే దానిపై చర్చాగోష్టి నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. దీంతో పాటు ప్రతీ పోలీసు యూనిట్ తమ పరిధిలోని విద్యా సంస్థలతో కలిపి ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, ఐటెంటిటి థెఫ్ట్, లోన్ మోసాలు, ప్రకటనల మోసాలు, ఆన్‌లైన్ భద్రతా మోసాలకు సంబంధించి వాటిపై నిపుణులు విపులంగా వివరించారు. దీంతో పాటు విద్యార్థులకు సైబర్ సేఫ్టీ క్విజ్‌లు, సైబర్ క్రైం అంశాలపై చిన్నపాటి నాటకాలు, రెండు నిమిషాల అవగాహన రీల్స్, పోస్టల్ మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించి వీటిలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ తరహా కార్యక్రమాల వల్ల రేపటి పౌరులైన విద్యార్థుల్లో సైబర్ నేరాలపై మరింత అవగాహన కలుగుతుందని, దీంతో పాటు నేరాల నివారణకు ఎలా వ్యవహరించాలనే దానిపై వారికి మంచి ఆలోచన వస్తుందని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమాల్లో జిల్లా పోలీసు అధికారుల, ఎస్ హెచ్‌ఒలు గెస్ట్ స్పీకర్లుగా వ్యవహరించడంతో పాటు జడ్జిలుగా వుండి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో గెలిచిన పోస్టర్లు, నినాదాలు, ముఖ్యమైన సైబర్ భద్రతా సందేశాలు విద్యాసంస్థల సైబర్ ఫ్రీ వాల్‌లో ప్రదర్శించేందుకు ఆదేశాలు జారీ చేశారు. కాగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సైబర్ జాగృతా దివస్‌ను పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాల్లో ముఖ్యాంశాలను సోషల్ మీడియాలో షేర్ చేయనున్నారు. కాగా రాష్ట్రంలో ఒకేరోజు సైబర్ నేరాల నివారణకు సంబంధించి 577 కారక్రమాలు జరగడం ఇదే తొలిసారిగా టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు దోహదం చేస్తుందని ఆమె తెలిపారు.

# గొలుసు చోరీ కేసులో నేరగాడి అరెస్టు

## నిందితుడిపై 26 క్రిమినల్ కేసులున్నట్లు వెల్లడించిన పోలీసులు

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో విఐపి జోన్‌లో కాంగ్రెస్ ఎంపి ఆర్.సుధ గత సోమవారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో వాకింగ్ చేస్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని రెప్పపాటులో ఉడాయించిన నేరగాడిని పోలీసులు అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ఎంపి మెడలో గొలుసును స్నాచింగ్‌కు పాల్పడ్డ నేరగాడిని సోహన్ రావత్ (24)గా గుర్తించారు. నిందితుడు దక్షిణ, తూర్పు ఢిల్లీలోని ఓక్లాకు చెందిన వాడుగా తేలింది. ఢిల్లీలోని చెక్ రిపబ్లిక్ కార్యాలయం సమీ పంలో గల చాణక్యపూరి వద్ద ఫుల్‌ఫేస్ హెల్మెట్ ధరించి స్కూటర్‌పై వచ్చిన రావత్ స్నాచింగ్‌కు పాల్పడగా

ఈ సందర్భంగా ఎంపి సుధ మెడకు గాయం అయ్యింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి రంగంలో దిగిన ఢిల్లీ పోలీసులు, సౌత్ ఢిల్లీ పోలీసులు నేరగాడిని పట్టుకునేందుకు సంయుక్తంగా ఆపరేషన్ చేబట్టారు.




తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 07 - ఆగస్టు - 2025




# లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ సగిలిసన్మోహన్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
ఆడశిశు జననాల పట్ల వివక్షను అరికట్టే చర్యల్లో భాగంగా జిల్లాలో పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ (పీసీపీఎన్డీటి) చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో పీసీపీఎన్డీటి చట్టం అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన జరిగింది. తొలుత గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను చర్చించారు. అనంతరం లింగ నిర్ధారణ పరీక్షలు రూపుమాపేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే నిమిత్తం నూతనంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్, వాట్సాప్ నెంబర్ ల గోడ పత్రికను జిల్లా కలెక్టర్.. అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఆడశిశు జననాల పట్ల వివక్షను అరికట్టేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో పీసీపీఎన్డీటి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 17 ప్రభుత్వ, 141 ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. అన్ని స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. గత జులై నెలలో 27 ఆకస్మిక తనిఖీలు, 13 ఆపరేషన్లు చేయడం జరిగిందని ఆయన వివరించారు. అదేవిధంగా కొత్తగా ఏర్పాటు చేసేందుకు మూడు, రెన్యూవల్ కొరకు రెండు, యంత్ర పరికరాలు మార్పుకు రెండు, యంత్ర పరికరాలు యాడింగ్ ఒకటి, క్లోజర్ అనుమతులకు మూడు, ఉద్యోగుల మార్పుకు ఒకటి ధరఖాస్తులకు కమిటీ ఆమెదం జారీ చేసిందన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1800- 425- 3368, వాట్సాప్ నెంబర్ 9494113365 కు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పీసీపీఎన్డీటి చట్టంలో నిర్ధేశించిన నిబంధనలు అన్ని స్కానింగ్ సెంటర్లలో తప్పని సరిగా పాటించేలా చూడాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఎం హెచ్ఓ డా.జె.నరశింహనాయక్, అధనపు ఎస్పీ ఎంజేవీ భాస్కర రావు, డీసీహెచ్ఎస్ డా ఎస్.స్వప్న, డీఐవో డా.కెవి సుబ్బరాజు, ఎపీపీ డి.నాగబాబు, జీజీహెచ్ రెడీయాలజీ హెచ్ఓడి డా. బి.అనురాధ, స్వచ్ఛంద ప్రతినిధులు కె.వెంకటరావు, పి.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంసి చైర్ పర్సన్ ప్రమాణ స్వీకారోత్సవంలో అంబాజీపేట కూటమి శ్రేణులు



**అంబాజీపేట , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవంలో అంబాజీపేట మండల కూటమి శ్రేణులు సందడి చేశారు. పి. గన్నవరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ జగ్గన్నపేట సెంటర్ మీదుగా నగరం వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకుంది. చైర్ పర్సన్ గా పెనుమాల లక్ష్మి ప్రమాణం చేయడంతో ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పెనుమాలలక్ష్మిని ఏఎంసి చైర్ పర్సన్ గా నియమించేందుకు సహకరించిన పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వర రావు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, గణపతి వీర రాఘవులు, మైపాల తాతాజీ,కొర్లపాటి గోపి, అరిగెల సూరిబాబు, దొమ్మేటి సాయికృష్ణ, కొర్లపాటి ఢిల్లీ, కొప్పినీడి ఈశ్వరరావు, మేడిది శ్రీను, మట్టపర్తి వెంకటేశ్వరరావు,చప్పిడి సుబ్రహ్మణ్యం, బొరుసు రాజా తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల తిరుపతిలా..కోనసీమ తిరుమల అభివృద్ధి

- రూ, 1.5 కోట్లతో వకుళమాత అన్నదాన భవనంలో సౌకర్యాలుపర్పాటు
- మాస్టర్ ప్లాన్ ప్రకారం శ్రీనివాసపురంలో 500 రూములు
- వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి పవిత్రోత్సవముల ఆఖరిరోజు బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పశ్చిమ గోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సమంతపూడి శ్రీరామరాజు, ఆనంది గ్రూప్,భారతీ విద్యాభవన్ ఛైర్మన్ ఉద్ధరాజు విశ్వనాథరాజు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సెక్రటరీ కొత్తా శ్రీనివాస్, గాంధీ, సురేష్ తదితరులతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు,అర్చకులు ఎమ్మెల్యే బండారుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యే బండారుకు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర తిరుమల తిరుపతి క్షేత్రం తరువాత వాడపల్లి చాలా గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధిగాంచి ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులను ఆకర్షిస్తుందన్నారు. ఏడు వారాల వెంకన్నగా స్వామివారి మహిమతో భక్తుల కోరికలు నెరవేరుతున్నాయని వ్యాఖ్యానించారు.భక్తుల తాకిడికి తగ్గ సౌకర్యాలు కల్పించలేని ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వెల్లువలా తరలివస్తున్న భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, దేవస్థానం, అధికారులు, గ్రామస్తులు, దాతలు అందరి మీద ఉందన్నారు. భక్తుల సౌకర్యం కోసం వకుళమాత అన్నదాన భవనం నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. సుమారు 3వేలమంది ఒకేసారి స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించే విధంగా త్వరలో భక్తులకు ఈ అన్నదాన కేంద్రం అందుబాటులోకి రానున్నదన్నారు. మాడవీధులను మరింత వెడల్పు చేసి భక్తుల ప్రదక్షిణలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన పనులు త్వరలోనే మొదలవుతాయన్నారు. స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తిని పెద్దలు సూచించిన విధంగా తరలించి వాడపల్లి వచ్చిన ప్రతి భక్తుడు స్ఫూర్తి పొందేలా ఒక సెల్ఫీ కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం శ్రీనివాసపురంలో 500 రూములు నిర్మించాలనుకుంటున్నామన్నారు. అలాగే అన్నదాన భవనం పక్కనే డార్మెటరీ నిర్మాణం జరగనుందని తెలిపారు. ఆ పక్కనే రూములు, టాయిలెట్ సౌకర్యాల ఏర్పాటు జరుగుతుందన్నారు. రూముల నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్ సంఘం సెక్రటరీ కొత్త శ్రీనివాస్ ఒక రూమ్ నిర్మాణానికి గాను నేడు రూ.10 లక్షలు విరాళం ఇచ్చారని తెలిపారు. ఆయనను అభినందిస్తున్నట్లు తెలిపారు. రైస్ మిల్లర్స్ సంఘం అసోసియేషన్ అధ్యక్షులు రామరాజు సైతం వాడపల్లి లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటామని తెలిపారని అన్నారు. ఇందులో భాగంగా రూ.1.5 కోట్లతో వకుళమాత అన్నదాన భవనంలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తాను ఆయనను కోరినట్లు తెలిపారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించి అసోసియేషన్ తో చర్చించి తెలుపుతామని చెప్పారన్నారు. గోదావరి రివర్ ఫ్రంట్ ఏరియాలో మాస్టర్ ప్లాన్ ప్రకారం రిసార్ట్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. మరింత ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా సైతం వాడపల్లి అభివృద్ధి అంశంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్తామన్నారు. తిరుమల వెళ్లి స్వామి దర్శనం చేసుకోలేనివారికి వాడపల్లే తిరుపతిగా భాసిల్లేలా సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులను అభినందించారు. అనంతరం స్వామివారి ప్రసాదంగా పవిత్రాలను ఎమ్మెల్యే బండారుకు అర్చకులు అందజేశారు. అనంతరం దేవస్థానం ఎదురుగా కోనేరు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు,ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ), పాలూరి సత్యానందం, ముళ్ళపూడి భాస్కరరావు,ఏపుగంటి వెంకటేష్, ఏపుగంటి సుబ్బారావు, తోట రజని,కూటమి నాయకులు కార్యకర్తలు,దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ క్రైమ్ పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన

**ఆత్రేయపురం , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతపై అవగాహన కలిగి ఉండాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. ఆత్రేయపురం మహాత్మా గాంధీ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ పాల్గొని విద్యార్థినీ, విద్యార్థుల తో ముఖాముఖి చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ: వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవడం వల్ల అనేకమంది మోసాలకు గురవుతున్నారు. ఫేక్ లింకులు, సందేహాస్పద నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజులపై అప్రమత్తంగా ఉండాలి," అని ఆయన తెలిపారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో నకిలీ హెూదాలతో మోసాలకు పాల్పడుతున్న నేరగాళు యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మహిళల భద్రత కోసం రూపొందించిన 'శక్తి



యాప్' చాలా ఉపయోగకరమైన సాధనం. ఎమర్జెన్సీ సమయంలో మహిళలు దీన్ని ఉపయోగించి పోలీసులకు వెంటనే సమాచారం అందించవచ్చు. ప్రతి మహిళ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించే విధానాన్ని తెలుసుకోవాలి," అని చెప్పారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నంబరుకు కాల్ చేయండి లేదా cyber crime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయండి. త్వరగా స్పందిస్తే డబ్బు తిరిగి పొందే అవకాశం ఉంటుంది," అని సూచించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మురళీమోహన్, రూరల్ సీఐ సిహెచ్. విద్యాసాగర్, ఎస్సై ఎస్ రాము, లను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పిఎస్ రాజు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ బి. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సతీమణి జ్యోతుల మణి కి అభినందనలు తెలిపిన కిర్లంపూడి నాయకులు




**కిర్లంపూడి , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
జగ్గంపేట మండలం ఇర్రిపాకలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వగృహంలో ఆయన సతీమణి మణమ్మ పుట్టినరోజు వేడుకలు ఎంపీపీ తోట రవి,వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ,నియోజవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు భూపాలపట్నం ప్రసాద్ మరియు కిర్లంపూడి మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ కట్ చేసి మణమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అనుకూల శ్రీకాంత్,నీలం శ్రీను,కుర్ల చినబాబు,తూము కుమార్,కాళ్ల వెంకటేష్,బొదిరెడ్ల సుబ్బారావు, గండే కాశీ విశ్వనాథ్,శృంగరాయునిపాలెం సర్పంచ్ పట్టు చంటిబాబు,ఉప సర్పంచ్ బొజ్జపు శ్రీనివాస్,ఎంపీటీసీ గరగ గోవింద్,గోడే బాల,డాక్టర్ సత్యానందం,బొజ్జపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

**ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బ్యూరో , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
సెప్టెంబర్ 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను దృష్టిలో ఉంచుకొని, మోటారు వాహ నాల యాక్సిడెంట్ కేసులను పెద్దఎత్తున పరిష్కరించి బాధితులకు తగిన పరిహారం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చర్యలు చేపట్టిందనీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్. శ్రీలక్ష్మి తో కలిసి వివిధ భీమా సంస్థల ప్రతినిధులు,ఆయా సంస్థల న్యాయవాదులు,బాధితుల తరపున న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సమావేశమయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించడం వల్ల బాధితులకు త్వరితగతిన న్యాయం లభించదగిన మార్గమని తెలి పారు. పెండిం గ్‌లో ఉన్న మోటారు వాహనాల యాక్సి డెంట్ కేసులను గుర్తించి వాటి జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు త్వరగా అందజేయాలని భీమా సంస్థలకు సూచించారు. తదుపరి ముందస్తు లోక్ అదాలత్ సమావేశాల్లో భీమా సంస్థల ప్రతి నిధులు, బాధితులు, ఇరు పక్షాల న్యాయవాదులు పాల్గొనాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పేర్కొంది.

# శ్రీ విఘ్నేశ్వర స్వామి ఉత్సవ ఏర్పాట్లపై గ్రామసభ

**కోనసీమ బ్యూరో,ఆగష్టు 06 , ( ప్రభాతవార్త )**
వినాయక చవితి మహెూత్సవములు 2025 ఉత్సవ ఏర్పాట్లు పై బుధవారం గ్రామసభ నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు . శ్రీ స్వామివారికి ప్రధాన ఉత్సవమైన వినాయక చవితి సాంప్రదాయబద్ధంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న దానికి కంటే అత్యంత వైభవంగా నిర్వహించుటకు ఇందుకు సంబంధించి భక్తులకు మెరుగైన సౌకర్యం కల్పించుటకు భారీ వాహనంలను బైపాస్ రోడ్డు మళ్లించుటకు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడవలెనని, క్యూలైన్స్ కంట్రోల్ దూర ప్రాంతం నుండి వచ్చే



భక్తులకు త్వరగా దర్శనం అయ్యే విధంగా పటిష్టంగా క్యూలైన్స్ ఏర్పాటు చేయవలసి ఉన్నదని, సాంస్కృతిక కార్యక్రమాలు తొమ్మిది రోజులు ఏర్పాటు చేయవలసిందిగా హాజరైన గ్రామస్తులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించినారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగింది.

# పోరాటాల యోధుడు జక్కంపూడి



**కోనసీమ బ్యూరో , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
కోనసీమ బ్యూరో, ఆగష్టు 6( ప్రభాతవార్త): పోరాటాల యోధుడు జక్కంపూడి రామ్మోహనరావు అని వైసిపి రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు పేర్కొన్నారు.మండపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు 72వ జయంతి వేడుకలు కర్రీ పాపారాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, జక్కంపూడి రామెూహన్ రావు నిరంతర పోరాటయోధుడన్నారు. ఉక్కు మనిషిగా పేరు పొందిన నాయకుడన్నారు. ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని కొనియాడారు. కో-ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డితో అత్యంత సన్నిహితంగా ఉన్న వ్యక్తుల్లో జక్కంపూడి ఒకరని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీని తూర్పుగోదావరి జిల్లాలో బలోపేతం చేయడంలో ఆయన కృషి అమోఘమని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మండపేట మండల పరిషత్ అధ్యక్షులు ఉండమట్ల శ్రీనివాస్, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, వైసిపి టౌన్, రూరల్ అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జీ, నాయకులు పలివెల సుధాకర్, మట్టపర్తి గోవిందరాజు, పెంకే గంగాధర్, వీరమల్లు శ్రీనివాస్,శెట్టి నాగేశ్వరరావు, సిరిపురం శ్రీనివాస్, పంపన శ్రీను, సాధనాల శివ భగవాన్, జొన్నపల్లి సత్తిబాబు, మెండు మురళీ, ముక్కా దాలియా, పెంకే వెంకట్ రావు, వల్లూరు రామకృష్ణ, మేడిశెట్టి సూర్య భాస్కర్ రావు, కొనాల బోస్, ప్రెస్ వెంకటరావు, డి. సత్యనారాయణ రెడ్డి, విసిపిరెడ్డి శివ, వాసం శెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి అథ్లెటిక్స్ లో ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



**గండేపల్లి , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జి. అవినాష్ కుమార్,ఎ. శివశంకర్, పి.చరిత్ గుప్త,జి.శివ,ఎల్. జ్యోతి,పి.కావ్య,డి. నాగేశ్వరి,కె.దినేష్ లు ఈ నెల 3వ తేదీన పెద్దాపురం ఎం ఆర్. కాలేజీ లో జరిగిన కాకినాడ జిల్లా అండర్-18 అథ్లెటిక్స్ సెలెక్షన్స్ పోటీలలో చక్కటి ప్రతిభ కనపర్చి ఈ నెల 9,11వ తేదీలలో చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక అయ్యారని ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ టీ వి ఎస్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్య పాలిటెక్నిక్ లో చదువుతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యత ఇస్తామని అందుకే తమ విద్యార్థులు క్రీడలలోను ప్రతిభ చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడలలో శిక్షణ ఇచ్చిన కోచ్ లు బి. అనిల్ గౌతమ్, మురళి మోహన్ లను అభినందించారు.ఈ సమావేశంలో పాలిటెక్నిక్ డీన్ ఏ వి మాధవరావు, అసోసియేట్ డీన్ పి. శ్రీనివాస్ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ ఫిర్యాదు పై స్పందించిన ఎస్. పి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త )**
జిల్లా పోలీస్ కార్యాలయానికి పి.జి.ఆర్.ఎస్ కు వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఐ.పి.ఎస్. తన కొడుకు కు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మయన్మార్ దేశానికి తీసుకుని వెళ్లి అక్కడ నిర్బంధించారని తల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్ లో ఫిర్యాదు చేశారు.తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవతో సదరు వ్యక్తిని తిరిగి తన సొంత ఊరికి సురక్షితంగా రప్పించి తన తల్లికి నిడదవోలు సర్కిల్ పోలీస్ లు అప్పజెప్పారు. పై విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టి తన కొడుకును తమకు క్షేమంగా అప్పగించినందుకుగాను బుధవారంతల్లి కొడుకులిద్దరూ జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఐ.పీ.ఎస్.ని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ల ఈ సందర్భంగా పై కేసు దర్యాప్తును పూర్తిస్థాయిలో నిర్వహించాలని నిడదవోలు సర్కిల్ పోలీస్ లకి జిల్లా ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ ఎన్. బి. ఎన్. మురళీకృష్ణ ఉన్నారు.

# ఆధార్ కేంద్రం లేక ప్రజల అవస్థలు

**సీతానగరం , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఒక్క ఆధార్ సేవా కేంద్రం కూడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డుకు దరఖాస్తు చేయాలన్నా, చిరునామా మార్పులు, ఆధార్ కార్డులో తప్పుల సవరణ వంటి పనుల కోసం మండల ప్రజలు రాజమహేంద్రవరం లేదా ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడకు వెళ్ళినా ఇంటర్నెట్, ఇతర సాంకేతిక సమస్యల వల్ల సర్వర్ పనిచేయకపోవడంతో సమయం, డబ్బు వృధా అవుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, సంబంధిత ఆధార్ అధికారులు స్పందించి మండలంలో ఆధార్ సేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జాతీయ రహదారి భద్రతపై కలెక్టర్ సమీక్ష



**కోనసీమ బ్యూరో , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
కోనసీమ జిల్లాలో ఎదురు లంక దిండి జాతీయ రహ దారి 216 పై ప్రమాదాలు నివారణకు రహదారి భద్రతా ప్రమాణాలు పాటించడంతోపాటు జంక్షన్లు అభివృద్ధి చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జాతీయ రహదారి భద్రత పై భద్రత జంక్షన్ల అభివృద్ధి, చించినాడ బ్రిడ్జి మరమ్మత్తు పనులు వివిధ సర్వీస్ రోడ్ల నిర్మాణాల గూర్చి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 216 జాతీయ రహదారి రాజోలు బైపాస్ రోడ్డు ప్రారంభం నుండి పాసర్లపూడి వరకు ఆక్రమణల తొలగింపు, జంక్షన్ల అభివృద్ధి పనులను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తిచేయాలని ఆదేశం చారు. చించినాడ వంతెన పరిస్థితి ఆరా తీసి పెడల్స్ బేరింగ్లు ఏర్పాటు మర మ్మత్తు పనులను నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేసి రాకపోకపునరుద్ధరించాలనిలని టాటా ప్రాజెక్ట్ అధికారులకు సూచించారు. అమలా పురంబి ముమ్మిడివరం బైపాస్ జంక్షన్ల ను ప్రాపర్ గా సరిచేసి జాతీయ రహదారి భద్రతను మెరుగుప రచాలన్నారు ఒక నెలలో భద్రతా సమస్యల పట్ల చర్యలు తీసుకో వాలని ఆదేశించారు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద బైపాస్ రోడ్డుకు సర్వీస్ రోడ్డును వేయాలని జాతీ య రహదారుల పిడి సాయి శ్రీనివాస్ ను ఆదేశించారు. 216 పై ప్రమాదాలు సంఖ్య పెరుగు తూ ఆందోళనకర పరిస్థితులను సృష్టిస్తుందని దీని దృష్టిలో ఉంచుకొని నివారణ చర్యలు పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలన్నారు ఈ కార్యక్రమం లో జాతీయ రహదా రుల విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట రమణ, టాటా ప్రాజెక్ట్ ప్రతినిధి గోపాల్, భూ సేకరణ విభాగం సూపరింటెండెంట్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు

# కోకో బోర్డు ఏర్పాటు చేయాలి..అంబాజీపేటలో కోకో రైతుల సంఘం సమావేశం




**అంబాజీపేట , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
కోకో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కోకోబోర్డును ఏర్పాటు చేసి అన్ని రకాల రాయితీలు, సదుపాయాలు కల్పించాలని ఏపీ కోకో రైతుల సంఘం అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, కార్యదర్శి కె. శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు.అంబాజీపేటలో కోనసీమ కోప్రా మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో బుధవారం ఏపీ కోకో రైతుల సంఘ సమావేశం డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కోకో రైతుల సంఘ అధ్యక్షులు ఉప్పుగంటి భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కొబ్బరిలో అంతర పంటగా సాగు చేస్తున్న కోకోను ప్రభుత్వం ఈ క్రాప్ జాబితాలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు కోకోబోర్డు ఏర్పాటు చేసి అన్ని రకాల రాయితీలు,సదుపాయాలు కల్పించాలన్నారు. కోకో గింజలను విక్రయించడంలో ఎఫ్పీఓలు ఏర్పాటు చేసుకొని ఎగుమతి చేయాలని సమావేశం తీర్మానించింది. 2024 లో కిలో కోకో గింజలను రూ.1000 రూపాయల వరకు కొనుగోలు చేసారని, అయితే ప్రస్తుతం కోకో గింజలను రూ.450 లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నాయన్నారు. 2025లో ప్రభుత్వం మరో 75 వేల ఎకరాల్లో కోకో పంటను సాగుచేయడం లక్ష్యమని ప్రకటించిందని, 20 వేల మెట్రిక్ టన్నుల గింజలను కొనుగోలు చేయటం లక్ష్యమన్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ధరలతో పోల్చుకుంటే రూ.800 కోట్లను కోకో రైతులు నష్టపోతారని ప్రభుత్వం కేవలం రూ.14.8 కోట్లు మాత్రమే ఇవ్వడంతో రైతులు రూ.785.20 కోట్లు నష్టపోయారన్నారు. కోకో గింజలపై పన్ను శాతం ఎక్కువగా ఉండడంతో, గింజలను పొడి రూపంలో దిగుమతి చేసుకుంటూ బహుళజాతి కంపెనీలు ప్రభుత్వాన్ని కూడా మోసం చేస్తున్నాయని శ్రీనివాస్ ఆరోపించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశ పెట్టి ఆమోదించారు. జిల్లాలలో ప్రతి మండలంలో ఒక కోకో గింజల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఏపీ కోకో రైతు సంఘ సహాయ కార్యదర్శి వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి ఆనంద ప్రసాద్, జిల్లా కార్యదర్శి అడబాల రాజమోహన్, కోకో రైతులు ముత్యాల జమీల్, గణపతి వీర రాఘవులు. చేకూరి సూర్యనారాయణ రాజు, అడ్డాల గోపాలకృష్ణ, అయ్యగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కొబ్బరి రైతులకు సాంకేతిక సామర్థ్య వృద్ధి కోసం అవగాహన కార్యక్రమం

**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
బుధవారం స్థానిక సెంట్రల్ టొబాకో రీసెర్చ్ స్టేషన్ నందు కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ఉద్యాన శాఖ సౌజన్యంతో కొబ్బరి రైతుల కోసం సాంకేతిక సామర్థ్యవృద్ధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్, కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు డా. మంజునాథ్ రెడ్డి, మాట్లాడుతూ కోకో బోర్డు అమలు చేస్తున్న పథకాలు, నాటే విత్తన వెరైటీల సమాచారం, నారుమడులు తయారీ, ఇన్సూ రెన్స్ మరియు సాగు పద్ధతులపై సమగ్రంగా వివరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్. మల్లికార్జున్ రావు మాట్లాడుతూ, కేంద్రం మరియు రాష్ట్రం నుండి రైతులకు అందుతున్న పథకాలు, అందుబాటులో ఉన్న మద్దతులపై వివరించారు. అలాగే జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ. దుర్గేష్ మాట్లాడుతూ, సీడీబీ ద్వారా రైతులకు అందుతున్న సబ్సిడీలు, ఇన్సూరెన్స్, ఎఫ్పిఓల స్థాపన ద్వారా పొంద గలిగే ప్రయోజనాలపై స్పష్టతనిచ్చారు. కోకోనట్ డెవలప్మెంట్ ఆఫీసర్ హెచ్ ఎన్ . శరత్



మాట్లాడుతూ, సీడీబీ ట్రైనింగ్ కార్యక్ర మాలు, హెల్త్ & లైఫ్ ఇన్సూరెన్స్, సబ్సిడీలపై వివరించారు. రైతులకు అనారోగ్య సమయంలో ఆర్థిక సహాయాన్ని ఎలా అందించ గలమో, అందుకు ఉన్న అవకాశాల గురించి వివరించారు. ఐ సి ఏ ఆర్ –నిర్క్ ( ఎన్ఐఆర్సిఏ ) డైరెక్టర్ డా.ఎం.శేషు మాధవ్ మాట్ల డుతూ, కొబ్బరి చెట్టు 'కల్పవృక్షం'గా పిలవబడటానికి కారణాలు పేర్కొంటూ ఆరోగ్య ప్రయోజనాలు వివరించారు. డా. ఎ. కిరీటి, సీనియర్ సైంటిస్ట్, అంబాజీపేట హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ వారు కోకో సాగు యాజమాన్య పద్ధతులు, అందులో రకాలు, తెగుళ్ల నిరోధకత కలిగిన స్థానిక మరియు హైబ్రిడ్ వెరైటీల గురించి వివరించారు. ముఖ్యంగా కల్ప ప్రతిభ, డబుల్ సెంచరీ వంటి అధిక దిగుబడినిచ్చే రకాల ప్రాముఖ్యతపై రైతులు దృష్టి పెట్టాలని కోరారు. డా. నీరజ, సైంటిస్ట్, కొబ్బరిలో కలిగే తెగుళ్ళు, వాటికి వ్యతిరేకంగా చేపట్టాల్సిన చర్యలపై స్పష్టతనిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ, మోరంపూడి, కడియం, రాజానగరం, దేవరపల్లి, కొవ్వూరు మండలాల ఉద్యాన శాఖ అధికారులు, హార్టికల్చర్ విస్తరణ అధికారులు, గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

## జక్కంపూడి సేవలు మరువలేనివి



**మామిడికుదురు, ఆగష్టు 06 , ( ప్రభాతవార్త )**
మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు.మామిడికుదురు సెంటర్లో జక్కంపూడి 72వ జయంతి వేడుకలు వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.పలువురు వక్తలు మాట్లాడుతూ మంత్రి ఉన్నప్పుడు జక్కంపూడి రామ్మోహనరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజోలు జడ్పిటిసి మట్టా శైలజ,పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్య, జక్కంపూడి వాసు, బొలిశెట్టి భగవాన్, మొల్లేటి త్రిమూర్తులు, తులా గోపాలకృష్ణ, కుసుమ శ్రీధర్,తోరం భాస్కర్,అన్వర్ తాహెర్ హుస్సేన్,ఎండి వై షరీఫ్,పుల్లెల్ల గంగా భవాని,జిల్లెళ్ళ పుష్ప, గెడ్డం కుమారి, గంగారత్నం తదితరులు పాల్గొన్నారు,

# తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం..మాచవరంలో జాతీయ తల్లిపాలు వారోత్సవం

**అంబాజీపేట ,ఆగష్టు 06 , ( ప్రభాతవార్త )**
తల్లి ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యమని, ఆ పాలతో శిశువుకు రోగనిరోధక శక్తి పెంపొందుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి నాగాబత్తుల శాంతకుమారిలు అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మాచవరం పంచాయతీ పరిధిలోని మెట్లకాలనీలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ వి.ఎస్.వి. మహలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ తల్లిపాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటేశ్వరరావు,సర్పంచి శాంతకుమారిలు మాట్లాడుతూ తల్లి మొదటి పాలు ఆరోగ్యవంతంగా ఎదగడానికి ఉపకరిస్తాయన్నారు. బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా తల్లిపాలు



అందించాలన్నారు. తల్లిపాలు అద్భుతమని, తల్లిపాలులో చెడు బ్యాక్టీరియాను తీసివేసి మంచి బ్యాక్టీరియాని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం పౌష్టికాహారాన్ని బాలింతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మద్దింశెట్టి దుర్గాదేవి, గుబ్బల వెంకటలక్ష్మి, ఏఎన్ఎం.రాజేశ్వరి. ఎం.శ్యామల, జి.కృష్ణవేణి, సహాయ కురాలు కోమలి నాగలక్ష్మి, పీహెచ్ఎన్ ఎం.భూలక్ష్మి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే గిడ్డి

**- నగరం ఏఎంసి పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న కూటమి శ్రేణులు..**
**- పవన్ కళ్యాణ్ సినిమా పాటలతో హోరెత్తిన సభా ప్రాంగణం..**

**మామిడికుదురు,ఆగష్టు 06 , ( ప్రభాతవార్త )**
రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, రైతులకు నేరుగా పాలనా సౌలభ్యం కలిగేలా ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలు రైతుల అభివృద్ధి కోసం పనిచేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి గన్నవరం నియోజవర్గం మామిడికుదురు మండలం నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరిగింది.జనసేన వీర మహిళ పెనుమాల లక్ష్మిచే చైర్ పర్సన్ గా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రమాణం చేయించారు. అనంతరం వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గంలోని నగరం, అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలను కూటమిలో భాగస్వామ్యమైన జనసేన,టిడిపిలకు చెరొకటి కేటాయించామన్నారు.నగరం ఏఎంసి చైర్పర్సన్ పదవిని జనసేన వీర మహిళ పెనుమాల లక్ష్మికి కేటాయించామని ఎమ్మెల్యే తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ నుండి మెగా ఫ్యామిలీకి విధేయురాలుగా ఉంటూ పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసిన పెనుమాల లక్ష్మిని చైర్పర్సన్ గా నియమించడంతో కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారన్నారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనా దక్షతకు భద్ధుడనై, జనసేనాని,ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా,భారతీయ జనతా పార్టీ సహకారంతో నియోజక అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, రైతులకు అందుబాటులో ఉండాలని ఏఎంసీ పాలకవర్గంనకు ఎమ్మెల్యే సూచించారు. చైర్ పర్సన్ పెనుమాల లక్ష్మీ మాట్లాడుతూ 17 ఏళ్ల పాటు సుదీర్ఘంగా కొనసాగుతున్న రాజకీయ ప్రయాణంలో ఏఎంసి చైర్ పర్సన్ పదవి దక్కడం సంతోషంగా ఉందని,తనకి పదవి



వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనను వెన్నంటి ప్రోత్సహించిన కూటమి శ్రేణుల ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరువలేనన్నారు. రాష్ట్ర అటవీ శాఖ ప్రాజెక్ట్ ఐటి సలహాదారుడు పెన్నమరెడ్డి నాగబాబు, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు,డిసిఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టిడిపి రాష్ట్ర నాయకులు నామన రాంబాబు,డొక్కా నాథ్ బాబులు మాట్లాడారు. అనంతరం పవన్ కళ్యాణ్ సినిమాలకు పాటలు రాసే రచయిత,గాయకుడు మాస్టర్ జీ ' జానీ ' సినిమాలోని 'మా రాజుకాకుర మా కన్నయ్య' పాటను పాడి సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు. అంతకుముందు పి. గన్నవరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి టిడిపి, జనసేన,భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, వీర మహిళలతో ఊరేగింపుగా బయలుదేరి జగ్గన్నపేట సెంటర్ కు చేరుకున్నారు. అక్కడ నుండి భారీ ర్యాలీగా నగరం మార్కెట్ యార్డ్ కు చేరుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## ఏపీకి వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రం గా హోదా కల్పించండి

**- కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి కి ఏపీ ఎంపీలు వినతి**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త )**
ఏపీకి వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్ కు ఆంధ్ర ప్రదేశ్ ఎంపీలు వినతి పత్రాన్ని అందజేశారు. బుధవారం న్యూఢిల్లీలో టెక్నాలజీ భవన్ లో సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కేంద్ర మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్ ను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు నేతృత్వంలో ఎంపీల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సమర్పించిన అనేక కీలక ప్రతిపాదనలను ఎంపీల బృందం కేంద్ర మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్ కు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ కు వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలని, శాస్త్రీయ పరిశోధన మౌలిక సదుపాయాలు అందించాలని, అనంతపురం , సత్యసాయి జిల్లాలకు డాప్లర్ వాతావరణ రాడార్ కవరేజ్ కల్పించాలని వారు కోరారు. వ్యూహాత్మక శాస్త్ర మరియు సాంకేతిక రంగంలో జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా తమ అభ్యర్థనను పరిగణంలోకి తీసుకోవాలన్నారు.

# వాడపల్లి అభివృద్ధిపై మంత్రి నారా లోకేష్ తో చర్చించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు




**ఆత్రేయపురం , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
తెలుగు రాష్ట్రాల్లో తిరుమల తరువాత అధికంగా భక్తులను ఆకర్షిస్తూ నిత్య కళ్యాణం, పచ్చ తోరణంగా భాసిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి అభివృద్ధి అంశమై మంత్రి లోకేష్ తో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సర్యానందరావు చర్చించారు. ఉండవల్లి లోని మంత్రి నివాసంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,యువనేత బండారు సంజీవ్ లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రో త్సవాలు గురించి వివరించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.
ప్రసాద్ స్కీం లో వాడపల్లిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ సానుకూలత వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# మద్యం సేవించి బండి నడపుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు

**ఆత్రేయపురం , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని బొబ్బర్లంక సెంటర్ వద్ద రావులపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్సై ఎస్ రాము వెహికల్ చెక్ చేయగా నలుగురు వ్యక్తులు మద్యం సేవించి బండి నడపడం వలన వారిని పట్టుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ రాము తెలిపారు.





## ఘనంగా జక్కంపూడి రామ్మోహన్‌రావు 72వ జయంతి

**సీతానగరం , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
మండల వ్యాప్తంగా మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు 72వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు జక్కంపూడి సేవలను కొనియాడారు. ప్రజల కోసం ఆయన చేసిన కృషి, నిస్వార్థ సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణలో మియావాకి పద్ధతికి కలెక్టర్ ప్రశంస

**- సందర్శకుల రిజిస్టర్ లో నమోదు చేసిన కలెక్టర్ పి. ప్రశాంతి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
వనరుల సంరక్షణ, అకిరా మియావాకి మొక్కల పెంపకం కోసం సరైన సమయంలో చర్యలు తీసుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. బుధవారం రాజానగరం మండలం లో 25 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అకిరా మియావాకి మొక్కల పెంపకం ప్రదేశాన్ని, పామ్ పాంట్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా అకిరా మియావాకి మొక్కల పెంపకం ఒక విశిష్ట ఆలోచనామార్గమని పేర్కొన్నారు. సరైన వాతా వరణంలో మొక్కల పెంపకాన్ని చేపట్టడం వలన మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు. రాజానగరం ప్రాంతంలో మొక్కల ఎదుగుదల తీరును పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. నీటి నిల్వల సామర్థ్యం పెంచేలా పామ్ పాంట్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. అలాగే లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానం అమలులోనూ మరింత సమర్థతను తీసుకురావాలని, పరిధిని పెంచి నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని అధికారులకు సూచించారు. పొలం గట్లు వద్ద కూడా



మొక్కల పెంపకం కోసం దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అకిరా మియావాకి పద్ధతిలో మొత్తం 2,970 మొక్కలు నాటడం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నాటిన మొక్కలలో జామి, వెంగం, బిల్లా, మర్రి, నర్ర, గిలగిల, మద్ది చెట్టు, తామర, మందార, దేవదారు, తులసి, వేప, గంధ తగర వంటి వివిధ రకాల మొక్కలు ఉన్నాయి. ఈ సందర్భంగా సందర్శకుల రిజిస్టర్ లో క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది పనితీరు ను ప్రశంసిస్తూ వివరాలను కలెక్టర్ స్వయంగా నమోదు చేయ డం జరిగింది.ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి. ప్రశాంతి గారితో పాటు డ్వామా పీడీఎం నాగమల్లేశ్వర రావు, ఎంపీడీవో జె.ఏ. ఝాన్సీ, తహసిల్దార్ జి.ఎల్.ఎస్. ఝాన్సీ, డ్వామా ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని యు.ఎస్.వుమెన్ కేర్, ఫెర్టిలిటీ క్లినిక్ ఆల్ట్రాసౌండ్, డే కేర్..రిజిష్ట్రేషన్లు సస్పెన్షన్ కు కలెక్టర్ ఆదేశాలు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 06 , ( ప్రభాతవార్త ) :**
డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియెట్ అథారిటీ, మరియు డిస్టిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ జిల్లా స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం కలెక్టరేట్ కోర్టు హాలులో బుధవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశం లో సృష్టి ఐ.వి.ఎఫ్. సెంటర్ హైదరాబాదు సంస్థకు కాకినాడ బ్రాంచిగా, డా.పి.నమ్రత డైరెక్టర్ గా కాకినాడలో నిర్వహిస్తున్న యు.ఎస్. విమెన్ & ఫేర్తిలిటి క్లినిక్ కార్యకలాపాలపై కమిటీ సమీక్షించింది. కాకినాడ డైరి ఫారం సెంటర్ కు చెందిన దంపతులు ఈ క్లినిక్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ఐ.వి.ఎఫ్. చికిత్స చేస్తామని తమ నుండి రూ. 6,00,000లు వసూలు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, కాకినాడ వారికీ పిర్యాదు చేయగా జిల్లా కలెక్టరు వారి ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కమిటి ద్వారా విచారణ చేపట్టామని డిఎంహెచ్ తెలిపారు.ఈ సంస్థ ఎ.ఆర్.టి, సరోగసి చట్టం క్రింద రిజిస్ట్రేషన్ పొందలేదని డిఎంహెచ్ఓ తెలిపారు. డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియెట్ అథారిటీ తనిఖీలకు అందుబాటులో లేకపోవడం, నోటీసులకు స్పందించక పోవడం, సరైన రిజిస్ట్రేషన్లు పొందని కారణంగా యు.ఎస్. విమెన్ & ఫేర్తిలిటి క్లినిక్ పి.సి.పి.ఎన్.డి. రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ మరియు ఏపీపీఎంసీఇ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ లను 8 వారాల పాటు సస్పెన్షన్ చేసి తదుపరి చర్యలు చేపట్టాలని కమిటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఎ.ఆర్.టి (అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీస్), సరోగసీ మరియు పిసి & పిఎన్ డిటి యాక్ట్ ను పటిష్టంగా అమలు చేయడంతో పాటు తప్పనిసరిగా జిల్లా అప్రాప్రియెట్ ఆథారిటీ వద్ద నమోదు పొంది చట్టంలోని సూచనలను ఆసుపత్రులు ఖచ్చితంగా పాటించాలని, లేని పక్షంలో జరిమానా మరియు జైలు శిక్ష ఎదుర్కొనవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా లోని ఏ ఆసుపత్రి గాని, డయాగ్నోస్టిక్ సెంటర్ లు గాని రిజిస్టర్ కాకుండా ఎ.ఆర్.టి, సరోగసీ మరియు పిసి&పిఎన్ డిటి యాక్ట్ కేంద్రాలను నిర్వహించిన యడల చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని అని ఆయన తెలియజేసినారు. కాకినాడ జిల్లా లో రిజిస్ట్రేషన్ కాకుండా కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు గమనించిన వారు జిల్లా పిసి&పిఎన్ డిటి యాక్ట్ టోల్ ఫ్రీ నెంబర్ : 1800 425 3365 మరియు whats app నెంబర్ 9494113365 కు ఫోన్ ద్వారా గాని లేదా లిఖిత పూర్వకంగా గాని తెలియజేయాలని కలెక్టర్ కోరారు. అలాగే ఇంట్రా యూటీరినే ఇన్సమినేషన్ (ఐ.యు.ఐ) ప్రొసీజర్ లు కూడా ఎ.ఆర్.టి యాక్ట్ 2021 లెవెల్ 1 లోకి వస్తాయని, కావున సంబంధిత యజమాన్యాలు, ఈ ప్రొసీజర్ లను రిజిస్టర్ కాకుండా నిర్వహిస్తే శిక్షార్హులని తెలిపారు. గూగుల్, వాట్స్ యాప్, టెలిగ్రామ్, పోస్టర్ లు, యూ ట్యూబ్, పామ్ ప్లేట్స్, గోడ పత్రికలు, హోర్డింగ్ లు ద్వారా ఎ.ఆర్.టి, సరోగసీ రిజిస్టర్ కానీ సెంటర్ లు ప్రకటనలు ఇవ్వడం చట్ట రీత్యా నిషేధమని, అలా ప్రకటనలు ఇచ్చిన వారి పై ఎ.ఆర్.టి, సరోగసీ చట్టం ప్రకారం చర్యలు తీసుకొవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేసారు. కాకినాడ జిల్లాలోని ఎ.ఆర్.టి, సరోగసీ మరియు పిసి&పిఎన్ డిటి యాక్ట్ కి సంబందించిన ఆసుపత్రుల యజమాన్యం, డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలను, ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# అమ్మ తొలి నేస్తం



ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో 10–19 ఏళ్ల మధ్య వయసువాళ్లున్న దేశం మనది. వీళ్ల సంఖ్య దాదాపు 5 కోట్లు ఆ దశలో శారీరక, మానసిక, సామాజిక మార్పులెన్నో చోటు చేసుకుంటాయి. అమ్మాయిలకు ఇది మరీ చిన్నదైన దశ ఈ సమయంలో తల్లిదండ్రులు ఆశ్రమంగా ఉండటం ఎంతైనా అవసరం. వాళ్లకు మీ, మార్గనిర్దేశం ఈ దశమ సాఫీగా చాటడమే కాదు, భవిష్యత్తునూ తీర్చిదిద్దుకోగలరు.

ఈ వయసు వాళ్ల ఎత్తు, బరువుల్లో మార్పులుంటాయి. అమ్మాయిల్లో రుతుక్రమం మొదలవుతుంది. భావోద్వేగాల్లో తీవ్ర మార్పులు ఉంటాయి. హార్మోన్ల ప్రభావంతో కొత్త అనుభూతులకు లోనవుతారు. కొత్త స్నేహాలు ఏర్పడతాయి. అదే సమయంలో పోల్చుకోవటం పెరిగి ఒత్తిడి ఉంటుంది. ఇష్టాలను ఏర్పరచుకోవడం, స్వతంత్రతను కోరుకోవడం మొదలవుతుంది. వాళ్ల ఆసక్తుల్ని ప్రోత్సహిస్తూనే, దారి తప్పకుండా చూడాలి.

**స్నేహం-ప్రేమ:** స్నేహాలు కీలకం. మంచినా, చెడు అయినా స్నేహితుల నుంచి వేగంగా నేర్చుకుంటారు. మంచి లక్షణాలు ఉన్నవారితో స్నేహం చేయడం గురించి చెబుతుండాలి. ఆకర్షణలకు లోనయ్యేది ఇప్పుడే ప్రేమకు, ఆకర్షణకు మధ్య తేడాలను గుర్తించడం చెప్పాలి. మానసిక ఆరోగ్యం.. ఏదైనా సమస్య ఉంటే, నిర్భయంగా చెప్పమనండి. ఒత్తిడి కారణంగా ఆత్మహత్య ఆలోచనలు తనకు గానీ, స్నేహితులకు గానీ వస్తుంటే గనుక మీతో పంచుకోమనండి. సమస్య తీవ్రంగా ఉంటే మానసిక నిపుణుల సాయం తీసుకోండి.

**నిద్ర ప్రాధాన్యం:** ఎనిమిది గంటల రాత్రి నిద్ర తప్పనిసరి. కచ్చితమైన నిద్రవేళల్ని పాటించేలా అలవాటు చేయాలి. పడకగది వాతావరణం ఆహ్లాదంగా, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఉండాలి. నిద్రకు ముందు స్క్రీన్ టైమ్ లేకుండా చూడాలి.

**సోషల్ మీడియా ..**
ఇప్పుడు స్కూల్ పిల్లలకీ సోషల్ మీడియా ఖాతాలు ఉంటున్నాయి. ఏదైనా పోస్ట్ చేసేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోమనండి. వాస్తవాలు తెలుసుకోమనండి. వీళ్లు పెట్టే పోస్టులు ఎవరినీ కించపడిచేలా లేకుండా చూడమనాలి. చట్టపరంగా ఏవైనా చిక్కులు తెస్తాయేమో గమనించుకోమనాలి.

**వ్యాయామం- పరిశుభ్రత ..** వీళ్లలో ఊబకాయలూ ఎక్కువే నడక సైక్లింగ్ స్విమింగ్, డ్యాన్సింగ్.. ఇలా ఒకరకమైన వ్యాయమం అవసరం. వీలైతే మీరూ వాళ్లతో వెళ్లండి చేతులు కడుక్కోవడం, స్నానం, బ్రష్ చేయడం లాంటివీ గుర్తుచేస్తూ వారికి అలవాటు చేయాలి. వ్యక్తిగత పరిశుభ్రత, ముఖ్యంగా రుతుక్రమ సమయంలో పాటించాల్సిన అంశాల్ని చెప్పాలి. శానిటరీ ప్యాడ్‌ల వినియోగం, వాటిని డిస్పోజల్ చేయడం గురించి చెప్పాలి. వీటిలో ఏదీ ఒక్కరోజులో అలవాటు కాకపోవచ్చు. అలాగని నిర్లక్ష్యంగా ఉన్నారా, సమస్య జటిలం అవుతుంది. □

# సేంద్రియ సాగుతో ఆరోగ్యాన్ని పండిస్తోంది !

కన్నబిడ్డల్నే కాదు, పంటల్నీ పండించే భూమినీ కంటికి రెప్పలా కాపాడుకోగలిగేది మహిళే హైబ్రిడ్ విత్తనాలు, వాతావరణ మార్పులు. రసాయనాల వాడకంతో సంప్రదాయ పంటలెన్నో అంతరించిపోతున్నాయి.. ఆరోగ్యానికి చేటు చేస్తున్నాయి. అందుకే ఆ విత్తనాల్నీ వ్యవసాయ జీవ వైవిధ్యాన్నీ పరిరక్షిస్తూ సేంద్రియ సాగుకి శ్రీకారం చుట్టుంది. మహిళాలోకం భూమిని సంరక్షిస్తూ భవిష్యత్తుని చిగురింపచేస్తోంది. ఇలాంటి రైతుల ప్రయాణం మరెందరికో స్ఫూర్తిదాయకం ! రెక్కాడితే కానీ డొక్కాడని బతుకు పరమాత్ముల **కోటేశ్వరమ్మది**. ప్రమాదంలో కాలు పోగొట్టుకుంది. ఆ బాధ నుంచి కోలుకోకముందే చెయ్యి విరిగింది. అయినా నిరాశను దరిచేరనివ్వలేదు. సేంద్రియ వ్యవసాయం చేస్తూ ఆరోగ్యాన్ని పండిస్తోంది.



మాది ఫల్నారు. జిల్లా, యడ్లపాడు ఉన్నవ గ్రామం. వ్యవసాయమే జీవనాధారం. ఏడేళ్ల కిందట వ్యవసాయ శాఖ నుంచి కొందరు వచ్చి రసాయనాలు తగ్గించి, సేంద్రియ వ్యవసాయం చేయమన్నారు. దానిమీద ఆసక్తి నమ్మకం లేకపోయినా భూమికి కలుగుతున్న హాని గురించి తెలిశాక.. పదిహేను సెంట్లలో రసాయనాలు చల్లకుండా మిర్చి వేశా. మిగిలిన పాటలో తెగుళ్లు రాకుండా రసాయనాలు చల్లాను. అయినా తెగుళ్లు పట్టాయి. పంట పోయింది. కానీ, సేంద్రియ మిర్చి చెక్కు చెదరలేదు. అప్పట్నుంచీ సేంద్రియ వ్యవసాయం మొదలుపెట్టా. మంచి దిగుబడి వచ్చింది. మా జిల్లాలో ఇలా చేసిన మొదటి మహిళని నేనే. ఇంతలోనే కోవిడ్... మిర్చి లోడ్ చేసి ఇంటికి వెళ్తుంది.. వెనక నుంచి ఆటో వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలయ్యాయి. కోవిడ్ వల్ల ఏ ఆసుపత్రిలోనూ చేర్చుకోలేదు. రోజంతా చికిత్స అందలేదు. మరుసటి రోజు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చితే... ఇన్ఫెక్షన్ సోకింది, కాలు తీసేయాలి. ఇద్దరం కష్టపడితేనే మూడుపూటలా తినడం కష్టం... ఇప్పుడు అది కూడా సాధ్యం కాదని తెలిసి చాలా ఏడ్చాను.. ఆపరేషన్ కోసం ఉన్న ఏకరం పొలాన్నీ అమ్మేశాం. రూ.6 లక్షలకు పైగానే అప్పు చేశాం. కోలుకుని ఇంటికి వచ్చాక... సేంద్రియ వ్యవసాయం చేసిన మహిళగా నాపై వచ్చిన కథనాలు చూశా. ఆ స్ఫూర్తితోనే... పొలం కౌలుకు తీసుకుని పండించడం మొదలుపెట్టా. సర్జికల్ వాకర్ సాయంతో పొలంలోకి అడుగుపెట్టా. కానీ కొన్ని రోజులకి ఇంట్లో జారిపడితే చేయి విరిగింది. దెబ్బ మీద దెబ్బ... అయినా సాగు మానలేదు. పర్వాలేదు అనుకున్న సమయానికి తుపాను వచ్చింది. పది ఎకరాల్లో వేసిన మిర్చి, కంది, కూరగాయలన్నీ కళ్లముందే తుడిచిపెట్టుకుపోయాయి. రూ.3 లక్షల నష్టం.



అప్పుడే హైదరాబాద్, గుంటూరు నుంచి కొందరు వచ్చి... వ్యవసాయం మానేయొద్దనీ, పండించిన పంటనంతా వాళ్లే కొంటామని ఒప్పందం చేసుకున్నారు. అలా ప్రస్తుతం ఆరెకరాలు కౌలుకు తీసుకుని సేంద్రియ వ్యవసాయం చేస్తున్నా. మిర్చి, పత్తి, కంది, అరటి, క్యాబేజీ, క్యారెట్ ఇలా సుమారు 30 రకాల పంటల్ని పండిస్తున్నా. పదిమందికి ఉపాధీ కల్పిస్తున్నా. గట్టు పైనుంచే అజమాయిషీ చేస్తూ.. కూలీలతో పనిచేయించడం నాకు ఇష్టం ఉండదు. దుక్కిదున్నడం దగ్గర్నుంచీ కలుపు తీయడం, కూరగాయలు కోయడం, పత్తి ఏరడం లాంటి పనులన్నీ నేను చేస్తూ వాళ్లతోనూ చేయిస్తాను. చుట్టుపక్కల కాలనీలకు, కొన్ని ప్రైవేట్ కళాశాలలకు కూరగాయల్ని విక్రయిస్తున్నా. ప్రభుత్వమూ మాలాంటి వారికి సాయం చేస్తే రసాయన రహిత ఆహారం అందరికీ చేరువవుతుంది. □







# ఎముకల ఆరోగ్యానికి..



వర్షాకాలం వచ్చిందంటే చాలు.. మార్కెట్లో ఎక్కడ చూసినా ఆలూబుఖారా పండ్లే కనిపిస్తాయి. ఈ సీజన్‌లో మాత్రమే దొరికేవీటిని తినడం వల్ల ఎన్ని లాభాలున్నాయంటే..

✦ క్యాలరీలు తక్కువగా, నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి కొలస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవాళ్లూ, అధిక బరువు ఉన్నవాళ్లు తరచూ తీసుకోవచ్చు.

✦ వీటిల్లో ఉండే పీచు పదార్థాలు జీర్ణక్రియను మెరుగు పరచడానికీ, పేగులను శుభ్రపరచడానికి తోడ్పడతాయి. ✦ రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా చేసి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

✦ వీటిల్లోని విటమిన్–సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. తరచూ ఇన్ఫెక్షన్ల బారినపడకుండా కాపాడుతుంది. ల. వీటిల్లోని సిట్రిక్‌యాసిడ్ ఆలసటనూ, నొప్పులను తగ్గిస్తుంది. ✦. మలబద్ధకం, ఇతర జీర్ణ సంబంధిత సమస్యలనుంచి కాపాడతాయి.

✦. ఇవి రక్తహీనతను నియంత్రి స్తాయి.

✦ చర్మాన్ని మృదువుగా చేస్తాయి. అంతేకాదు వృద్ధాప్యఛాయలను దూరం చేస్తాయి కూడా. □

# నల్లపూసల వైభవం





వైవాహిక బంధానికి సూచికగా, సౌభాగ్యానికి ప్రతీకగా భావించే నల్లపూసల్ని మెచ్చని మగువలుంటారా చెప్పండి! అందులోనూ శ్రావణ మాసంలో వీటికి ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. నల్లపూసల గొలుసు చేయించుకోవాలన్న ఆలోచన వచ్చిందంటే చాలు... వరలక్ష్మీ వ్రతం నాటికైనా అది తయారైతే బాగుండును అని కోరుకోని మనసుండదు. నిజానికి నలుపు రంగుని అశుభానికి గుర్తుగా భావించాం. కానీ, నల్లపూసల్ని మాత్రం మంగళకరంగా పరిగణిస్తాం. ఇవి వివాహితల స్టైల్ స్టేట్‌మెంట్‌లో ఓ భాగంగా మారిపోయాయి. అయితే ఒకప్పుడు వట్టి నల్లపూసల్నే గుచ్చుకుని వేసుకునేవారట. తర్వాత ఓ చిన్నపసిడి గొట్టం, తర్వాత గుండ్లూ, సూత్రాలు... ఇలా ఎన్నెన్నో డిజైన్లు వచ్చి చేరుతూనే ఉన్నాయి. ఆ మధ్య కనీకనిపించని బ్లాక్‌బోడ్స్‌ని ఏంచుకుంటే, తర్వాత హారాలు, నెక్లెస్‌లను పోలి ఉండేలా చేయించుకున్నారు. రాళ్లు, ముత్యాలు, పగడాలు, పచ్చలు.. వంటి నవరత్నాలతో మురిసిపోయారు. ఇప్పుడు నెటెడ్ నల్లపూసల గొలుసులే ఫ్యాషన్ అంటున్నారు. పసిడి గొలుసు చుట్టూ వల అల్లినట్లుగా వస్తుందీ డిజైన్. బంగారు తీగల మధ్యన ముత్యాలు, పగడాలు... ఉంచితే మరింత అందంగా కనిపిస్తుంది. మెడలో మరే ఆభరణం పెట్టుకోకపోయినా... నిండుగా కనిపించేలా చేస్తుంది. ఓసారి మీరూ చూడండి.





✦ ఇంట్లో ఈగల రాకుండా వుండాలంటే ఇల్లు కడిగేటప్పుడు గచ్చుమీద కొంచెం పసుపు చల్లి కడిగితే ఈగలు రాకుండా ఉంటాయి.

✦ కర్పూరం పొడిచేసి చల్లితే చీమలు రావు.

✦ సోపు నమిలితే నోటి దుర్వాసన వుండదు. □

చెలి చిట్కా

# చికిత్స తరువాతే పెళ్లి చేయండి

వ్యథ



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న: నా వయస్సు 50 ఏళ్ళు. ఐదేళ్ళ క్రితం భర్త చనిపోయారు. చిన్న కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాను. ఉన్న ఒక కూతురు అర్థం కాని రుగ్మతలతో బాధపడుతున్నది. ఎం.బి.ఎ చదివినప్పటికి లేని పోని భయాలతో ఆందోళన చెందుతున్నది. 30 ఏళ్ళు వస్తున్నప్పటికి పెళ్ళి వద్దంటోంది. చిన్నప్పటి నుంచి శుచి, శుభ్రత కొంత ఎక్కువగా పాటిస్తున్నది. గత ఐదేళ్ళుగా మరింత ఎక్కువ అయ్యింది. దారిలో ఎక్కడైనా గుట్కా కవర్లు కనిపిస్తే భయపడుతుంది. ఇక ఆ దారిలో వెళ్ళదు. మా బంధులలో ఒక అతను ఎక్కువగా గుట్కా వాడేవాడు. ఆయన చిన్న వయస్సులోనే క్యాన్సర్ భారిన పడి చనిపోయాడు. అప్పటి నుంచి ఆమెకు గుట్కా అన్నా వాటిని ప్యాక్ చేసే కవర్లు అన్నా భయపట్టుకుంది. అలాగే ఎవరినీ ముట్టుకోలేదు. గుంపు వున్న చోటుకు వెళ్లదు. ఇంటికి బంధువులు వచ్చినా వారి పక్కన కూర్చోదు. వారికి నీళ్ళు ఇవ్వాలన్నా చేతికి ఇవ్వకుండా పక్కన పెడుతుంది. వాళ్ళు వెళ్ళి పోయిన తరువాత హాలు శుభ్రం చేస్తుంది. సోఫా, కుర్చీలను తడిగుడ్డతో తుడుస్తుంది. తరువాత తాను స్నానం చేస్తుంది. ఈ విషయం తెలియడం వల్ల మా యింటికి రావాలంటే బంధువులు స్నేహితులు భయపడుతున్నారు. వయస్సు మీరుతున్నందున పెళ్ళి చేయాలని ప్రయత్నం చేస్తున్నాను. ఏదో విధంగా మా అమ్మాయి లోపం తెలియడంతో సంబంధాలు రద్దవుతున్నాయి. అయితే నెల క్రితం మా బంధువుల అబ్బాయి పెళ్ళి చేసుకోవడానికి ముందుకు వచ్చాడు. అతనికి తల్లిలేదు. తండ్రి వ్యసనపరుడు అబ్బాయి ఎంబిఎ చదివి ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.25వేలు జీతం వస్తోంది. మా అమ్మాయి లోపం తెలిసినప్పటికి, పరిస్థితుల వల్ల పెళ్లికి సుముఖత వ్యక్తం చేస్తున్నాడు. పెళ్ళియిన తరువాత మార్చుకుంటానని అంటున్నాడు. మా అమ్మాయిని అతి కష్టం మీద ఒప్పించాను. పెళ్ళి చేసుకోను అంటే ఆత్మహత్య చేసుకుంటానని భయ పెడితే సరే అన్నది. అయితే తెలిసిన వారు ఇలాంటి స్థితిలో పెళ్ళి చేస్తే అబ్బాయి కూడా బాధపడాల్సి వస్తుందని సైకియాట్రిస్టుకు చూపమని సలహా ఇస్తున్నారు. ఈ స్థితిలో మా అమ్మాయిని బాగు చేసి పెళ్లి చేసే మార్గం చెప్పండి. - **ఒక సోదరి, మదనపల్లి**



జవాబు: మీ సమస్య, మీ అమ్మాయి రుగ్మత అర్థమయ్యింది. మీ అమ్మాయిలో ఫోబియా, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ (ఓసిడి) లక్షణాలు కనిపిస్తున్నాయి. ఒక మోస్తరు దశలో అయితే సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయిస్తే సరిపోయేది. తీవ్ర స్థాయిలో ఉన్నందున సైకియాట్రిస్టు ద్వారా చికిత్స చేయిస్తూ కౌన్సెలింగ్ కూడ చేస్తే మంచిది. ఇది తగ్గడానికి నెలల సమయం పట్టవచ్చు. కాబట్టి సైకియాట్రిస్టును కలసి క్రమబద్ధంగా మందులు వాడండి. ఇలాంటి వారుడాక్టరు వద్దకు రావడానికి కూడ భయపడే, అవకాశం ఉంది. అలాగే మందులు కూడా వాడటానికి ఇష్టపడక పోవచ్చు. అయితే మీరు ఓర్పు, సహనం వహించి చికిత్స చేయించండి. రుగ్మత పూర్తిగా తగ్గిన తరువాతనే పెళ్లి చేయండి. ఇలాంటి వారిలో ఫ్రిజెడిటి లక్షణాలు కూడా ఉంటాయి. అంటే శారీరక కలయిక సమయంలో సిగ్గు, బిడియం సంకోచం, భయం వ్యక్తం చేయడం కాబట్టి తొందరపడి, బలవంతంగా పెళ్లి చేస్తే కొత్త సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. పెళ్లయిన తరువాత ఆమెను మార్చుకోవడం అబ్బాయికి వీలుకాదు. వైద్య చికిత్సలు చేస్తేనే వెంటనే తగ్గుతుందన్న గ్యారెంటీ లేదు. మీరు బాధలు చెప్పుకుని, సానుభూతి పొందడం వల్ల ప్రయోజనం ఉండదు. చికిత్స చేసి పరిష్కారం కోసం ప్రయత్నం చేయండి. □


# ఐస్‌క్రీమ్ పౌడర్ ఇంట్లోనే..

మధుమేహం, సైనస్ లాంటి ఆరోగ్య సమస్యలు ఉంటే తప్ప ఐస్క్రీమ్ తినని వాళ్లు దాదాపుగా ఉండరు. పిల్లలకీ పెద్దలకీ కూడా అంతష్టం మరి. ఇది సాధారణంగా కొనుక్కుని తింటాం. ఒకవేళ ఇంట్లో చేసినా.. ఐస్‌క్రీమ్ పౌడర్ తెచ్చుకుంటాం. కానీ ఆ పౌడర్ కూడా ఇంట్లోనే చేయొచ్చు.



అందుకు ఐదు పదార్థాలు అవసరమౌతాయి. అవేమంటే. 200 గ్రాముల మిల్క్ పౌడర్ తీసుకుంటే అంతే పరిమాణంలో పంచదార, 10 ఎం.ఎల్ వెనీలా లేదా స్ట్రా పౌడర్ వంటి ఫుడ్ ఎసెన్స్, 10 గ్రాముల బేకింగ్ సోడా, 4 గ్రాముల పొటాషియం మెటాబైసల్ఫేట్.. అంటే నిలవుండేందుకు ఉపయోగించే ప్రిజర్వేటివ్ అన్నమాట. ఇప్పుడిక పంచదారను మెత్తగా పొడి చేసి.. ఒక పాత్రలో వేయాలి. దానికి మిల్క్ పౌడర్, బేకింగ్ సోడా, పొటాషియం మెటాబైసల్ఫేట్, వెనీలా లేదా మరేదైనా ఫుడ్ ఎసెన్స్.. వీటన్నిటినీ జోడించి బాగా కలపాలి. అంతే ఐస్క్రీమ్ పౌడర్ తయారైనట్లే దీన్ని తడి లేని, గాలి చొరబడని సీసాలోకి తీసి, ఫ్రిజ్‌లో భద్రం చేసుకోవాలి. ఇంకేముంది.. టేస్టీ టేస్టీ ఐస్క్రీమ్ ఎప్పుడంటే అప్పుడు చేసుకోవచ్చు. ఎప్పటిలా రెడీమేడ్ పౌడర్ కొనకుండా సొంతంగా చేశామన్న తృప్తి కూడా దక్కుతుంది. ఇందులో సూచించిన నిష్పత్తి ప్రకారం ఇంకా ఎక్కువ లేదా తక్కువ పరిమాణంలో చేయొచ్చు. □

# ఒకసారి శరణు వేడిన చాలును!



**నల్ల మస్తాన్ గారు గుంటూరుకు** వచ్చిన తొలి దినాలలో ఒక రోజు ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా వాన కురవసాగింది. విశేషమేమిటంటే ధ్యానం చేస్తున్న మస్తాన్ గారి ఇంటిపై ఒక వర్షపుచుక్క కూడ పడకపోవటం. ఇంతలో పిడుగు పడి ఒక మేక పిల్ల. ఒక మనిషి మరణించారు. వర్షం తగ్గింది. మస్తాన్ గారు సమాధి నుండి లేవగానే మరణించిన మేకపిల్ల కనిపించింది. ఆయన దానివద్ద కూర్చొని, భగవధ్యానం చేసి, దాని చుట్టూ ముమ్మారు తిరిగి 'ఉఠో' అన్నారు. ఆ మేకపిల్ల లేచి మస్తాన్ గారి పాదాల సందునుండి దూరి వెళ్లిపోయింది. ఈ వార్త ఊరంతా వ్యాపించగా పిడుగుపాటుతో మరణించిన వ్యక్తి తల్లి వచ్చి, మస్తాన్ గారి పాదాలను పట్టుకుని వల, వల దుఃఖించింది. కరుణా సముద్రుడు ఆ తల్లి దుఃఖం చూడలేకపోయాడు. శవం వద్దకు పోయి దైవ ధ్యానం చేసి, శరీరాన్ని తాకాడు. వెంటనే విగత జీవికి ప్రాణం వచ్చింది. లేచి కూర్చున్నాడు. సంగతి గ్రహించి మస్తాన్ గారి పాదాలపై పడ్డాడు. మహనీయుల కరుణకు పాత్రమైన ఏ జీవి అయినా అదృష్టవంతులే, జంతువు కావచ్చు, మనిషి కావచ్చు. షిరిడీలోని ద్వారాకామాయిలో కొలువై ఉన్న సాయి ఇందుకు భిన్నుడు కాదు. అది 1917వ సంవత్సరం.

వైశాఖ మాసం (మే నెల). ఎండలు మండిపోతాయని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఒక పిచ్చి కుక్కచే కరవబడిన ఒక చిన్ని కుక్క వెంటబడ్డారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అనే నానుడి జంతువులకు కూడా వర్తిస్తుంది. అది ద్వారకా మాయిలోనికిపరుగు తీసింది. గ్రామస్తులందరు అది బయటకు వస్తే చంపటానికి బయట నిలబడి 'బాబా! ఆ కుక్క పిచ్చిది. వెలుపలకు తరమండి, దానిని చంపెదము అనగా, సాయిబాబా పిచ్చివారలారా! దూరంగా పొండు. దిక్కులేని ఈ చిన్న జీవిని చంపదలచినారా. అన్నాడు. ఆ జీవి రక్షణ పొందింది. అంతియే కాదు దాని పిచ్చి కూడా మటుమాయమైంది. సాయినాథుని పాదధూళితో పరమ పావనమైన ద్వారకామాయిని శరణు వేడిన వారికి ఆపదలు ఆమడ దూరం పోతాయి. సాయి రక్షణ పొందిన చాలు - భీతికి తావు ఉండదు.

- **యం.పి.సాయినాథ్**



ఆధ్యాత్మికం

# ఎనలేని సంతృప్తి ఇచ్చే రక్తదానం : చిరంజీవి




**రక్తదానం** ఎనలేని సంతృప్తిని ఇస్తుంది. రక్తదానం అనగానే నా పేరు గుర్తుకు రావడం ఎన్నో జన్మల పుణ్యఫలం: మెగాస్టార్ చిరంజీవి 79వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని ఫీనిక్స్ ఫౌండేషన్, చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సూపర్ హీరో తేజా సజ్జా, హీరోయిన్‌సంయుక్త అతిథులుగా హాజరయ్యారు. ఈరోజు నిర్వహిస్తున్న రక్తదాన కార్యక్రమంలో 800 మంది రక్తదానం చేస్తున్నారు. సేకరించిన రక్తాన్ని ఇండియన్ ఆర్మీకి డొనేట్ చేయనున్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ, ఈ అద్భుతమైన కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక నమస్కారాలు. నాకు అత్యంత ఆప్తుడైన సురేష్ చుక్కపల్లి వారు చేస్తున్న అనేక సామాజిక కార్యక్రమాలతో పాటు గత రెండేళ్లుగా ఈ బ్లడ్ డొనేషన్ కూడా మొదలుపెట్టి నా హృదయానికి మరింత దగ్గర అయ్యారు. ఇంత చక్కటి కార్యక్రమం చేస్తున్న నా మిత్రుడు సురేష్‌కి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ కార్యక్రమానికి విచ్చేయడమే కాకుండా బ్లడ్ డొనేట్ చేసిన బిడ్డ లాంటి తేజకి హృదయపూర్వక ధన్యవాదాలు. ఇప్పుడే కాదు తన ఎన్నోసార్లు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సంయుక్తకి, చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవికి మిగతా అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. రక్తదానం చేస్తున్న దాతలు అందరికీ నేను శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. రక్తదానం చేయడం అనేది ఎనలేని సంతృప్తిని ఇస్తుంది. దాని వలన ఒక ప్రాణం నిలబడుతుంది. నేను ఇది ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న గొప్ప ఫీలింగ్. రక్తదానం గురించి నేను ఎన్నోసార్లు చెప్పాను. కానీ కొత్త జనరేషన్ కొత్త యువత వస్తుంది కాబట్టి ఈ విషయాన్ని మళ్లీ మళ్లీ చెప్పాల్సిన ఆవశ్యకత ఉంది. ఒక జర్నలిస్ట్ రాసిన ఆర్టికల్ చదివిన తర్వాతే నాకు బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన వచ్చింది.

ఆయనను ఇప్పటివరకూ చూడలేదు కానీ, ఎప్పుడూ గుర్తుచేసుకుంటూనే ఉంటాను. దాదాపు 27 ఏళ్ల క్రితం రక్తం దొరకక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిసిన తర్వాత ఎందుకు రక్తం దొరకడం లేదు అనే ఒక ఆలోచన నన్ను ఎప్పుడు తొలుస్తూ ఉండేది. మన అభిమానుల్ని బ్లడ్ డొనేషన్ వైపు మళ్లించగలిగితే గనుక ఒక అత్యంత శక్తివంతమైన సామాజిక సేవ వైపు నడిపినట్లుగా ఉంటుందని, దాని ద్వారా వారికి కూడా ఒక మంచి సంతృప్తి వస్తుంది కదా, ఒక మంచి పనికి నాంది పలికిన వాడిని అవుతానని ఆరోజు ఇచ్చిన పిలుపు.. ఈరోజు లక్షల మంది రక్తదానం వైపు కదిలించింది. ఇది నాకు చాలా గర్వకారణంగా ఉంది. రక్తదానం అనగానే నా పేరు స్ఫురించడం అనేది దేవుడు నాకు ఇచ్చిన గొప్ప అవకాశం గా భావిస్తున్నాను. ఎన్నో జన్మలుగా చేసిన పుణ్యఫలంగా భావిస్తున్నాను. హీరో తేజ సజ్జామాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవికి, ఈ కార్యక్రమానికివిచ్చేసిన అందరికీ నమస్కారం. ఇంత అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టిన సురేష్ చుక్కపల్లికి హృదయపూర్వక ధన్యవాదాలు. రక్తదాతలందరికీ ధన్యవాదాలు అన్నారు. హీరోయిన్ సంయుక్త మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ఇంత అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టిన నిర్వాహకులకు ధన్యవాదాలు. నేను చిరంజీవి కి పెద్ద అభిమానిని. ఆయనతో ఈ వేదిక పంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈరోజు ఇంతమందిరక్తదానం చేయడానికి మూల కారణమైన చిరంజీవి కి ధన్యవాదాలు. ఫీనిక్స్ గ్రూప్‌చైర్మన్‌సురేష్ చుక్కపల్లి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మాఅన్నచిరంజీవి, తేజ, సంయుక్త అందరికీ ధన్యవాదాలు.



## ప్రభాస్ హారర్ సినిమాకి షాకింగ్ రన్ టైంతో ఫుటేజ్!

**పాన్ ఇండియా** స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో తన కెరీర్ లో ఫస్ట్ ఎవర్ హారర్ సినిమాగా చేస్తున్న చిత్రం 'ది రాజా సాబ్" కూడా ఒకటి. దర్శకుడు మారుతీతో చేస్తున్న ఈ సినిమా పట్ల కూడా ఇపుడు మంచి హైప్ నెలకొనగా చిత్ర యూనిట్ సినిమా ఆఖరి దశకి తీసుకొస్తున్నారు. అయితే ఇది వరకు తెరకెక్కించిన ఫుటేజ్ మొత్తంపై నిర్మాత రివీల్ చేసిన అంశం ఒకింత షాకింగ్ అని చెప్పాలి. మరి అంత ఫుటేజ్ నుంచి ఎలాంటి సన్నివేశాలు తీసి విడుదల చేస్తారో చూడాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో టీజీ విశ్వప్రసాద్ నిర్మాణం వహిస్తున్నారు .

# అందరి హృదయాలు దోచే 'బకాసుర రెస్టారెంట్ '

**వైవిధ్యమైన** పాత్రలతో..

విభిన్న చిత్రాలతో కమెడియన్‌గా, నటుడిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రవీణ్. ఆయన తొలిసారిగా హీరోగా నటిస్తున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం హారర్ థ్రిల్లర్, కామెడీ, ఎమోషన్ అన్నీ రకాల అంశాల మేళవింపుతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఎస్‌జే శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ నెల 8న చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా నటుడు ప్రవీణ్‌తో జరిపిన ఇంటర్వ్యూ ఇది..

**'బకాసుర రెస్టారెంట్' ఎలాంటి క?**

ఈ సినిమా ఐదు పాత్రలతో నడుస్తుంది. ఇందులో కథను నడిపించే పరమేష్ అనే పాత్రలో నేను కనిపిస్తాను. నా పాత్రలో ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్ కూడా ఉంటుంది. నా పాత్రకు ఉండే ఓ యాంబిషన్ ఎలా ఫుల్‌ఫిల్ అయ్యింది అనేది ఆసక్తికరంగా ఉంటుంది. మీ పాత్ర చుట్టే కథ నడవడం, మీరు హీరోగా నటించడం వల్ల ఎమైనా ప్రెజర్‌గా ఫీలవుతున్నారా? నిజం చెప్పాలంటే ఇది కొంచెం బరువే. పర్‌ఫార్మెన్స్ వైజ్ నాది రెగ్యులర్ పాత్ర కాదు. కథలో హారర్, థ్రిల్లర్, మైథాలజీ ఇలా అన్నీ మిక్స్ అయ్యాయి. ఐదు పాత్రలున్న కథను నడిపించే పాత్ర కావడంతో కాస్త టెన్షన్‌గానే ఉంది. అయితే సినిమాను దర్శకుడుఎంతో క్లారిటీగా తెరకెక్కించాడు. అయితే సినిమానుమంచి ప్రమోషన్‌తో బయటికి తీసుకరావాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ విషయంలోనాకుసినీపరిశ్రమలోని అందరూ సహకరిస్తున్నారు.




**ఈ సినిమాలో మీ పాత్రలోఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుందా?**

ఎంటర్‌టైన్‌మెంట్‌తోపాటుఎమోషన్‌కూడా ఉంటుంది. నా పాత్రలో ఎమోషన్‌ను పండించడమే నాకు చాలెంజింగ్‌గా అనిపించింది. ఓ పెయిన్‌ఫుల్ ఎమోషన్‌తోనే ఈ కథ ఎండ్ అవుతుంది.

**తిండిబోతు దెయ్యం మిమ్ములను ఇబ్బంది పెడుతుందా?** ఇదొక కాన్సెప్ట్ కథ. ఆ తిండిబోతు దెయ్యం పెట్టే ఇబ్బంది చాలా ఎంటర్‌టైనింగ్‌గా.. ఎమోషనల్‌గా ఉంటుంది.

**కమెడియన్‌గా హీరోగామారితే కమెడియన్‌గా అవకాశాలురావని అంటుంటారు?**

-అలాంటిదేమీ లేదు. అసలు నేను హీరోగా ఫీలయితే అలాంటి ఫీలింగ్ అందరిలో వస్తుంది. **దిల్ రాజు ఈ సినిమాను పంపిణీ చేస్తున్నారని తెలిసింది?**

-శిరీష్ సినిమా చూసి మంచి కథను ఎంచుకున్నారు అన్నారు. సినిమా ఆయనకు బాగా నచ్చింది. అందుకే ఎస్వీసీ ద్వారా విడుదల చేస్తున్నాం.

**సినిమాలో ఉండే స్పెషాలిటీ ఏమిటి?**

-ముఖ్యంగా పతాక సన్నివేశాలు చాలా ఎమోషనల్‌గా ఉంటాయి. ఈ కైండ్ ఆఫ్ ఎమోషన్ ఈ సినిమాలో కూడా ఉంటుంది. ఇది అందరి హృదయాలకు హత్తుకుంటుంది.

# 'బ్యాడ్‌గర్ల్స్ టైటిల్ లాంచ్




30 రోజుల్లో ప్రేమించడంఎలా నినవాతో వంంచి జయాన్ని అందుకున్న డైరెక్టర్‌మున్నా ధులిపూడి నుంచి వస్తున్నమరో చిత్రం 'బ్యాడ్ గాళ్ళ్. కానీ లా మంచోళ్లు అనేది ట్యాగ్ లైన్. అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో రోహన్ సూర్య, ఎాఖంఖన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ప్రశ్విత ఎంటర్ టైన్‌వెంట్, ఎన్‌వీఎల్ క్రియే షన్స్ బ్యానర్స్‌పై శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్స య్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్‌ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ లిరిసిస్ట్ చంద్రబోస్ సాహిత్యం అందిస్తున్నఈచిత్రానికి అనూప్‌రూబెన్స్‌సంగీతం అందిస్తు న్నారు. ఈచిత్రంటైటిల్ మోషన్ పోస్టం ్‌ను ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన ్‌గ్రాండ్ ప్రెస్‌మీట్‌లో దర్శకులు చందూ మొండేటి, శివ నిర్వాణ, కృష్ణ చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొని రివీల్ చేశారు. డైరెక్టర్ కృష్ణచైతన్య మాట్లాడుతూ ,మున్నా చాలా సరదాగా ఉంటాడు. చాలా కొద్ది మంది దర్శకులే కొత్తవాళ్లని పెట్టుకుని సినిమా చేస్తారు. నా మిత్రుడు మున్నా కష్టానికి తగిన ఫలితం రావాలి. అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అద్భు తంగా ఉంటుంది. చంద్ర బోస్ పేరు ఉంటే చాలు. మొయిన్ 15 ఏళ్ల క్రితమే హీరో అవుతా అని చెప్పాడు. డైరెక్టర్ పవన్‌కి అప్పగించి నటుడిని చేశా. అక్కడి నుంచి మంచి క్యారెక్టర్స్ చేస్తూ ఇక్కడి వరకు వచ్చాడు. టీమ్ మొత్తానికి ఆల్ ది బెస్ట్‌శివ నిర్వాణ మాట్లాడుతూ, బ్యాడ్ గాళ్స్ మూవీ మంచి సక్సెస్ సాధించాలి. టీమ్ మొత్తానికి ఆల్‌ది బెస్ట్. నలుగురు కొత్త అమ్మాయిలను పెట్టి చేయడం నిజంగా సాహసమే. ఇంత యంగ్ టాలెంట్‌తో కాన్సెప్ట్ ఫిల్మ్‌ను తీస్తున్న మున్నా ముక్కుసూటి మనిషి. ఈ సినిమా అతడికి మంచి విజయాన్ని అందిస్తుంది. నిర్మాతలందరికీ మంచి డబ్బులు రావాలి. ఈ సినిమాకు రెండు మెయిన్ పిల్లర్స్ అనూప్, చంద్రబోస్. నీలి నీలి ఆకాశం ఎంతగానో వైరల్ అయింది. ఒక పాటతోనే మున్నా అందరికీ తెలిశాడు. అలాంటి పాట ఈ సినిమాలో కూడా ఒకటి ఉంది. ఈసినిమా మంచి విజయం సాధించాలి. కమెడియన్ భద్రం మాట్లాడుతూ, . ఈ సినిమా అందరికీ మంచి గుర్తింపు తీసుకురావాలని కోరుకుంటున్నా అని అన్నారు. డైరెక్టర్ చందూ మొండేటి మాట్లాడుతూ, ఈ సినిమాలో ఈ సినిమా పెద్దహిట్ అవ్వాలి. అందరికీ ఆల్‌ది బెస్ట్ అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ 30రోజుల్లో ప్రేమించడం ఎలా తర్వాత నేను మున్నాగారితో కలిసి వర్క్ చేస్తున్నా. ఈ సినిమా కూడా అద్భుతమైన చిత్రం అవుతుంది. నీలినీలి ఆకాశం బ్యానర్‌లో మున్నాతో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. ఆల్ ది బెస్ట్ టు అవర్ టీమ్ అని అన్నారు. . ఈ కథను ఐదారుగురు పెద్ద నిర్మాతలకు చెప్పాను. కొత్త అమ్మాయిలతో మార్కెట్ అవుతుందా అని అడిగారు. అందుకే నేను, నా క్లాస్‌మేట్స్ డబ్బులు పెట్టి ఈ సినిమా తీశాం. బాగా చదువుకున్నవాళ్ల కథ ఇది. అమ్మాయిలను పేరెంట్స్ భయంతో పెంచుతాం. అమ్మాయిలను భయంతో కాదు ధైర్యంతో పెంచాలి అని చెప్పే కథ ఇది. అమ్మాయిలను అమ్మోరులా పెంచాలి. స్కూల్లో అమ్మాయిలను తమను తాము కాపాడుకునే సెల్ఫ్ డిఫెన్స్ ఒక సబ్జెక్ట్‌లా పెట్టాలి. మా మూవీ టీమ్ నుంచి అన్ని రాష్ట్రాల సీఎంలకు, కేంద్రప్రభుత్వానికి రిక్వెస్ట్ చేస్తున్నా. ఈ బ్యానర్ పెట్టడానికి కారణం డైరెక్టర్ మారుతి వాళ్ల స్ఫూర్తితోనే బ్యానర్ పెట్టాం. ట్రైలర్, సాంగ్స్ నచ్చితేనే మా సినిమా చూడండి. నీలినీలి ఆకాశంలాంటి సాంగ్ ఉంది. డైరెక్టర్ బుచ్చిబాబుకు ఈ కథ చెబితే ఇది చిన్నసినిమా కాదు చాలా మంచి సినిమా అవుతుందని ప్రోత్సహించాడు. సుకుమార్ గారికి టైటిల్ చెబితే అదిరిపోయిందన్నారు. ఈ నలుగురు అమ్మాయిలను లైఫ్‌లో మర్చిపోలేను. రేణూ దేశాయ్ గారు ఇందులో ఒక మంచి క్యారెక్టర్ చేశారు. నెక్స్ ఈవెంట్స్‌లో ఆమె పాల్గొంటారు.

# 'జీ5 '2025లో మరో సూపర్ హిట్



**'సట్టముం నీతియుం'** సిరీస్‌కు ఇంత పెద్ద విజయాన్ని అందించిన చేసిన తెలుగు ప్రేక్షకులకుథాంక్స్.. సక్సెస్ మీట్‌లో నిర్మాత శశికళ ప్రభాకరన్‌భారతదేశంలోని అతిపెద్దస్వదేశీ ఓటిటి ప్లాట్‌ఫారమ్ అయిన జీ52025లోమరోసూపర్‌హిట్ ప్రీమియర్ తో ఆడియెన్స్ ముందుకు రాబో తోంది. సంక్రాంతికి వస్తున్నం, రాబిన్‌హుడ్, భైరవం వంటి వరుస తెలుగు సూపర్ హిట్‌లను అందించిన తర్వాత జీ5 తెలుగు ఇప్పుడు మరో అద్భుతమైన సిరీస్‌ను అందించింది. శరవణన్ ప్రధాన పాత్రలో నటించిన 'సట్టముం నీతియుం్ఞ సిరీస్‌ను జీ5 తెలుగు ప్రేక్షకులకు అందించింది. 18 క్రియేటర్స్ బ్యానర్ మీద ఈ సిరీస్‌ను శశికళ ప్రభాకరన్ నిర్మించారు. షో రన్నర్‌గా సూర్య ప్రతాప్. ఎస్ వ్యవహరించారు. బాలాజీ సెల్వరాజ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సిరీస్ తెలుగులో రీసెంట్‌గా స్ట్రీమింగ్ అయి మిలియన్ల స్ట్రీమింగ్ మినిట్స్‌తో దూసుకుపోతోంది. ఈ క్రమంలో 'సట్టముమ్ నీతియుమ్ఞ్ సక్సెస్ మీట్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శశికళ మాట్లాడుతూ, నిర్మాతగా ఇలా స్టేజ్ మీద మాట్లాడుతుండటం కొత్తగా ఉంది. యాంకర్‌గా ఎన్నో సార్లు మైక్ పట్టుకున్నా కూడా ఈ రోజు ఇలా కొత్తగా అనిపిస్తోంది. ఇదంతా కూడా నా భర్త ప్రభాకరణ్ వల్లే సాధ్యమైంది. ఈ సిరీస్ అందరినీ ఆకట్టుకుంటోంది.

ఈ సిరీస్‌ను ఇంత గ్రాండ్ సక్సెస్ చేసిన అందరికీ థాంక్స్. తెలుగులోనూ ఈ సిరీస్ అద్భుతంగా దూసుకుపోతోంది. ఈ సిరీస్‌కు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. బాలాజీ ఈ సిరీస్‌ను కేవలం 13 రోజుల్లోనే పూర్తి చేశారు. ఆయన వల్లే ఈ సిరీస్ ఇంత అద్భుతంగా వచ్చింది. ఆర్ట్ డైరెక్టర్ భావన మాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. శరవణన్ సర్ ఈ సిరీస్‌కు బ్యాక్ బోన్‌లా నిల్చున్నారు. నమ్రత ప్రస్తుతం చాలా బిజీగా మారిపోయారు. ఈ సిరీస్‌లో అందరూ అద్భుతంగా నటించారు. నా భర్త ప్రభాకరణ్‌కు సిరీస్‌లు, సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉంటుంది. ఆయనకు ఈ ప్రాజెక్ట్ చాలా ప్రత్యేకం. ఈ సిరీస్ కోసం ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. ఇంత పెద్ద సక్సెస్ చేసిన ఆడియెన్స్‌కు థాంక్స్ అని అన్నారు. బాలాజీ సెల్వరాజ్ మాట్లాడుతూ, నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన నా నిర్మాతలు, జీ5 టీంకు థాంక్స్.

నా ఫస్ట్ హీరో శరవణన్ సర్. ఈ సిరీస్‌లో పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అందరూ ఈ సిరీస్‌ను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. అన్నిభాషల్లో మంచి రెస్పాన్స్ వస్తుండటం ఆనందంగా ఉంది అని అన్నారు. లాయిడ్ జేవియర్ మాట్లాడుతూ, మమ్మల్ని మీడియా ఎప్పుడూ సపోర్ట్ చేస్తూనే ఉంటుంది. సట్టముం నీతియుం బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. పది రోజుల్లోనే వంద మిలియన్ల స్ట్రీమింగ్ మినిట్స్‌ను దాటేసింది. 13 రోజుల్లోనే ఇంత మంచి సిరీస్‌ను తెరకెక్కించడం మామూలు విషయం కాదు. పబ్లిక్ డిమాండ్ వల్లే ఈ సిరీస్‌ను ఇతర భాషల్లోకి డబ్ చేశాం. ప్రస్తుతం తెలుగులోనూ ఈ సిరీస్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సిరీస్‌ను సక్సెస్ చేసిన ఆడియెన్స్‌కి థాంక్స్ఞ అని అన్నారు. నటుడు శరవణన్ మాట్లాడుతూ, తమిళంలో ఈ సట్టముం నీతియుం సిరీస్ బ్లాక్ బస్టర్ అయింది. తెలుగులోనూ అంతే రెస్పాన్స్ వస్తోంది. ఈ సిరీస్‌ను సక్సెస్ చేసిన ఆడియెన్స్‌కు థాంక్స్ అని అన్నారు. ప్రభాకరన్ మాట్లాడుతూ, 'సట్టముం నీతియుం్ఞసిరీస్‌ను ఆడియెన్స్ బ్లాక్ బస్టర్ చేశారు. మమ్మల్ని నమ్మిన జీ5 టీంకు థాంక్స్. బాలాజీ సెల్వరాజ్ ఈ సిరీస్‌ను అతి తక్కువ రోజుల్లో పూర్తి చేశారు. ఏజీఆర్ సర్‌కి ఫస్ట్ ప్రివ్యూ వేసి చూపించాం. అందరూ సిరీస్‌ను ఆదరిస్తున్నారు. తెలుగులో మా సిరీస్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ సిరీస్‌ను సక్సెస్ చేసిన అందరికీ థాంక్స్ అని అన్నారు.

# హిస్టారికల్ డ్రామా 'డేవిడ్‌రెడ్డి'



**మంచు మనోజ్,** హనుమ రెడ్డి యక్కంటి, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ పవర్ ఫుల్‌హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి ఞ డైనమిక్ పోస్టర్‌తో అనౌన్స్‌మెంట్ రాకింగ్ స్టార్ మనోజ్‌మంచు తన పాత్రలను, స్క్రిప్ట్ లను సెలెక్టివ్‌గా జాగ్రత్త గా ఎంచు కుంటున్నారు. తన తాజాప్రాజెక్ట్‌హిస్టారికల్ యాక్షన్ డ్రామా. హనుమ రెడ్డి యక్క ంటి దర్శకత్వం వహించగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మోతుకూరి భరత్, నల్లగంగుళ వెంకట్ రెడ్డి నిర్మిస్తు న్నారు. హిస్టరీ, రెబెలియన్‌తో కూడిన ఈ చిత్రం తెలుగు సినిమాకి ఓ మైల్ స్టోన్ కానుంది. డేవిడ్ రెడ్డి అనే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమా కథ 1897 నుంచి 1922 వరకూ నడుస్తుంది. ఈ స్టోరీలో మనోజ్ ఎన్నడూ చూడని పవర్ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు. కుల వ్యవస్థ ఒత్తిడుల నుంచి తిరగబడి, బ్రిటిష్ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసిన ఓ రెబల్ కథ ఇది. కథ రా, గ్రౌండెడ్, ఎమోషనల్ మాస్ టచ్ తో జనం గుండెల్లో నిలిచిపోయేలా వుంటుంది. 21 సంవత్సరాల క్రితం, ఇదే రోజున మంచు మనోజ్ దొంగ దొంగదితో అరంగేట్రం చేశారు. ఇప్పుడు, సరిగ్గా రెండు దశాబ్దాల తర్వాత, తన న్యూ బ్లాస్టింగ్ వెంచర్ డేవిడ్ రెడ్డిని ప్రకటించడం విశేషం. సినిమా ప్రేమికులకి ఇది మరిచిపోలేని మెమొరబుల్ మూమెంట్. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్‌లో ఉన్న ఈ సినిమా టైటిల్ పోస్టర్ ఒక బోల్డ్ స్టేట్‌మెంట్ ఇస్తుంది. తెరపై చూపించే విప్లవానికి టోన్‌ను సెట్ చేస్తుంది. టైటిల్ డిజైన్‌ని మనోజ్ ఫేస్‌లోకి మార్చడం చాలా క్రియేటివ్‌గా వుంది. "మద్రాస్ ప్రెసిడెన్సీ లో పుట్టాడు, ఢిల్లీలో పెరిగాడు, ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వణికిస్తున్నాడ్ఞు! అనే ట్యాగ్‌లైన్ కట్టిపడేసింది. విజువల్‌గా అద్భుతమైన పోస్టర్ సినిమా ఎంత పవర్ ఫుల్ గా వుంటుందో తెలియజేస్తోందన్నారు

# 'పరదా' బ్యూటిఫుల్ జర్నీ సాంగ్ రిలీజ్



**అనుపమపరమేశ్వరన్,** దర్శన రాజేంద్రన్, సంగీత, ప్రవీణ్ కాండ్రేగుల, విజయ్ దొంకడ, ఆనంద మీడియా 'పరదా' నుంచి బ్యూటీఫుల్ జర్నీ సాంగ్ ఎగరేయ్ నీ రెక్కలే రిలీజ్‌సినిమా బండి ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల 'పరదా' అనే మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ తో వస్తున్నారు. 'ది ఫ్యామిలీ మ్యాన్ఞ్ సిరీస్ మేకర్స్ రాజ్, డికె మద్దతుఇస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా, దర్శన రాజేంద్రన్‌తో పాటు, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ దొంకడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్, టీజర్, సాంగ్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు మేకర్స్ థర్డ్ సింగిల్ ఎగరేయ్ నీ రెక్కలే పాటని రిలీజ్ చేశారు. ఎగరేయ్ నీ రెక్కలే బ్యూటీఫుల్ జర్నీ సాంగ్.


స్టార్ కంపోజర్ గోపీ సుందర్ మనసు హత్తుకునేలా అద్భుతంగా కంపోజ్ చేశారు. వనమాలి రాసిన లిరిక్స్ మీనింగ్ ఫుల్‌గా వున్నాయి.

రితేష్ జిరావు తన వోకల్స్‌తోమెస్మరైజ్ చేశారు. అనుపమ పరమేశ్వరన్, దర్శన రాజేంద్రన్, సంగీత జర్నీ ఎమోషనల్ అండ్ హార్ట్ టచ్చింగ్‌గా వుంది. అద్భుతమైన లోకేషన్స్‌తో చిత్రీకరించిన ఈ సాంగ్ విజువల్‌గా చాలా గ్రాండ్ గా వుంది. ఈ సాంగ్ ఇన్స్టంట్‌గా హిట్ అయ్యింది. ఈ చిత్రంలో రాగ్ మయూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకి మృదుల్ సుజిత్ సేన్ సినిమాటోగ్రాఫర్‌గా, ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 'పరదా' ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది.

తారాగణం: అనుపమ పరమేశ్వరన్, దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్‌సాంకేతిక సిబ్బంది:బ్యానర్: ఆనంద మీడియాదర్శకత్వం: ప్రవీణ్ కాండ్రేగుల, నిర్మాతలు: విజయ్ దొంకాడ, శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రోహిత్ కొప్పు, సంగీతం: గోపీ సుందర్, సాహిత్యం: వనమాలి, రచయితలు: పూజిత శ్రీకాంతి, ప్రహాస్ బొప్పూడి, స్క్రిప్ట్: డాక్టర్ కృష్ణ, ప్రత్యూష, డీవోపీ: మృదుల్ సుజిత్ సేన్, ఎడిటర్: ధర్మేంద్ర కాకరాల, సౌండ్ డిజైన్: వరుణ్ వేణుగోపాల్, ఆర్ట్ డైరెక్టర్: శ్రీనివాస్ కళింగ, కాస్ట్యూమ్ డిజైనర్: పూజిత తాడికొండపీఆర్వో: వంశీశేఖర్, పబ్లిసిటీ డిజైన్స్: అనిల్ భాను.

# 'ధూమ్3' మ్యూజిక్ స్ట్రాటజీ వాడుతున్న ఆదిత్య చోప్రా





**ప్రీ రిలీజ్ గ్లింప్స్‌తో** వెండి తెరపై హృతిక్, ఎన్టీఆర్ డాన్సింగ్ మ్యాజిక్ హైప్‌ను మరింతగా పెంచే ఆలోచనలో మేకర్స్. ఆదిత్య చోప్రా గత ముప్పై ఏళ్లుగా ఇండియన్ ఇండస్ట్రీలో వైవిధ్యమైన, విప్లవాత్మకమైన ఆలోచనలతో కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తూ ఎన్నో భారీ చిత్రాలను అందించారు. తాజాగా 'వార్ 2ఞకోసం ఆయన తన కజ్రా రే, ధూమ్ 3 రేంజ్‌లో మ్యూజికల్ స్ట్రాటజీని ఫాలో అవ్వాలని ఫిక్స్ అయ్యారు. యశ్‌రాజ్ ఫిల్ నిర్మించిన 'వార్ 2'లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ యాక్షన్, డ్యాన్ చూసేందుకు ఆడియెన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 14 ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అభిమానులు, సినీ లవర్స్ అంతా ఆసక్తితో వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలో యశ్ రాజ్ ఫిల్మ్ఞ్ వార్ 2 నుంచి హృతిక్, ఎన్టీఆర్ డాన్సింగ్ సాంగ్‌కు సంబంధించిన గ్లింప్స్‌ను ఈ వారంలో విడుదల చేస్తున్నారు. ఇలా గ్లింప్స్‌ను విడుదల చేయటానికి గల కారణం. ఇద్దరు మేటి డాన్సర్ చేసే డాన్సింగ్ మ్యాజిక్‌ను సిల్వర్ స్క్రీన్‌పై చూసి ఓ అనిర్వచనీయమైన అనుభూతిని పొందాలనేదే ఆలోచన. ఈ ఏడాదిలోనే అత్యంత భారీ హైప్ వచ్చిన, క్రేజ్ దక్కిన చిత్రంగా 'వార్ 2ఞ నిలిచింది. 'వార్ 2ఞనుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ అందరినీ అలరిస్తూనే ఉంది. ప్రస్తుతం అందరి దృష్టి ఎన్టీఆర్, హృతిక్ డ్యాన్స్ నంబర్ పైనే ఉంది. ఈ విషయం నిర్మాత ఆదిత్య చోప్రాకు తెలుసు. విడుదల వరకు ఈ పాటకోసం హైప్‌ను పెంచేలా మేకర్లు ప్లానింగ్ చేస్తున్నారు. 'వార్ 2ఞని బిగ్ స్క్రీన్‌లో చూసినప్పుడు, ఒకేసారి ఎన్టీఆర్, హృతిక్ కలిసి డ్యాన్స్ చేసే ఘట్టాన్ని చూసి ఎక్స్ పీరియెన్స్ చేయాలని దర్శక, నిర్మాతలు భావిస్తున్నారు అని ట్రేడ్ వర్గాలు చెబ ుతున్నాయి. "ఇది క్లాసిక్ ఆదిత్య చోప్రా గొప్ప స్ట్రాటజీ. ఇప్పటి వరకు 'బంటీ ఔర్ బబ్లీ, కజ్రా రే వంటి పాటలను నేరుగా తెరపైనే చూపించారు. పైగా 'ధూమ్ఞ్ పాటలన్నీ నేరుగా సిల్వర్ స్క్రీన్‌పైనే చూపించారు. =. ఇప్పుడు ఆడియెన్స్‌ను ఎన్టీఆర్‌హృతిక్ డ్యాన్స్ సాంగ్‌ను కూడా యూట్యూబ్‌లో రిలీజ్ చేయకుండా నేరుగా థియేటర్లో చూసి ఆడియెన్స్ ఎక్స్‌పీరియెన్స్‌్మ చేయాలనేది ఆదిత్య చోప్రా ప్లాన్.



బుధవారం యూరియ కోసం బారులు తీరిన రైతులు

# దుబ్బాకలో యూరియా తిప్పలు

**దుబ్బాక, ఆగస్టు 6, ప్రభాతవార్త :** యూరియ కోసం రైతులు గత మూడురోజులుగా పడిగాపు కాస్తున్న యూరియ అందడంలో జ్యాపం జరుగుతోంది. వర్ష కాలంలో రైతులు అధిక మొత్తంలో వరి, అలాగే మొక్కజోన్న, పత్తిసాగు కోసం యూరియ అధికంగా అవసరంఉండగా తగినంతగా యూరియ రైతులకు అందుబాటులో లేకపోయింది. దుబ్బాక మండల పరిధిలోని వ్యవసాయ సహకార సంఘంకార్యాలయం ఎదుట బుధవారం రైతులు యూరియ కోసం ఉదయం నుండి రాత్రి వరకు బారులు తీరారు. ప్రతి రోజు కేవలం 556 బస్తాల యూరియ మాత్రమే దుబ్బాకకు దిగుమతి అవుతోంది కాని ఇది రైతులకు సరిపోవడం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.



## వైఆర్‌పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

**హైదరాబాద్,ఆగస్టు 6 ప్రభాతవార్త:** వైఆర్‌పి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు,ఛైర్మన్ ఎలిశాల రవిప్రసాద్ బుధవారం మాధాపూర్‌లోని వైష్ణవి గ్రూప్ కార్పొరేట్ కార్యాలయంలోజరిగిన ఒక కార్యక్రమంలో రూ.9లక్షల విలువైన స్కాలర్‌షిప్‌ను 40మంది విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్కాలర్‌షిప్‌ను పొందిన వారిలో ఎంబిబిఎస్, ఇంజనీరింగ్, స్కూల్, ప్రాథమిక విద్యను అభ్యసించేవారు ఉన్నారు. విద్యా, ప్రతిభ.ఆర్థికస్థితి ఆధారంగా చేసుకుని ఎంపిక చేసి విద్యార్థులకు అందచేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇంత వరకు వైఆర్‌పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాతోపాటు ఇతర రాష్ట్రాల్లో 350 విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లను అందచేసినట్లు తెలిపారు. తమ సంస్థద్వారా ఆర్ధిక సాయం అందుకున్నవారిలో డాక్టర్లు, ఇంజనీర్లు, పోలీసు అధికారులు,ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు తెలిపారు. విద్యే సమాజాన్ని మార్చగలల శక్తివంతమైన సాధనమని, మీకు మేకు ఇచ్చే సహాయాన్ని మీరు భవిష్యత్తులో మరొకరికి అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానవ హక్కుల సంఘం ఛైర్మన్,జస్టీస్ షమీమ్ అక్తర్, రిటైర్డ్ ఐఎఎస్ ఎం. జగదీశ్వర్‌లు సంస్థ చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు.



బుధవారం జయశంకర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మన్ సుఖేందర్‌రెడ్డి తదితరులు

## జయశంకర్ చిత్రపటానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మన్ సుఖేందర్‌రెడ్డి నివాళి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు6:** తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధే ఆశయంగా, శ్వాసగా యావజ్జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి జయశంకర్ అని పేర్కొన్నారు. మండలి ఛైర్మన్ మాట్లాడుతూ " తెలంగాణ రాష్ట్ర సాధనే శ్వాసగా జీవించిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే త్యాగం చేసారని వివరించారు. మన నీళ్ల మనకు, మన ఉద్యోగాలు మనకు అని గర్జించిన ధీశాలి ఆయన అని తెలిపారు. తెలంగాణ ఆవశ్యకతను యువతకు అర్థం అయ్యేలారచనలు చేసి, రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిగా నిలిచారని చెప్పారు. జయశంకర్ జీవితం నేటి యువతకు ఆదర్శమని గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వారి సేవలను గుర్తించి, వారి పేరుని భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ యూనివర్సిటికీ పెట్టి గౌరవించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ అధికారులు, ఉద్యోగులు, ఛైర్మన్‌పేషీ అధికారులు పాల్గొన్నారు.

## దోస్త్‌లో స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తి

**హైదరాబాద్,ఆగస్టు 6 ప్రభాతవార్త:** తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి దోస్త్ 2025-26 స్పెషల్ కేటాయింపు పూర్తయ్యిందని, మొత్తం 54,048 మంది విద్యార్థులు సీట్లు పొందినట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైరనమన్, కాలేజ్ విద్యాశాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మొత్తం సీట్లు పోందిన అభ్యర్థుల సంఖ్య 54,048కాగా మొదటి ప్రాధాన్య తలతో సీట్లు పొందిన వారు44,889 మంది సీట్లు పొందినట్లు చెప్పారు. రెండో ప్రాధాన్యత లేదా ఇతర ప్రాధాన్యలతో సీట్లు పొందిన వారు 9159 మంది, తక్కువ వెబ్ ఆప్షన్ ఇవ్వడంతో సీట్లు లభించని అభ్యర్థులు 3290 మంది ఉన్నట్లు తెలిపారు. స్పెషల్ ఫేజ్‌లో వెబ్ ఆప్షన్లు ఇచ్చిన అభ్యర్థుల సంఖ్య మొత్తం 57,338 మంది ఉన్నట్లు తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 8న ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం లేదా విశ్వవిద్యాలయ కళాశాలల్లో సీట్లుపొందిన వారు ఈ పాస్ ఫీజు రీయంబర్స్ మెంట్ అర్హత ఉన్నవారు రూ,500 లేదా 1000చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన వారికి ఓటీపీ ఆధారంగా పూర్తి స్థాయి ధృవీకరణ జరుగుతుందని ఈ నెల 8లోగా తప్పనిసరిగా రిపోర్టు చేయక పోతే వారికి కేటాయించిన సీట్లు రద్దు అవుతాయన్నారు. కామర్స్‌లో 22,328, ఫిజికల్ సైన్సెస్‌లో 12,211,లైఫ్ సెన్సెస్‌లో 10,435, ఆర్ట్స్‌లో 8979, ఇతర కోర్సుల్లో 95 మంది సీట్లు పొందినట్లు చెప్పారు.

## బీహార్‌లో ఓట్లను తొలగించే కుట్రపన్నుతోన్న బిజెపి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**హైదరాబాద్,ఆగస్టు 6,ప్రభాతవార్త:** బీహార్ రాష్ట్రంలో జరుగబోతున్న ఎన్నికల్లో తనకు వ్యతిరే కంగా వున్న ఓట్లను తొలగించి, అక్రమ పద్ధతుల్లో అధికారంలోకి రావాలని బిజెపి కుట్రపన్నుతోందని సీపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు.బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీహార్‌లో సుమారు 64 లక్షల ఓట్లను ఎన్నికల కమిషన్ తొలగించిందని,. ఇందులో అత్యధికంగా మైనారిటీలు, ప్రతిపక్షాలకు సంబంధించిన ఓట్లే ఉన్నాయని, బీజెపికి వ్యతిరేకంగా ఓట్లేస్తారని భావించి తొలగించిందన్నారు.ఎస్సీ నియోజకవర్గాలలో 40నుండి 60 శాతం ఓట్లను తీసేసిందన్న ఆయన ఎన్నికల కమిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అండదండలతో బిజెపి ఆ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కుట్రపన్నుతోందని ఆయన ఆరోపించారు.దీన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ(ఎం) పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆగస్టు 8న తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సిపిఐ(ఎం) పార్టీ పిలుపునిస్తోందని,ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రెండు చోట్ల 14.4కేజీల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్,ఆగస్టు6 ప్రభాతవార్త :** ఇంటర్ మీడియట్ చదువుతూ హోటల్లో వెయిటర్‌గా పనిచేస్తూ గంజాయి సరఫరా చేస్తున్న సునీల్ నాయక్(20) ఎక్సైజ్ సిబ్బంది పట్టుకుని అతని వద్ద నుంచి 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఒరిస్సా నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి సరఫరా జరుగుతుందన్న సమాచారం మేరకు నిఘాపెట్టిన అధికా రులు సికింద్రాబాద్ వేస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో సునీల్‌ను తనిఖీ చేయగా అతని వద్ద గంజాయి లభించింది. దాని విలువ రూ.7 లక్షల ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

మరో కేసులో సికింద్రాబాద్ క్లాక్‌టవర్‌వద్ద జుర్రు ప్రవీణ్ అనే వ్యక్తి వద్ద నుంచి 400 గ్రాముల గంజాయిని డిటిఎఫ్ సీఐ సౌజన్య టీం పట్టుకున్నారు.

# జాతీయ చేనేత దినోత్సవం నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు

## 33మంది నేత కార్మికులు,డిజైనర్లు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు ఎంపిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు6:** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 33 మంది నేత కార్మికులు, డిజై నర్లకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి పలు కార్యక్రమాలను అమలు చేసింది. అన్ని శాఖలు, కార్పొరేషన్లు, సంస్థలు టిజిఎస్‌సిఓ ద్వారా వస్త్రాలు కొనుగోలు చేయాలనే ఆదేశాలు జారీ చేసింది. 2025-26లో ఇప్పటివరకు రూ.587.26 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చింది. ఇందిరా మహిళ శక్తి స్వయం సహాయక బృందాలకు ఏడాదికి రెండు సార్లు ఉచితంగా చీరల పంపిణీ. 65 లక్షల మంది మహిళలకు పంపిణీ చేసేందుకు 131 మ్యాక్స్, 56 చిన్నతరహా పరిశ్రమలలో చీరలు తయారు చేయిస్తున్నారు. రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో గత ఏడాది టిజిఎస్‌సీఓ నోడల్ ఏజెన్సీగా వేములవాడలో యార్న్ డిపోను ఏర్పాటు చేసింది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ని హైదరాబాద్‌లో నెలకొల్పింది. చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు రుణ మాఫీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. ఈ పథకానికి రూ.33 కోట్లు మంజూరు చేసింది. తెలంగాణ చెనేత అభయహస్తం (నేతన్న పొదుపు- థ్రిఫ్ట్ ఫండ్)లో భాగంగా కార్మికులు తమ జీతం నుండి 8శాతం పొదుపు చేస్తే, ప్రభుత్వం వారి జీతానికి డబుల్ మద్దతుగా ఇస్తుంది. ఈ పథకంతో దాదాపు 36,133 మంది కార్మికులు లబ్ధి పొందుతున్నారు. పవర్‌లూమ్ కార్మికుల థ్రిఫ్ట్ ఫండ్ పథకంలో దాదాపు 15 వేల మంది లబ్ధిపొందుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్లో ఈ పథకానికి రూ.30 కోట్లు కేటాయించారు. తెలంగాణ నేతన్న భద్రత పథకం కింద చనిపోయిన చేనేత, అనుబంధ కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేస్తుంది. తెలంగాణ నేతన్నకు భరోసా పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేస్తోంది. కార్మికులకు ప్రోత్సాహకంగా సంవత్సరానికి రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.6వేలు అందిస్తుంది. ఈ ఏడాది రూ.12.20 కోట్ల పరిపాలనా అనుమతి కూడా ఇచ్చింది. **కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికైన వారి జాబితా:** కరీంనగర్- తుమ్మ రామస్వామి,కరీంనగర్- గుర్రం కొండయ్య, మంచిర్యాల-లిక్కి శంకరయ్య, వరంగల్-కంచె నర్సింగరావు,జనగాం-న్యాలపల్లి విజయ ప్రకాశ్, రాజన్న సిరిసిల్ల- ఎల్దీరేఖ, రంగారెడ్డి-గంజం శ్రీనివాస్, రంగారెడ్డి- గుర్రం చంద్రమోళి,హైదరాబాద్-కర్నాసు రమేశ్,సిద్దిపేట-జిందం రాజేషం, సిద్దిపేట-బైరి శ్రీనివాస్,సిద్దిపేట-మంతూరి వెంకటేశం,యాదాద్రి భువనగిరి-గూడ పవన్,యాదాద్రి భువనగిరి-కొలను శంకర్,యాదాద్రి భువనగిరి-సామల భాస్కర్, యాదాద్రి భువనగిరి-మంగళపల్లి శ్రీహరి,యాదాద్రి భువనగిరి-చెలిమల కృష్ణ, నల్గొండ-కర్నాటి సదుర్గ,నల్గొండ- చిలుకూరి శ్రీనివాసులు,నల్గొండ-చిట్టిపోలు ధనుంజయ,నల్గొండ-గాజుల అనిల్,నల్గొండ-గుర్రం యాదయ్య,నల్గొండ-మునగపాటి శ్రీనివాస్, నల్గొండ కర్నాటి కృష్ణయ్య, నల్గొండ-అవరి రవీంద్ర, నారాయణపేట- జన్ను ఆంజనేయులు, నారాయణపేట-యాంగల్ ఆంజనేయులు,జోగులాంబ గద్వాల్-సూర్య వెంకటేష్,జోగులాంబ గద్వాల్-లక్ష్మీ,వనపర్తి-దేవరకొండ సీతన్న,వనపర్తి-శీలబుడ్డన్న, వనపర్తి-మహంకాళి సులోచన,వనపర్తి-సారంగి రాములు ఉన్నారు.

### రాజీవ్‌స్వగృహా ప్లాట్లకు భారీ స్పందన

## ప్రభుత్వానికి రూ.100కోట్ల ఆదాయం

**హైదరాబాద్,ఆగస్టు 6 ప్రభాతవార్త:** సొంత ఇల్లు అనేది ప్రతీ ఒక్కరి కల. దీనిని నెరవేర్చుకోవడానికి చాలా మంది తమ సంపాదనలో సేవింగ్స్ చేసుకొని ప్లాట్ లేదా ఇండిపెండెంట్ హౌస్‌లను కొనుగోలు చేస్తుంటారు. అయితే ప్రభుత్వం కొన్ని ప్లాట్లను తక్కువ ధరలకు వేలం వేసి విక్రయిస్తున్నారు. దీనిలో భాగంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని రాజీవ్ స్వగృహ ప్లాట్లకు వేలం వేయగా దాదాపు రూ.100 కోట్ల వరకు ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని బహదూర్‌పల్లిలో ఉన్న రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలానికి అనూహ్యమైన స్పందన లభించింది. ఈ విషయాన్ని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం వెల్లడించారు. మంగళవారం జరిగిన బహిరంగ వేలంపాటలో మొత్తం 68 ప్లాట్లకు గాను.. తొలి రోజు 50 ప్లాట్లకు వేలం నిర్వహించారు. రాత్రి 8 గంటల వరకు జరిగిన ఈ వేలంపాటలో గరిష్టంగా చదరపు గజం ధర రూ. 46,500 పలికినట్లు గౌతం తెలిపారు. వేలం నిర్వహించిన 50 ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ. 100 కోట్ల మేర ఆదాయం వచ్చిందని మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం తెలిపారు.సుమారు 119 మంది ఈ ప్లాట్లను కొనుగోలు చేయడానికి పోటీ పడ్డారు. సగటున ప్రతీ ఒక్క ప్లాట్‌కు 30 మందికి పైగా పోటీ పడ్డారంటే.. వీటికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతే కాకుండా.. ఈ ప్లాట్లు ఔటర్ రింగ్ రోడ్డుకు(ఓఆర్ఆర్) అతి సమీపంలో ఉండటం కూడా ఈ భారీ డిమాండ్‌కు ఒక కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న నిపుణులు చెబుతున్నారు. వేలంలో విక్రయించబడని ఈ ప్లాట్లు 200 నుంచి 1000 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి.వీటిలో కార్నర్ ప్లాట్‌కు రూ. 30,000.. మిడిల్, ఇతర ప్లాట్లకు రూ. 27,000 కనీస ధరగా నిర్ణయించారు.ఈ వేలంలో కార్నర్ ప్లాట్లకు అత్యధిక ధర పలకడం విశేషం.



## ఏసిబికి చిక్కిన జగిత్యాల జిల్లా ఆర్టీఓ

### రూ.22వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

**జగిత్యాల రూరల్, ప్రభాతవార్త:** జగిత్యాల మండలం రూరల్ తాటిపల్లి లో గల ఆర్టిఓ కార్యాలయంలో బుధవారం రోజున ఆర్టీఏ అధికారి బద్రు నాయక్ తన వ్యక్తిగత డ్రైవర్ ద్వారా ఒక వ్యక్తి నుంచి రూ. 22,000 రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు వివరాలు ఇలా ఉన్నాయి కోరుట్లకు చెందిన శశిధర్ అనే వ్యక్తి జెసిబి కి సరైన పత్రాలు లేవని డిటిఓ వెహికల్ ని సీజ్ చేయడంతో పాటు బాధితుడు ఫోన్ కూడా తీసుకున్నారు వెహికల్ పై ఎలాంటి కేసు కాకుండా ఫోన్ తిరిగి ఇవ్వడానికి 40,000 లంచం డిమాండ్ చేయగా 35వేల రూపాయలకు బేరం కుదుర్చుకున్నారు ఇందుకుగాను 2025 ఆగష్టు 4వ తేదీన 13 వేల రూపాయలను చెల్లించగా మిగతా 22వేల రూపాయలను బాధితుడు ఆగష్టు 6వ తేదీ బుధవారం రోజున ఆర్టీఏ అధికారి తన వ్యక్తిగత డ్రైవర్ ద్వారా లంచం తీసుకుంటుండగా పక్కా సమాచారంతో అవినీతి నిరోధకశాఖ ఏసీబీ అధికారులు కార్యాలయం ముట్టడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా సాక్షాదారాలతో బద్రు నాయక్‌ను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బద్రునాయక్ పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఏసీబీ డి.ఎస్.పి విజయ్ కుమార్ తెలిపారు ఈ సంఘటనతో జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో ఉద్రిక్తత నెలకొంది.

## ముస్లిం రిజర్వేషన్లను తీసేసి స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

### కాంగ్రెస్ వైఫల్యాలన్నీ బిజెపిపై నెట్టే ప్రయత్నం: ఎన్.రాంచందర్ రావు

**గోదావరిఖని, ప్రభాతవార్త:** బీసీలపై కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, 42శాతం బీసీ రిజర్వేషన్లలో 10 శాతం ముస్లిం రిజర్వేషన్లను తీసేసి, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. గోదావరిఖనిలోని బల్మూరి అమరేందర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢల్లీలో బీసీ రిజర్వేషన్ల విషయంలో ధర్నా చేపట్టారని, కామారెడ్డిలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఢల్లీకి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సమయంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యని పిలిచారని, మరి కర్ణాటక రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పరిస్థితి గురించి రేవంత్ రెడ్డి సిద్ధరామయ్యని అడగాలని అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ నాయకులు పదేపదే బీజేపీపై అభాండాలు వేస్తూ, తమ వైఫల్యాలన్నీ బీజేపీపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు 42 శాతం బీసీ రిజర్వేషన్లపై బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు బీజేపీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు భేషరతుగా మద్దతు తెలిపారని, ఆ తర్వాత బిల్లు పాస్ అయి 6 నెలలు గడిచిందని, అంతకంటే ముందు స్థానిక సంస్థల, పంచాయతీల గడువు తీరి ఏడాది గడిచిపోయిందని, అయినా స్థానిక ఎన్నికలు నిర్వహించడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీ రిజర్వేషన్లలో 10 శాతం ముస్లిం రిజర్వేషన్లు ఇస్తామని ప్రయత్నం చేస్తోందని, దీంతో అస్కలెన బీసీలకు 42 నుంచి 32 శాతానికి పడిపోనున్నాయని అన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటోందని, కానీ ఆ 42 శాతాల్లో 10 శాతం ముస్లింలను చేర్చి, బీసీ జాబితాలోకి మతపరమైన రిజర్వేషన్లను చొప్పించడం ద్వారా అస్కలెన బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు. గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం 4 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు ఇచ్చి, బీసీ రిజర్వేషన్లను కుదించిందని, దీనిపై కేసు ఇంకా కోర్టులో పెండిరగ్‌లో ఉందని అన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం 10 శాతం రాజకీయ ముస్లిం రిజర్వేషన్లు పెంచి బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లు రానివ్వకుండా కుట్ర చేస్తోంది. గతంలో హెచ్ఎంసిలో 50 బీసీ రిజర్వ్ డివిజన్లలో 35 పైగా సీటు ఎంఐఎం పార్టీ గెలిచిందని, దీంతో అస్కలెన బీసీలకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోమల్ల మహేష్, బిజెపి రాష్ట్ర నాయకులు గోమాస శ్రీనివాస్, ధర్మపురి, జక్కుల నరహరి తదితరులున్నారు.



బుధవారం గోదావరిఖనిలో మీడియాతో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

## డిజిపి అర్థ వార్షిక క్రైం రివ్యూ మీటింగ్

### పలు అంశాలపై ప్రశంసలు, మరికొన్నింటిపై కీలక సూచనలు

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** డిజిపి జితేందర్ బుధవారం నాడు అర్థ వార్షిక క్రైం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, పర్సనల్ విభాగం అదనపు డిజి అనిల్ కుమార్, సిఐడి చీఫ్ చారు సిన్హా,రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల కొత్వాళ్లు సుధీర్‌బాబు, అవినాష్ మొహంతి, పి అండ్ ఎల్ ఐజి రమేష్, ఐజి చంద్రశేఖర్ రెడ్డితో పాటు డిఐజి తఫ్సీర్ ఇక్బాల్ అన్ని రేంజిల డిఐజిలు, జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా డిజిపి గడచిన ఆరు నెలల కాలంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులతో పాటు నేరాల నివారణకు పోలీసులు తీసుకున్న చర్యలను ప్రశంసించారు. శాంతి భద్రతలు సవ్యంగా వుండడంతో పా టు అనేక కేటగిరిల్లో నేరాల తగ్గుదల వుందని డిజిపి తెలిపారు. ప్రతీ జిల్లాలో నేరాల విష యంలో తీసుకోవాల్సిన చర్యల గురించి డిజిపి వివరిం చారు. దీంతో పాటు సైబర్ నేరాల కట్టడికి, ఆర్థిక నేరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను కూడా డిజిపి వివరించారు, విజిబుల్ పోలీసింగ్ వల్ల చాలా వరకు నేరాలను నివారించవచ్చని ఆయన తెలిపారు. ప్రజల భద్రతకు మరింత కష్టపడి పనిచేయాలని, మహిళల భద్రతకు పెద్ద పీట వేయాల ని, మనుషుల అక్రమ రవాణాను నిరోధించా లని, షీ బృందాలు, భరోసా కేంద్రాలు పటిష్టంగా వుంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించ వచ్చని డిజిపి తెలిపారు. సమవేశం చివరి దశలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ సైబర్ నేరాలకు తమ విభాగం తీసుకుంటున్న చర్యలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సైబర్ నేరాల వల్ల అమాయకులు మోసపోతున్న తీరు, వీటిని ఎలా అరికట్టవచ్చు అనే దాని పై ఆమె పోలీసు అధికారులకు వివరించారు.

## ఇందిరమ్మ పాలన కాదు..బకాయిల పాలన: ఎమ్మెల్సీ అంజిరెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో నడిచేది ఇందిరమ్మ పాలనకాదని, బకాయల పాలన అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. బుధవారంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు, కౌన్సిలర్లు తమ ఊరు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు కాంట్రాక్టులు చేశారన్నారు. ప్రస్తుతం సుమారు రూ.600 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఈ రూ.600 కోట్లు తక్షణమే, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలో 54,000 మంది మధ్యాహ్న భోజనం వండే మహిళలకు నెలకు కేవలం రూ.3,000 మాత్రమే ఇస్తున్నారు. ఆ మొత్తం కూడా ఇప్పటివరకు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు మధ్యాహ్న భోజనం వండే మహిళలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.3,000 స్థానంలో కాంగ్రెస్ నెలకు రూ.5,000 ఇస్తుందని హామీ ఇచ్చారని, కాంగ్రెస్ గెలిచిన తర్వాత ఇప్పటివరకు రూ.5,000 ఇవ్వడం కాదు కదా నెలకు రూ.3,000 కూడా గత ఏడు నెలలుగా చెల్లించలేకపోతున్నారు. ఈ మొత్తాన్ని తక్షణం విడుదల చేయాలన్నారు.

## బిసిని సిఎం చేయాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు లేదు

### కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి


### ఆదిలాబాద్ శాసనసభ్యుడు పాయల్ శంకర్



**హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ ఎలాంటి దుష్ప్రచారం చేసుకుంటుందో రాష్ట్రంలోని బిసిలు అన్నీ గమనిస్తున్నారని ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ పేర్కొన్నారు. బుధవారం బిజెపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం లేదన్నారు ఈ విషయాన్ని శాసనసభలో బిల్లు పెట్టిన సందర్భంలోనే మేము స్పష్టంగా చెప్పామని, బిసి రిజర్వేషన్ల బిల్లు పెట్టినట్టే పెట్టి, ముస్లింలను బిసి రిజర్వేషన్లలో చేర్చి, ఆ బిల్లును సమర్థించకుండా తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. ఇక్కడ బిల్లు పెడతారు, భవిష్యత్తులో ఢిల్లీలో ధర్నా చేస్తారు అని అప్పుడే చెప్పానని అన్నారు. మేము చెప్పినదే ఈరోజు కాంగ్రెస్ చేస్తున్న నాటకాల రూపంలో నిజమవుతుందని, శాసనసభలో ముస్లింలు లేనట్లుగా 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు ఇస్తామా అనే ప్రశ్నకు ఇప్పటికీ కాంగ్రెస్ సమాధానం ఇవ్వలేదన్నారు. ముస్లింలకు 10 శాతం కట్టబెట్టాలన్న ఆలోచనతోనే నడుస్తుందని, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి, ఇప్పుడు 42 శాతం పేరుతో రిజర్వేషన్లు పెరిగినట్లు చెప్పి, అందులో 10 శాతం ముస్లింలకు కేటాయించడం వల్ల బిసిలకు మిగిలేది 32 శాతమే అన్నారు. అంటే 2014లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లు ఇప్పుడు 32 శాతానికి తగ్గుతున్నాయని, ఇది ఏ రకమైన వ్యవహారమో ఈరోజు రాష్ట్రంలో బిసిలు అర్థం చేసుకున్నారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో సంవత్సరానికి రూ.20,000 కోట్ల బిసి సబ్ ప్లాన్ నిధులు కేటాయిస్తామని చెప్పారు. రెండు బడ్జెట్లు పూర్తయ్యినా, నయాపైసా కూడా విడుదల కాలేదు. 50 ఏళ్లపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక బిసిని ప్రధాని చేయాలన్న ఆలోచన చేసిందా? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కసారి అయినా బిసిని ముఖ్యమంత్రిగా చేయాలన్న ఆలోచన కూడా చేయలేదు. నాలుగు ముఖ్యమంత్రులను మార్చినప్పుడు, ఒక్కసారి అయినా బిసికి అవకాశం ఇవ్వలేదన్నారు.

## రాష్ట్రంలో సులభతర వాణిజ్య విధానాల అమలు తీరుపై సిఎస్ సమీక్ష

**కేంద్ర కేబినెట్ కార్యదర్శి స్వయంగా పర్యవేక్షణ: కేంద్ర ప్రభుత్వ అధికారి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు6:** రాష్ట్రంలో సులభతర వాణిజ్య విధానాల అమలు తీరుపై బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో, రాష్ట్రంలో వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో వివిధ సంస్కరణల అమలు స్థితిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, నియంత్రణ ప్రక్రియలను సరళీకృతం చేయడం ద్వారా మరింత మెరుగుదలకు గణనీయమైన అవకాశం ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉపాధి అవకాశాలను సృష్టించడానికి ఈ ప్రయత్నాలు చాలా కీల కమని ఆయన అన్నారు. వివిధ సంస్కరణల అమలుపై కేంద్ర ప్రభుత్వం సూచించిన గడువును ఖచ్చితంగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారిణి, టాస్క్‌ఫోర్స్ సభ్యురాలు సుకృతి లిఖి సులభతర వాణిజ్యవిధానంలో అమలు జరుగుతున్న సంస్కరణలలో రాష్ట్ర పనితీరును ప్రశంసించారు, ఈ సమావేశంలో రవాణా, రోడ్లు, భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ఐటీఈ సీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్,హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, కార్మిక, ఉపాధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె.శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మరో రూ.5 వేల కోట్ల రుణం చేసిన సర్కార్

**హైదరాబాద్, అగస్టు 6, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ తాజాగా మరో రూ.5 వేల కోట్లు అప్పు తెచ్చింది. ఈ మేరకు ఈ మొత్తాన్ని ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టడం ద్వారా సేకరించింది. రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నిర్వహించిన ఈ వేలంలో పాల్గొని రాష్ట్ర ఆర్థికశాఖ ఈ 5 వేల కోట్లను సేకరించింది. సెక్యూరిటీ బాండ్లు పెట్టి ఇప్పుడు రూ.5 వేల కోట్లు తీసుకున్నట్టు రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ రుణంలో 19 ఏండ్లకు 7.19 శాతం వార్షిక వడ్డీతో రూ.1,000 కోట్లు, 22 ఏండ్లకు 7.21 శాతం వార్షిక వడ్డీతో మరో రూ.1,000 కోట్లు, 23 ఏండ్లకు 7.21 శాతం వార్షిక వడ్డీతో ఇంకో రూ.2 వేల కోట్లు, 24 ఏండ్లకు 7.19 శాతం వార్షిక వడ్డీతో రూ.1,000 కోట్లు తీసుకున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరు వరకూ తొలి త్రైమాసికంలో రూ.17,400 కోట్లు రుణ సమీకరణ చేసింది.తదుపరి జూలై నుండి సెప్టెంబరు వరకూ కలిగిన రెండో త్రైమాసికంలో రూ.12 వేల కోట్లు రుణం తీసుకుంటామని రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పంపింది. అయితే, ఈ క్వార్టర్‌లో ఒక్క జూలై నెలలోనే రూ.8.500కోట్లు సేకరించింది. ఇప్పుడు తొలివారంలోనే ఆర్బీఐనుంచి మరో రూ.5వేల కోట్లు రుణం సేకరించింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐదునెలలు కూడా గడవక ముందే రూ.30,900కోట్లు రుణ సమీకరణ చేసింది.

## జాతీయ హాకీ ఛాంపియన్‌షిప్‌లో సెమీస్‌కు
# యుపి, పంజాబ్, జార్ఖండ్, ఎంపి



**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా 15వ సబ్ జూనియర్ పురుషుల జాతీయ ఛాంపియన్‌షిప్-2025లో ఉత్తరప్రదేశ్, పంజాబ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. తొలి మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ హాకీ జట్టు దాద్రా నాగర్ హవేలి డామన్ డయ్యూ హాకీపై 4-1 తేడాతో విజయం సాధించింది. అలీ షారుఖ్ (6, 23) రెండు గోల్స్‌తో తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించగా, రాజ్‌భర్ ప్రహ్లాద్ (42) మరియు మొహమ్మద్ అతిఫ్ రేనీ (58) కూడా గోల్స్ సాధించారు. కెప్టెన్ ధీరజ్ పాల్ (39) దాద్రా డయ్యూ తరపున ఒక గోల్ చేశాడు. అత్యధిక స్కోరుతో కూడిన పోటీలో, హాకీ పంజాబ్ 4-3 తేడాతో ఒడిశా హాకీ అసోసియేషన్‌ను ఓడించి సెమీఫైనల్లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఒడిశా కెప్టెన్ మన్దీప్ కెర్కెట్టా (10, 27, 41) తన జట్టును ప్రారంభంలోనే ఆధిక్యంలోకి నెట్టి హ్యాట్రిక్ సాధించాడు. కెప్టెన్ అర్షదీప్ సింగ్ (14) పంజాబ్ తరపున స్కోరును ముందుగానే సమం చేయడంతో వరీందర్ సింగ్ (39), అనురాగ్ సింగ్ (42), సుఖ్‌దేవ్ సింగ్ (58) విజయాన్ని సాధించారు. జార్ఖండ్ జట్టు చండీగఢ్‌ను 13-0 తేడాతో ఓడించింది. హెమ్రోమ్ టింటస్ (18, 30, 44, 45, 60) ఐదు గోల్స్‌తో ఆధిక్యంలో నిలిచాడు, దీనికి సబియన్ కిరో హ్యాట్రిక్ (1, 22, 37), హాస్సా పాత్రస్ బ్రేస్ (5, 9) మద్దతు ఇచ్చాడు. గంగా టోప్పో (49), ఆశిష్ తని పూర్తి (53), మరియు అనిష్ డంగ్‌డుంగ్ (57) కూడా గోల్స్ సాధించారు. దీంతో ఛత్తీస్‌గఢ్, మణిపూర్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, పంజాబ్, హర్యానా హాకీ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి.




## బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# భారత్ మహిళా బాక్సర్లకు 9 పతకాలు

**న్యూఢిల్లీ:** అండర్ 19, ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత మహిళల బాక్సింగ్ బృందం పది వెయిట్ విభాగాలలో తొమ్మిదింటిలో పతకాలను ఖాయం చేసుకుంది. వీరిలో యక్షి క (51 కిలోలు), నిషా (54 కిలోలు), ముస్కాన్ (57 కిలోలు), విని (60 కిలోలు), నిషా (65 కిలోలు), ఆకాంక్ష ఫలస్వాల్ (70 కిలోలు), ఆర్తి కుమారి (75 కిలోలు) థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో బుధవారం జరిగిన బౌట్లలో ఘన విజయాలతో సెమీఫైనల్ బెర్తును ఖాయం చేసుకున్నారు. మరోవైపు, కృతికా వాసన్ (80 కిలోలు) మరియు ప్రాచి టోకాస్ (80+ కిలోలు) క్వార్టర్ ఫైనల్ బౌట్‌లలో బై పొందారు. అయితే, సుమన్ కుమారి (48 కిలోలు) ఉజ్బెకిస్తాన్‌కు చెందిన మఫ్తునా ముసుర్మోనోవా చేతిలో 2-3 తేడాతో చాలా దగ్గరగా తన క్వార్టర్ ఫైనల్ పోరులో ఓడిపోయింది. కానీ, యక్షి క తన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో మరో ఉజ్బెక్ ప్రత్యర్థి అలీవా ముక్తాసర్‌పై 3-2 తేడాతో మంచివిజయంతో భారత్ తరపున విజయాల పరంపరను ప్రారంభించింది. తరువాత, నిషా (54 కిలోలు) మరియు విని తమ కిర్గిజ్స్తాన్ ప్రత్యర్థులపై రెండు ఆధిపత్యంసాధించారు. దీంతోముస్కాన్ ఉజ్బెక్ బాక్సర్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో ఏకగ్రీవవిజయం సాధించి ఉదయం సెషన్‌ను ముగించింది.

## హండ్రెడ్ లీగ్‌లో
# ఇన్విన్సిబుల్ ఘన విజయం
### 6 వికెట్ల తేడాతో లండన్ ఓటమి
### వార్నర్, కేన్ విలియమ్సన్ దారుణ ప్రదర్శన

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ వేదికగా ప్రారంభమైన హండ్రెడ్ లీగ్ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో ఇన్విన్సిబుల్ ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఓవల్ ఇన్విన్సిబుల్స్, లండన్ స్పిరిట్ మధ్య పోటీ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఇన్విన్సిబుల్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన లండన్ స్పిరిట్, ఇన్విన్సిబుల్స్ బౌలర్లు రషీద్ ఖాన్ (20-15-11-3), సామ్ కర్రన్ (19-10-18-3), జోర్డన్ క్లార్క్ (10-6-8-2) చెలరేగడంతో 94 బంతుల్లో 80 పరుగులకే కుప్పకూలింది. బెహ్రెన్‌డార్ఫ్, నాథన్ సౌటర్ తలో ఒక వికెట్ తీశారు. ఇక లండన్ ఇన్నింగ్స్‌లో ఆస్టన్ టర్నర్ (21), ర్యాన్ హిగ్గిన్స్ (12), మ్యాడ్‌సన్ (10) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. అంతర్జాతీయ స్టార్లు డేవిడ్ వార్నర్ (9), కేన్ విలియమ్సన్ (9) దారుణంగా విఫలమయ్యారు.

అనంతరం 81 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇన్విన్సిబుల్స్ ఆడుతూ పాడుతూ విజయతీరాలకు చేరింది. విల్ జాక్స్ 24, సామ్ కర్రన్ 14 పరుగులు చేసి ఇన్విన్సిబుల్స్‌ను గెలిపించారు. ఈ జట్టు కేవలం 69 బంతుల్లోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. సామ్ బిల్లింగ్స్ 6, డొనొవన్ ఫెరియోరా 9 పరుగులతో అజేయంగా నిలిచారు.

లండన్ బౌలర్లలో డాసన్ 2 వికెట్లు, వార్రల్, టర్నల్ తలో వికెట్ తీశారు.



# విండీస్ సిరీస్‌కు స్టార్స్ ఔట్
### బుమ్రా టు నాయర్ డౌట్
## టీమిండియాలో ఛేజింగ్స్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ముగిసింది. ఇప్పుడు డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌లో టీమ్‌ఇండియా ఆడే తదుపరి సిరీస్‌పై పడింది. ఈ సైకిల్‌లో భారత్ తదుపరి స్వదేశంలో వెస్టిండీస్‌తో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ టెస్టు మ్యాచ్ అక్టోబర్ 2 నుండి 14 వరకు జరగనుంది. వెస్టిండీస్‌తో తలపడే శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో టీమిండియాలో కీలక మార్పులు చేసే దిశగా భారత్ క్రికెట్ బోర్డు సెలక్టర్లు కసరత్తు చేస్తున్నారు. దీంతో ఇంగ్లాండ్‌లో రాణించిన జట్టులో ఉన్న ఆటగాళ్లలో కొందరికి వెస్టిండీస్ టెస్టులో చోటు దక్కకపోవచ్చు. ఎనిమిదేళ్ల తరువాత భారత జట్టులో చోటు దక్కించుకున్న కరుణ్ నాయర్ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఇంగ్లాండ్ పర్యటనలో నాలుగు మ్యాచ్‌లు ఆడి 21.83 సగటుతో 205 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఓ హాఫ్ సెంచరీ ఉంది. కీలకమైన మూడో స్థానంలో పలు మ్యాచ్‌లో ఆడినప్పటికి కూడా అక్కడ కూడా రాణించలేకపోయాడు. ఇంగ్లాండ్ పర్యటనకు అనూహ్యంగా శార్దూల్ ఠాకూర్ ఎంపిక అయ్యాడు. ఈ స్టార్ ఆల్‌రౌండర్ రెండు మ్యాచ్‌లు ఆడి కేవలం రెండు వికెట్లు మాత్రమే తీశాడు. నాలుగో టెస్టులో 41 పరుగులు చేయడమే ఈ సిరీస్‌లో అతడు బ్యాటింగ్‌లో ఇచ్చిన ఏకైక సహకారం. కండిషన్స్ దృష్ట్యా కూడా విండీస్ టెస్టులో అతడికి చోటు దక్కకపోవచ్చు. ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్ గాయాల కారణంగా అనూహ్యంగా సిరీస్ మధ్యలో అన్షుల్ కాంబోజ్‌ను ఎంపిక చేశారు. ఈ పేసర్ నాలుగో టెస్టు మ్యాచ్‌లో అరంగ్రేటం చేసినప్పటికి పెద్దగా ఆకట్టుకోలేదు. ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ ఉండడంతో విండీస్‌తో సిరీస్‌లో ఇతడికి చోటు దక్కకపోవచ్చు. ఇక వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంగ్లాండ్ మ్యాచ్‌లో కేవలం 3 బుమ్రా ఆడాడు. దీని తరువాత పలు కీలక సిరీస్‌లు ఉండడంతో బుమ్రాకు స్వదేశంలో జరిగే విండీస్‌తో సిరీస్‌కు విశ్రాంతి ఇవ్వవచ్చు. కాగా రిషబ్ పంత్ గాయపడడంతో అతడి బ్యాకప్‌గా ఇంగ్లాండ్ పర్యటన మధ్యలో జగదీశన్ వచ్చాడు. ఇతడికి విండీస్ సిరీస్‌లో చోటు దక్కడం అనుమానమే. జిమ్ సెషన్‌లో గాయపడడంతో ఇంగ్లాండ్ పర్యటన మధ్యలోనే నితీశ్ కుమార్ వచ్చేశాడు. అతడు కోలుకునేందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. నాలుగో టెస్టులో రివర్స్ స్వీప్ షాట్ ఆడుతూ గాయపడిన రిషబ్ పంత్‌కు ఈ సిరీస్‌లో విశ్రాంతి ఇవ్వొచ్చు.




## ఐసిసి ర్యాంకింగ్స్‌లో
# బుమ్రా నంబర్ 1
### టాప్ 5కు జైస్వాల్.. 12 స్థానాలు ఎగబాకిన సిరాజ్



**న్యూఢిల్లీ:** ఐసీసీ ర్యాంకింగ్‌లో టెస్ట్ బౌలర్ల జాబితాలో భారత పేసర్ జస్ప్రిత్ బుమ్రా నెంబర్ వన్ గా కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న రబాడ కంటే బుమ్రా ఖాతాలో 38 రేటింగ్ పాట్లు ఎక్కువగా ఉన్నాయి. పాట్ కమిన్స్ 3, మాట్ హెన్రీ 4, జోష్ హేజిల్‌వుడ్ 5వ స్థానంలో ఉన్నారు. భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ టాప్ 5లో చోటు దక్కించుకున్నాడు. టీమిండియా పేసర్ మహమ్మద్ సిరాజ్ 12 స్థానాలు ఎకబాకాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ బుధవారం ర్యాంకింగ్‌లను విడుదల చేసింది.ఐదవ టెస్ట్‌లో సెంచరీ సాధించిన ఏకైక భారతీయ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో 3 స్థానాలు ఎగబాకాడు. అతను టాప్ 5లో చేరాడు. అతను ఇంతకు ముందు 8వ స్థానంలో ఉన్నాడు. మరియు ఇప్పుడు 792 రేటింగ్‌తో ఐదవ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ ఒక స్థానం ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నాడు. నంబర్ 1 టెస్ట్ బ్యాట్స్‌మన్ కిరీటం జో రూట్ వద్దే ఉంది, అతను 5వ టెస్ట్‌లో సెంచరీ కూడా సాధించాడు. కాగా ఇంగ్లాండ్‌తో జరిగిన 5వ టెస్ట్‌లో సిరాజ్ మొత్తం 9 వికెట్లు తీశాడు. సిరీస్ లో బెస్ట్ బౌలింగ్ తో 23 వికెట్లు తీసి లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచిన సిరాజ్ 674 రేటింగ్‌తో టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్‌లో 15వ స్థానంలో ఉన్నాడు. ఇంతకు ముందు 27వ స్థానంలో ఉన్నాడు. అలాగే బౌలింగ్ ర్యాంకింగ్‌లో రవీంద్ర జడేజా 3 స్థానాలు కోల్పోయి 14 నుంచి 17వ స్థానానికి పడిపోయాడు.

# రెపోరేట్లు యధాతథం
### ట్రంప్ సుంకాల వార్నింగ్..అంతర్జాతీయ ధోరణులే కీలకం!



**ముంబయి, ఆగస్టు 6:** వడ్డీరేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన రిజర్వుబ్యాంకు ఈసారి మాత్రం అప్రమత్తంగా వ్యవహరించింది. ట్రంప్ ట్యారిఫ్ హెచ్చరికలు, అంతర్జాతీయ పరిణామాల రకమంలో వడ్డీరేట్లను యధాతథంగా 5.5శాతం వద్దనే ఉంచింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం ద్రవ్యపరపతి విధాన సమీక్ష వివరాలను తెలిపారు. ద్రవ్యోల్బణం అంచనాలకు మించి తగ్గినప్పటికీ అమెరికా ట్యారిఫ్‌లపై అనిశ్చితులు ఇంకా తొలగ లేదని ఆర్బీఐ గవర్నర్ అన్నారు. అందువల్లనే రెపోరేటును యధా తథంగా 5.5శాతంవద్దనే ఉంచాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించిందన్నారు. ఇక స్థిరమైన విధాన వైఖరిని కమిటీ మరికొంతకాలం కొనసాగిస్తుందని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్‌పాయింట్లమేర తగ్గించిన ఆర్‌బిఐ జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లుకోత పెట్టింది. దీనితో ఈ ఏడాదిలో ఇప్పటివరకూ రెపోరేటు ఒకశాతంవరకూ దిగివచ్చింది. రుతు పవనాలు సమృద్ధిగా కొనసాగుతున్నందున ఆర్థి కవ్యవస్థలో కొంత ఉత్తేజం ఉందని, సాధారణం కంటే సగటు వర్షపాతం ఎక్కువ నమోదయిందని, ద్రవ్యోల్బణం మరింత దిగివస్తుందని, ఆర్థికవ్యవస్థకు మరింత ఊతం ఇస్తుందని ఎంపిసి భావించింది.ప్రస్తుత ద్రవ్యోల్బణం స్థిరంగా 4శాతం వద్దనే ఉంది. 2025-26 ఆర్థికసంవత్సరానికిగాను ద్రవ్యోల్బణం 3.1శాతంవరకూ దిగిరావచ్చని అంచనా. కరెంటుఖాతాలోటు స్థిరమైన స్థాయిలోనే ఉండే అవకాశం ఉంది. వ్యవస్థలో ద్రవ్యలభ్యత మిగులుస్థాయిలోనే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను వృద్ధిరేటు 6.5శాతంగా ఉంటుందని, భౌగోళిక ఆర్థిక రాజకీయ ఉద్రిక్తతలు వృద్ధికి కొంతమేర ఆటంకంగా మారే ప్రమాదం ఉన్నా భారత ఆర్థికవ్యవస్థ స్థిరంగా ముందుకువెళుతున్నదని ధరల స్థిరీకరణ కొనసాగుతోందన్నారు. బ్యాంకు లాకర్లలో ఉంచిన వస్తువులు,ఖాతాలకు సంబంధించి క్లెయిమ్ పరిష్కారాన్ని ఆర్బీఐ ప్రామాణీకరించనున్నట్లు ప్రకటించింది.


## ఇకపై మ్యూల్ ఖాతాల సెటిల్‌మెంట్లు ఈజీ..

**ముంబయి, ఆగస్టు 6:** మరణించిన వ్యక్తులకు చెందిన బ్యాంక్ ఖాతాలు, లాకర్లకు సంబంధించి క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను ఆర్‌బిఐ ప్రామాణీకరిస్తోంది. మరణించిన వ్యక్తుల ఖాతాలు లాకర్ల పరంగా నామినీల క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ప్రక్రియను సులభతరంచేయనుంది. మరణించిన వారి బ్యాం కు ఖాతాల్లోని నగదు, లాకర్లలోని ముఖ్యమైన వస్తువులను తమ వారికి సులువుగాచేరవేయడం లక్ష్యంగా ఈవిధానం మారుస్తున్నట్లుగవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఆర్‌బిఐఎంపిసి నిర్ణయాలను వెల్లడించిన ఆయన మాట్లాడుటూ బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టం 1949 ప్రకారం మరణించిన వ్యక్తుల ఖాతాల్లోని నగదు, లాకర్లు,సేఫ్కస్టడీలోని వస్తువులు నామినీకి చెందుతాయి. నామినీ లేదా చట్టబద్ధ వారసులుచేసే క్లెయిమ్‌లను పరిష్కరించడమే దీని ఉద్దేశ్యమని ప్రస్తుతం వివిధ బ్యాంకులు వేరువేరు పద్ధతులు అవలంభిస్తున్నాయని, ఒక్కోబ్యాంకు ఒక్కో డాక్యుమెంట్ అడు గుతున్నాయన్నారు. కానినీ లేని ఖాతాల పరంగా ఒక్కోబ్యాంకు ఒక్కోపద్ధతిపాటిస్తున్నాయి. ఇకపై అన్ని బ్యాంకుల్లోను ఒకే డాక్యుమెంటేషన్‌ప్రక్రియ ఉండటంతో పాటు ఇది సులువుగా ఉండేలా ముసాయిదా సర్క్యులర్ త్వరలో జారీచేయనున్నట్లు ఆర్‌బిఐ గవర్నర్ తెలిపారు. దీనిపై ప్రజలనుంచి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. అలాగే ప్రభుత్వం జారీచేసే ట్రెజరీ బిల్స్ సిప్ పద్ధతిలో పెట్టుబడులు పెట్టే వెసులుబాటును రిటైల్ డైరెక్ట్ వేదిక ద్వారా రిటైల్ ఇన్వెస్టర్లకు కల్పించనున్నట్లు తెలిపారు.

# ట్రంప్ సుంకాల ప్రభావం తక్కువే



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం మేర సుంకాలు (టారిఫ్‌లు) విధిస్తామని, 24 గంటల్లో మరిన్ని సుంకాలు తప్పవని ట్రంప్‌చేసిన హెచ్చరికలు, వాటివల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం చాలా పరిమితంగానే ఉంటుందని ప్రముఖ పరిశ్రమల సమాఖ్య పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) స్పష్టం చేసింది. ఈ సుంకాల వల్ల దేశ జీడీపీపై కేవలం 0.19 శాతం మేరకే ప్రభావం ఉంటుందని బుధవారం విడుదల చేసిన ఒక నివేదికలో అంచనా వేసింది. ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానున్న ఈ సుంకాల వల్ల అమెరికాకు భారత్ నుంచి వెళ్లే సుమారు 8.1 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులపై ప్రభావం పడనుంది. ఇది భారతదేశ మొత్తం అంతర్జాతీయ వాణిజ్య ఎగుమతుల్లో 1.87 శాతానికి సమానమని పీహెచ్‌డీసీసీఐ తెలిపింది. తమ విశ్లేషణ ప్రకారం, స్థూల ఆర్థిక స్థాయిలో ఈ ప్రభావం నిర్వహించదగినదేనని పేర్కొంది. అమెరికా విధించనున్న ఈ టారిఫ్‌ల వల్ల ప్రధానంగా ఇంజనీరింగ్ వస్తువులు (1.8 బిలియన్ డాలర్లు), ఎలక్ట్రానిక్ వస్తువులు (1.4 బిలియన్ డాలర్లు), ఫార్మాస్యూటికల్స్ (986 మిలియన్ డాలర్లు), రత్నాలు, ఆభరణాలు (932 మిలియన్ డాలర్లు), రెడీమేడ్ దుస్తులు (500 మిలియన్ డాలర్లు) వంటి రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదిక వివరించింది. ఈ సుంకాల ప్రభావాన్ని అధిగమించేందుకు పీహెచ్‌డీసీసీఐ నాలుగు సూత్రాల వ్యూహాన్ని ప్రతిపాదించింది. అమెరికాలోని ప్రముఖ రిటైలర్లతో చర్చించి, మెరుగైన ధరలకు ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఐరోపా సమాఖ్య (ఈయూ), కెనడా, లాటిన్ అమెరికా వంటి కొత్త మార్కెట్లపై దృష్టి సారించడం వంటివి ఈ వ్యూహంలో భాగమని తెలిపింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.